ఆగస్టు - 2021

DECCAN LAND, HYDERABAD

108

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





- తెలంగాణ దళిత బంధు
- సాంకేతిక రంగంలో బిగ్‌డేటా
- రామప్ప దేవాలయానికి విశ్వమంతా గుర్తింపు
- సామరస్య పర్యావరణం - అభివృద్ధి-పరిరక్షణ






# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)




## బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

### తెలంగాణ బడి పిల్లల కథలు







పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం. పిల్లలలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. **'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'** తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.







10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300

ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716,
స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com*
*website : www.balachelimi.com*













## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






## నిప్పుల కొలిమి

మనిషిని మనిషికి కాకుండా చేస్తున్న, మనను మనకు కాకుండా చేస్తున్న ఒక మహమ్మారి మన ఊళ్లనూ, మన సామూహిక జీవనాన్నీ, మన ఆనందాలనూ, మన సంస్కృతినీ దెబ్బ తీస్తున్నప్పుడే మన కులవృత్తులు కూడా అణగారిపోయినై. ఒక కొలిమి మూతపడ్డదంటే ఒక వృత్తి అంతరించిందని మాత్రమే కాదు, ఒక సామూహిక జీవన సౌందర్యం అస్తమించిందని. ఒక అద్భుత కళానైపుణ్యం విధ్వంసమవుతున్నదని. వ్యవసాయం అవసరం లేని, వ్యవసాయ పరికరాల కమ్మరి కొలిమి అవసరం లేని ఒక నిరామయ, నిస్తబ్ధ, నిరాశాపూరిత వాతావరణం మన ఊళ్లను కమ్మేసింది. విశ్వకర్మీయుల/ విశ్వబ్రాహ్మణుల పంచ వృత్తులలో మొట్టమొదటి వృత్తి కమ్మరము. ఇనుమును కరిగించి వస్తువును తయారు చేసి ప్రపంచ పారిశ్రామిక వ్యవస్థకు మూల పురుషుడు లోహశిల్పి కమ్మరి. భగభగ మండే కొలిమి ముందు కూర్చుని వేడిని లెక్క చేయక రైతుకు అవసరమైన పనిముట్లు చేస్తాడు.

TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com







## సందేశాన్నిస్తున్న ముఖచిత్రం

కులవృత్తులు దాదాపు క్షీణించి పోతున్న సందర్భంలో వాటిని ప్రోత్సహిస్తూ ప్రతి నెల దక్కన్ ల్యాండ్ మాసపత్రిక అందిస్తున్న కుల వృత్తుల ముఖ చిత్రాలను చూస్తుంటే ఏదో సందేశాన్ని ఇస్తున్నట్లుగా ఉంది. అంతరించిపోతున్న కులవృత్తులను వెలికితీసి, భావితరాలకు తెలియజేస్తున్న దక్కన్‌ల్యాండ్ సంపాదకులు మణికొండ వేదకుమార్‌గారికి ధన్యవాదాలు.

**– వేణుగోపాల్, కో-కన్వీనర్, ఇంటాక్, కడప**

❖ ❖ ❖

## వారసత్వ పరిరక్షణ

కళలు, సంస్కృతిపట్ల ఎనలేని ఆసక్తితో వాటి పరిరక్షణకు కృషి చేస్తున్న యం. వేదకుమార్ గారికి ధన్యవాదాలు. తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్‌గా సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, పర్యావరణ అంశాలపై అనేక ప్రచురణలు అందుబాటులోకి తెచ్చారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్‌గా మరియు ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ హెరిటేజ్ క్లబ్‌లను ఏర్పాటు చేసిన మీకు ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రతి మాసం మీ ఎడిటోరియల్‌లో పర్యావరణం, విద్య, జనాభా పెరుగుదల తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరియు సమాజానికి అందిస్తున్న తీరు అమోఘం.

**– గరిపల్లి అశోక్, సిద్ధిపేట**

❖ ❖ ❖

## నీటి వివాదంపై సమగ్ర వ్యాసం

తెలుగు రాష్ట్రాల మధ్య తలెత్తిన నీటి వివాదాన్ని రచయిత శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే 'ఆంధ్రా నీటి దోపిడి నిరోధానికి అనివార్య ప్రతిచర్య' వ్యాసంలో వాస్తవాలను గణాంకాలతో సహా విశ్లేషించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఉన్న శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసి) సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచే పనులకు, రోజుకు 3 టీఎంసీ నీటిని ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పరిపాలనా అనుమతినిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మే 5న జీఓ నంబరు 203ను జారీ చేసి, టెండర్లు పిలిచి పనులను ప్రారంభించిన విషయాన్ని జీవోలతో సహా అందించారు. రెండు రాష్ట్రాల పూర్వ పరాలను, మంచిచెడ్డలను, తెలంగాణా రాష్ట్ర ప్రాజెక్టులపై పడే ప్రభావాలు, ఆంధ్రప్రదేశ్ తరపున వస్తున్న అసంబద్ధ వాదనలను చక్కగా వివరించారు.

**–ఎ. వెంకట సృజన్, పాలమూరు**

❖ ❖ ❖

## తెలంగాణ ఐటి అభివృద్ధిలో మేటి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, ఐటి మంత్రి కె. తారక రామారావులు కృషి, పట్టుదలతో సమస్యలు, సవాళ్లను అధిగమిస్తూ లక్ష్యాలను చేరుకున్నారు. వారి నిబద్ధతో ఐటి, పరిశ్రమలు వృద్ధిరేటు గణనీయంగా పెరుగుతుంది. కోవిడ్‌తో వివిధ రాష్ట్రాల ఆదాయాలు తలకిందులు అవుతున్న కష్టకాలంలో కూడా తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. దాదాపు అన్ని రంగాల్లో అభివృద్ధి అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ఆపత్కాల పరిస్థితుల్లో కూడా నిలకడైన పెట్టుబడులను రాష్ట్రం ఎలా ఆహ్వానిస్తుంది వంటి సందేహాలను తెలంగాణ రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ వివరించారు. జీనోం వ్యాలీ, మెడిసిన్ ఫ్రమ్ ద స్కై, టీ-హబ్, అంతరిక్ష పెట్టుబడుల కోసం సమగ్ర పాలసీ, ఎలక్ట్రానిక్స్, అపారెల్ రంగంలో పెట్టుబడుల, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, ప్యాకేజింగ్ రంగంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని గణాంకాలతో సహా అందించిన జయేశ్ రంజన్, రచయిత కట్టా ప్రభాకర్‌కు ధన్యవాదాలు.

**– నూతన ప్రవలిక, హైదరాబాద్**

❖ ❖ ❖

## దాచుకోదగ్గ పత్రిక

పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయరంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై ప్రత్యేక వ్యాసాలు, ఇంటర్వ్యూలు అందిస్తున్న దక్కన్ ల్యాండ్ మాసపత్రిక యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు

**– బి.ఆర్.చలపతి, మెదక్**

ద

## పరిశోధకులకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 12 పేజీలు: 60

ఆగస్టు - 2021

ISSN 2581-3188


విషయసూచిక

# లోపలి పేజీల్లో...




గుండేరావు హర్కారే ........ ఆచార్య మసన చెన్నప్ప ........ 6

కలలు నిజమైన వేళ.... (ఎడిటోరియల్) ........ ఎం. వేదకుమార్ ........ 7

చరిత్రకెక్కిన హైదరాబాద్ మెడికల్ స్కూల్ ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 9

అడుగడుగున కథ ఉంది 'సుల్తాన్ బజార్' ........ పరవస్తు లోకేశ్వర్ ........ 13

రెండో పులకేశి హైదరాబాదు రాగిరేకు శాసనం ........ ఈమని శివనాగిరెడ్డి ........ 15

వరల్డ్ ఫొటోగ్రఫీ డే ........ ఎసికె. శ్రీహరి ........ 18

సామరస్య పర్యావరణం - అభివృద్ధి - పరిరక్షణ ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 19

జాంబపురాణం - ప్రదర్శనా వైవిధ్యం ........ డా॥ గడ్డం వెంకన్న ........ 21

బిగ్‌డేటా...!! ........ పుట్టా పెద్ద ఓబులేసు ........ 23

మన రామప్పకు విశ్వమంతా గుర్తింపు ........ సువేగా ........ 27

తెలంగాణ దళిత బంధు ........ కట్టా ప్రభాకర్ ........ 31

రిప్ వాన్ వింకిల్ ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 40

నిప్పుల కొలిమే.... జీవనాధారం ........ సువేగా ........ 41

కొడవటిగంటి సైన్స్ రచనా ప్రణాళిక ........ నాగసూరి వేణుగోపాల్ ........ 44

గణపురం గుళ్ళ నిర్మాత పసాయిత గణపతిరెడ్డి ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 47

భూ పరిమాణ శాస్త్రం - సర్వేల విధానం! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 51

జీవాల్ని పోషించే పద్ధతులు ........ ఆనబోయిన స్వామి ........ 55

మార్పిడి (కథ) ........ బాల చెలిమి ........ 57


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే 'దక్కన్ ల్యాండ్' లక్ష్యం.


సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ

**కొలిమి**

చిత్రాలు

**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.

# గుండేరావు హర్కారే

పట్నములోన హైదరాబాదు గొప్ప
హైద్రాబాదులోన పాటపత్నంబు గొప్ప
పాతపట్నంబులో గొప్ప పదియురెండు
భాషలెరిగిన హర్కారె పండితుండు
(తెలంగాణోదయం)

బహుభాషలలోను, బహుశాస్త్రాలలోను ఉత్తమశ్రేణికి చెందిన పండితుడు గుండేరావు హర్కారే. ఎంత పాండిత్యముంటే, అంత ఒదిగి ఉండాలని నిరూపించిన శాంతమూర్తి ఆయన. త్రికరణ శుద్ధికి మారుపేరుగా నిలిచిన హర్కారే జీవితంలో అంచెలంచెలుగా ఎదుగుతూ త్రివిక్రమణ్ణి తలపించాడు.



గుండేరావు న్యాయశాస్త్రంలో ఎంత దిట్టనో, వ్యాకరణ శాస్త్రంలోను అంతే దిట్ట. పాణిని రచించిన అష్టాధ్యాయికి, ఆధునిక విజ్ఞానాన్ని అనుసరించి, విద్యార్థుల సౌకర్యార్థం 'Sanskrit Grammar Made Easy' పేరుతో ఒక యంత్రాన్ని తయారు చేశాడు. ఇది ఆయనకు గొప్ప కీర్తిని తెచ్చిపెట్టింది.

తెలుగుతో పాటు దేశవిదేశ భాషలలో సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తైతే, సంస్కృతంలో గుండేరావు సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తు. ద్వాదశ భాషా పండితుడు. ఆయన నా దృష్టిలో ఒక భాషా పండితుడే కాదు, ఒక విజ్ఞాన సర్వస్వం.

గుండేరావు సీతాబాయి. రామారావులకు 1887 మార్చి 13వ తేదీన హైదరాబాదు నగరంలో జన్మించాడు. వీరి ఇంటి పేరు హర్కారే. బహుశా ఇది వీరి వంశీయుల పనితనాన్ని బట్టి వచ్చిన బిరుదనామం. గుండేరావు పూర్వీకులది మహారాష్ట్ర. వివిధ జిల్లాల నుండి, పరగణాల నుండి ప్రభుత్వానికి అధికారికంగా వార్తలను చేరవేసే నమ్మకమైన దూతలకే హర్కారులని పేరు. బహుశా ఈ పేరుగల వారు దేశంలో ఎక్కడున్నా వారు ప్రభుత్వానికి నమ్మకంగా పనిజేస్తూ పేరు తెచ్చుకున్నవారే.

గుండేవారు హర్కారే జీవిత చరిత్రను అధ్యయనం చేస్తే ఈ విషయం స్పష్టంగా మన కర్థమవుతుంది.

హర్కారే పండితుడు. దేశకాల పరిస్థితులననుసరించి బాల్యంలో నిజాం రాష్ట్రవాసి కావడం వల్ల పర్షియన్, అరబిక్ భాషలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ తర్వాతనే తెలుగు, మరాఠీ భాషలు నేర్చుకొన్నాడు. ఈ రెండు భాషలను ప్రైవేట్‌గా నేర్చుకోవలసి వచ్చింది. ఇక్కడ గమనించవలసిన అంశాలు మూడున్నాయి. వారు నేర్చుకున్న భాషలలో ఒకటి మాతృభాష, రెండు స్థానిక భాష, మూడు రాజభాష ఉండడం విశేషం. ఆ తర్వాత హర్కారే ఆంగ్లపాఠశాలలో తన 12వ ఏట చేరి, 1906 ప్రాంతంలో మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరయ్యాడు. ఆ తర్వాత కుటుంబపరిస్థితుల కారణంగా చదువుకు దూరమయ్యాడు. ఉద్యోగానికి చేరువయ్యాడు. 1908లో నగరంలోని న్యాయస్థానంలో గుమస్తాగా ప్రవేశించాడు.

అనువాదకులకు వివిధ భాషలలో పరిచయం ఉండడమేగాక, అనువాద కౌశల్యం కూడా ఉండాలి. హర్కారే ఒక గుమస్తాగా ఉండి, శ్రద్ధాభక్తులతో భాషారాధ్య చేసినాడు. అందుకే న్యాయస్థానం ఆయనకు 1908లో ఒకేసారి పదోన్నతిని పెంచి, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుకి బదిలీ చేశారు. అక్కడ హర్కారే మంచి అనువాదకుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత ఆయన పనితనాన్ని గుర్తించి నిజాం ప్రభుత్వం ఆయనను 1914లో ఉన్నత న్యాయస్థానానికి (Highcourt) బదిలీ చేసింది. అప్పుడు హర్కారే ప్రధాన న్యాయమూర్తికి అంతరంగిక కార్యదర్శిగా నియుక్తుడయ్యాడు.

భాషా పండితునిగా, సాహితీవేత్తగా ఒకవైపు గుర్తింపు తెచ్చుకున్న హర్కారే – హైకోర్టులో తన సేవలకుగాను గద్వాల సంస్థానంలో 1919లో మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా నియమింపబడినాడు. 1948 దాకా ఆయన అక్కడ పనిచేశాడు. సుమారు అక్కడి 30 ఏండ్ల ఉద్యోగకాలంలో ఆయన జిల్లా న్యాయాధీశుడుగా, కలెక్టర్‌గా, సెషన్స్ జడ్జిగా ఉన్నత పదవులను అధిరోహించాడు.

గద్వాలలో ఉన్న రోజుల్లో గుండేరావు న్యాయాధీశుడుగానే కాక గొప్ప పండితునిగా వెలుగొందాడు. గద్వాల సంస్థానాధీశురాలైన రాణి మహలక్ష్మమ్మ ఆదరాభిమానాలు చూరగొన్న హర్కారే తరుచుగా ఆస్థానానికి వెళ్లేవాడు. ఆస్థానానికి వచ్చే పండితుల ప్రేమకు, గౌరవానికి గుండేరావు ఆలవాలమయ్యాడు. ఆస్థానంలో జరిగే సాహితీచర్చలకు, అవధానాలకు సాక్షిగా నిలబడ్డాడు. గద్వాల సంస్థానానికి కొప్పెరపు కవులు వచ్చిన సందర్భంలో హర్కారే రాణిగారి ఆస్థానంలో ఉండడం విశేషం.

గుండేరావు తర్కన్యాయ వేదాంత శాస్త్రాలతోనేగాక గణితశాస్త్రంలోను నేర్పరి అనటానికి ఈ సందర్భంగా ఒక సంఘటనను వివరించక తప్పదు (స్వయంగా హర్కారే నాకు చెప్పిన విషయాన్ని ఇక్కడ పొందు పరుస్తున్నాను).

గద్వాల సంస్థానానికి, నిజాం సర్కారుకి పన్నుల బాకీ విషయంలోపేచీ ఏర్పడింది. ముప్పైవేల రూపాయల పన్ను కట్టాలని మంత్రిగా ఉన్న సాలార్‌జంగ్ సంస్థానానికి తాఖీదు పంపించాడు. ఈ సంగతి ఎట్లాగో గుండేరావు హర్కారే దృష్టికి వచ్చింది. ఆయన లెక్కలన్నీ తీసి, అదివరకు కట్టినవి తీసేసి – చివరికి మూడువందలు మాత్రమే కట్టవలసి ఉన్నాయని తేల్చి చెప్పినాడట. ఈ విషయం తెలుసుకున్న సాలార్‌జంగ్ గుండేరావును గౌరవంగా హైదరాబాదులో జరిగిన ఒక

(మిగతా 8వ పేజీలో)

# కలలు నిజమైన వేళ...

ఎన్నాళ్లకి కల నిజమైంది వారసత్వ కట్టడాల పరిరక్షణ ప్రేమికులందరికీ పండుగ. రామప్ప ఆలయం ప్రపంచ వారసత్వ సంపద (వరల్డ్ హెరిటేజ్ సైట్)గా గుర్తింపుపొందింది. తెలంగాణలోని రామప్ప ఆలయం శిల్పకళా ప్రశస్తి అజరామరమైనది. 800 సంవత్సరాల క్రితం కాకతీయ రాజులు చేత నిర్మించబడింది. రామప్ప అనే శిల్పకారుని నేతృత్వంలో అనేక మంది శిల్పుల చేత సృష్టించబడిన శిల్ప సంపదయిది. రుద్రేశ్వర ఆలయాన్ని నిర్మించిన రుద్రుడు ఆలయానికి రామప్ప పేరు పెట్టాడు. ఒక దేవాలయానికి శిల్పకారుని పేరు పెట్టడం అంతకుముందుగానీ ఆతర్వాత గానీ జరగలేదు. రామప్ప దేవాలయంలోని విగ్రహాలు, శిల్పాలు నల్లగ్రానైట్‌తో చెక్కబడ్డాయి. దీనిని చెక్కడం సులువుకాదు. శిల్పకారులు నేర్పరి తనంతో, శ్రద్ధగా, ఏకాగ్రతతో ఈ శిల్ప నిర్మాణం చేశారు. ఆనాటి కాలంలో జీవించిన స్త్రీ మూర్తుల సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు, వారి భావోద్వేగాలకు అద్దం పట్టేలా తమ కళా చాతుర్యాన్ని చూపిన శిల్పసంపద ఈ రామప్ప దేవాలయం.

60 సంవత్సరాల ఉమ్మడి పాలనలో ఏ గుర్తింపుకూ నోచుకోలేదు. తెలంగాణ ఏర్పడిన తరువాత మన ప్రభుత్వం తెలంగాణ ప్రాంతీయ చరిత్ర, సంస్కృతి, నాగరికత, సాహిత్యం, కళా సాంస్కృతిక వారసత్వ నైపుణ్యాలను వెలుగులోకి తెచ్చి వాటి అభివృద్ధికి విశేష కృషి చేస్తుంది.




రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ సంపద స్థాయిని సంపాదించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎడతెరిపిలేని కృషి చేసింది. రాష్ట్ర, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు, హెరిటేజ్ తెలంగాణ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, వివిధ సంస్థలు, సలహాదారులు, సాంకేతిక నిపుణులు మరియు వ్యక్తుల కృషి ఎంతో ఉంది. యునెస్కో అధికార బృందం రామప్ప ఆలయాన్ని సందర్శించి అధ్యయనం చేసి రిపోర్ట్ పంపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యునెస్కోకి చేసిన ప్రతిపాదనల వల్ల ఈ రోజు రామప్ప ఆలయం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపుపొందింది.

ఈ విజయాన్ని సాధించిన మన రాష్ట్ర ప్రభుత్వానికి దక్కన్‌ల్యాండ్ అభినందనలు తెలుపుతుంది.

దళితుల స్వావలంబనతో మరో కల నిజం కాబోతుంది. సాంఘిక వివక్షకు గురైన అణగారిన ఈ వర్గం స్వాతంత్ర్యానంతరం కూడా దాదాపు అదే స్థితిలో ఉంది. విద్యా, ఆర్థిక రంగాలలో స్వావలంబన మాత్రమే ఈ వివక్ష నుండి విముక్తి కలిగించగలుగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల జీవితాల్లో మార్పులు తెచ్చి ప్రతివర్గమూ స్వావలంబనతో తలెత్తుకునేలా చేస్తుంది.

దళితుల ఆర్థిక స్వావలంబన కోసం దళితబంధు పథకాన్ని అమలు చేయబోతుంది. ఇది దళితుల జీవితాల్లో గుణాత్మక మార్పులకు దారితీస్తుంది. దీనికోసం జీవోను విడుదల చేసింది. వివిధ రంగాలలో సద్వినియోగపడేలా పర్యవేక్షించి, దీనిని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర, నిర్దిష్ట ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలనే భావన, క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించి, అంకితభావంతో పనిచేసే అధికారులను నియమిస్తుంది. హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్ట్ కేస్ స్టడీగా, ఒక మోడల్‌గా ముందు ముందు ఈ పథకం మరింత బాగా అమలు చేయడానికి దోహదపడుతుందని ఆశిద్దాము.

తరతరాలుగా వివక్షతకు, పేదరికానికి గురవుతున్న దళితుల జీవితాల్లో వెలుగు నింపబోతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కృషి అభినందనీయం.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

విందు కార్యక్రమానికి ఆహ్వానించాడట.

అక్కడ స్వయంగా సాలార్‌జంగ్ గుండేరావును అభినందిస్తూ – యధాలాపంగా "నీలాంటి పండితుడు మా మతంలో చేరితే మా మతానికెంతో వన్నె కల్గుతుది" అని ప్రలోభపెట్టాడట. వెంటనే హర్కారే వినయంగా "ఇంకో మతం నుంచి మీ మతంలోనికి వచ్చేవాళ్ల వల్లనే మీ మతం వన్నెకెక్కడం నాకు తృప్తి కల్గించడం లేదు" అని సున్నితంగా సమాధానమిచ్చాడట.

గుండేరావు ధైర్యశాలి అంటానికి ఒక సంఘటనను తప్పక వివరించాలి. భారత ప్రభుత్వం టంగుటూరి ప్రకాశం పంతులు గారిని బంధించడానికి సన్నాహాలు చేసింది. పోలీసుల కన్నుగప్పి ప్రకాశంగారు ఒక నాల్గురోజుల కోసం గద్వాల సంస్థానానికి వచ్చాడు. మూరువేషంలో ఉన్న ప్రకాశంగారికి గుండేరావు తన ఇంట్లో నాల్గురోజులు ఆతిథ్యమిచ్చి, ఆ నాల్గురోజుల్లో ఆయన కూర్చొనగల్గినరీతిలో ఒక బలమైన వెదురుబుట్ట తయారుచేయించి – తద్వారా కండపుష్టిగల సేవలకుతో మోయించి, ప్రకాశం గారిని రహస్యస్థావరానికి చేర్చినాడట. ఈసంఘటనను హర్కారే గారు నాకు వివరించినప్పుడే కాదు, దీన్ని రాస్తున్నప్పుడు కూడా నా ఒళ్లు జలదరించింది.

గుండేరావు బలమైన వ్యక్తి. ఆయన ఆకారం ఒక కొండను తలపిస్తుంది. లేదా ఏనుగును తలపిస్తుంది లేదా గుమ్మడికాయను గుర్తుకు తెస్తుంది. అరబ్బులతో ముష్టి యుద్ధం చేసిన సాహసి. ఉదయం, సాయంత్రం ధ్యానానికి ప్రాధాన్యం ఇచ్చినట్లే వ్యాయామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినాడు. ముష్టిఘాతాలతో ఆయన శరీరం గట్టిపడింది.

హర్కారే గద్వాలలో ఉన్నప్పుడు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే అధ్యయనశీలియై అనేకానేక పరీక్షలు రాసి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తీరిక దొరికితేచాలు ఏ కావ్యాన్నో లేదా ఏ శాస్త్రాన్నో చదవాలన్న కోరిక ఆయనది.

మద్రాసు విశ్వవిద్యాలయం నిర్వహించిన న్యాయశిరోమణి, సాహిత్యశిరోమణి పరీక్షలలోను, ధర్మశాస్త్రంలోను, తులనాత్మక సాహిత్యంలోను నిర్వహించిన పి.ఓ.ఎల్. పరీక్షలందును హర్కారే తన ప్రతిభను చూపించి విజయాన్ని సాధించాడు. న్యాయశాస్త్రంలో నిష్ణాతుడైన గుండేరావుకు న్యాయశాస్త్రానికి కేంద్రమైన 'నవద్వీప్'లోని పండితపరిషత్తు 'వాచస్పతి' పట్టాన్ని ఇచ్చి గౌరవించింది. అయోధ్య, బెల్గాం పట్టణాల్లోని ప్రతిష్ఠాత్మకమైన పండితసభ గుండేరావుకు 'విద్యాభూషణ' బిరుదం ఇచ్చి గౌరవించింది.

గుండేరావు కేవలం పండితుడేకాదు. గొప్ప రచయిత కూడా. ఆయన రచనలు వెలుగులోకి వస్తే మరాఠీ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషలలో ఆయన చేసిన కృషి ప్రపంచానికి తెలుస్తుంది. కాని చాలమటుకు అవి మరుగునపడి ఉన్నాయి. ఐతే ఆయన చేసిన అనువాదాలు సంస్కృత పండితులనే ఆశ్చర్యపరచినవి. ఒక తెలుగువాడు ఆంగ్లం నుండో హిందీ నుండో, సంస్కృతం నుండో తెలుగులోకి అనువదిస్తే ఎంతో గొప్ప. కాని గుండేరావు అద్భుతమైన అనువాద కౌశల్యానికి ఆయన సంస్కృతానువాదాలే గట్టి నిదర్శనం.

సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి పింగళినూరని కళాపూర్ణోదయాన్ని సంస్కృతంలో అనువదించగా, గుండేరావుగారు 'ప్రభావతీ ప్రద్యుమ్నం'ను సంస్కృతంలోకి అనువదించాడు. ఇదొక అద్భుతమైన రచన. గుండేరావుగారి ఈ అనువాదం వారి చివరిదశలో జరిగింది. ఆ సమయంలోనే నేను వారికి అంతేవాసిని కావడం నా అదృష్టం.

గుండేరావు సంస్కృత అనువాద రచనలు మహత్తరమైనవి. ఆయనకు ఆంగ్లం మంచినీళ్లప్రాయమైంది. తెలుగుభాష – క్షీరసదృశం కాగా సంస్కృతం అమృతాయమానమైంది. ఆంగ్ల రచనలను సంస్కృతంలోకి అనువదించడమంటే ఆయనకు చాలా సరదా! ఎంతో గొప్ప పండితుడైనప్పటికీ సారళ్యానికి, శిల్పానికి ప్రాధాన్యం ఇచ్చిన మహానుభావు డాయన! థామస్‌గ్రే రచించిన 'ఎలిజీ' గోల్డ్‌స్మిత్ 'ట్రావెలర్' 'డిజర్టెడ్ విలేజ్ వర్డ్స్‌వర్త్ రచించిన 'ఇంటిమేషన్ టు ఇమ్మోర్టాలిటీ' షేక్స్పియర్ నాటకాలైన 'హేమ్‌లెట్', 'ది మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్' మొదలైన వాటికి గుండేరావు చేసిన సంస్కృతకావ్యాను వాదాలు విశిష్టమైనవి. ఆ మహాపండితుడు ఫారసీలోని 'మస్నవీ షరీఫ్', అరబ్బీలోని 'ఖురానే షరీఫ్' మొదలైన మతగ్రంథాలను సంస్కృతంలోకి తీసికొని వచ్చాడు. ఇంత అనువాదాలు మరెవరూ చేయలేదని చెప్పవచ్చు.

గుండేరావు అంటే భాషాకోవిదుడు. ఏ భాషనైనా ఇట్లే నేర్చుకొని, భాషించగల నేర్పరి. అంతేకాదు ఆ భాషలలో పాండిత్యాన్ని సంపాదించి వివిధ భాషల వారికి అనువాదాల ద్వారా ఆదర్శ పండితుడయ్యాడు.

గుండేరావు భాషావ్యాకరణ వేదాంతధర్మ శాస్త్ర గ్రంథాల్లోనే కాక చరిత్ర విషయంలోను తన విమర్శన, పరిశోధన పాటవాన్ని చూపాడు. ఆయన మరాఠీ సాహిత్య చరిత్రను తెలుగులో రచించాడు. భారతీయులకిష్టప్రామైన ఉపనిషత్తులను అధ్యయనం చేసి, వాటిలో ఈశ, కేన, కఠోపనిషత్తులకు కారికలు రచించాడు.

గుండేరావు అటు సాహిత్యాన్ని ఇటు వేదాంతాన్ని ఔపోశనం పట్టినాడా? అనిపిస్తుంది. ఆయన అన్ని మతాలను పరిశీలించాడు. మతగ్రంథాలను చదివాడు. భారతీయ వేదాంతంతో ఇతరుల ఆలోచనలను తులనాత్మక పరిశీలన చేసిన మహానుభావుడాయన. వివిధ మతాలకు చెందినవారు తరుచుగా గుండేరావు దగ్గరికి వచ్చి తమ ఆలోచనలను తెలియజేసి, గుండేరావు నుండి స్ఫూర్తిని పొందేవారు. హైదరాబాదు నగరంలో ఏ వేదాంత సభ జరిగినా అందులో విశిష్టస్థానం వారిదే.

గుండేరావు తెలంగాణ చిత్రపటం మీద మెరిసే ఒక వజ్రం. ఆయన మహ్మదీయుల పరిపాలనలో ఉద్యోగిగా ఉన్నప్పటికీ, కేవలం ఉద్యోగధర్మానికే పరిమితం కాలేదు హైందవ ధర్మానికి పట్టుగొమ్మగా నిలిచాడు. తెలంగాణలోని ప్రతి పండితునికి స్ఫూర్తిసందించాడు. ఆయనలాగా ప్రాచ్యపాశ్చాత్య సంస్కృతులెఱిగినవారు అరుదుగ కనిపిస్తారు. అన్ని భాషలలోని అంతఃసూత్రాన్ని తెలిసికొన్న ఉత్తమ పండితుడాయన. 20వ శతాబ్దిలో చెప్పుకోదగ్గ పండితుల్లో ఆయన ఒకరని నా అభిప్రాయం.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన **'తెలంగాణ తేజోమూర్తులు'** నుంచి)*

**– ఆచార్య మసన చెన్నప్ప**

# చరిత్రకెక్కిన హైదరాబాద్ మెడికల్ స్కూల్

ప్రపంచ వైద్యచరిత్రలో హైదరాబాద్‌కు ఒక విశిష్టమైన స్థానమున్నది. అంతకన్నా ఘనమైన చరిత్ర ఉన్నది. ప్రజల ఆరోగ్యం పట్ల ఇక్కడి రాజులు వందల ఏండ్ల క్రితమే శ్రద్ధ వహించారు. కుతుబ్‌షాహీ వంశానికి చెందిన సుల్తాన్ మొహ్మద్ కులీకుతుబ్‌షా 1595లో హైదరాబాద్‌లోని చార్మినార్ పక్కనే 'దారుషిఫా' అనే వైద్యాలయాన్ని నిర్మించాడు. ఇక్కడ యునాని వైద్యంలో శిక్షణ నిప్పించడమే గాకుండా, రోగులకు చికిత్స చేసేవారు. రెండంతస్థుల్లో నిర్మించిన ఈ భవనంలో మొత్తం 40 గదులుండేవి. ఒక్కో గదిలో కనీసం నాలుగు బెడ్ల ఏర్పాటుకు వీలుండింది. మొత్తం 25000ల చదరపు అడుగుల్లో నిర్మితమైన ఈ భవంతిలో చికిత్స అంతా కుతుబ్ షాహిల రాజ వైద్యుడు హకీమ్ సైఫుద్దీన్ జిలానీ నేతృత్వంలో జరిగేది. రోగులకు ఉచిత ప్రోటీన్ యుక్త భోజన సదుపాయాలు కూడా ప్రభుత్వమే కల్పించేది. అందుకే ప్రపంచంలో పేరుగాంచిన 'యునాని' వైద్యులు ఆనాడు హైదరాబాద్‌లో స్థిరపడినారు. సామాన్యులు మొదలు నవాబుల వరకు వారు వైద్యాన్ని అందించారు. 'యునాని'తో పాటుగా ఆయుర్వేద వైద్యానికి కూడా అసఫ్జాహీల కాలంలో కొంత ప్రాచుర్యం ఉండేది. హకీం నారాయణదాస్, హకీం జనార్ధన దాస్ లాంటి వారు ఏడో నిజామ్‌కు రాజ వైద్యులుగా పనిచేశారు. రాధాకృష్ణ బిషగాచార్య, వైద్యరత్న బి.రామరాజు, బి. మార్కండేయులు లాంటి ఆయుర్వేద వైద్యులు ఇక్కడ రాణించారు. అయితే ప్రస్తుతం ఇక్కడ ప్రపంచ వ్యాప్తంగా పరుచుకుపోయిన, విస్తృతంగా అమల్లో ఉన్న అల్లోపతి వైద్యం లేదా ఇంగ్లీషు వైద్యం గురించి మాట్లాడుకుందాం! ఆ వైద్యం హైదరాబాద్‌కు ఎప్పుడు ఎలా వచ్చిందనేది చర్చించుకుందాం!



అన్ని రంగాల్లో 'ఆధునికత' అనేది విదేశీయుల రాకతో హైదరాబాద్‌లో ఆరంభమయింది. అల్లోపతి వైద్యం కూడా అలాగే హైదరాబాద్‌కు వచ్చింది. 1798, 1800ల సంవత్సరాల్లో ఈస్టిండియా కంపెనీతో రెండో 'నిజామ్ నిజామ్ అలీఖాన్' సైన్య సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్, బొల్లారం, సికింద్రాబాద్ జాల్నా, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల్లో బ్రిటీష్‌వారు తమ సైన్య స్థావరాలను ఏర్పర్చినారు. ఈ సైన్యం నిజాం ప్రభుత్వం కోరినదే తడవుగా ఆయనకు సహాయాన్ని అందించేది. శాంతిభద్రతలు కాపాడడంలో ఈ సైన్యం పాత్ర ప్రధానంగా ఉండేది. ఇట్లా బొల్లారం, బ్రిటీష్ రెసిడెన్సీ (కోఠీ)లో ఏర్పాటు చేసిన పటాలాల బాగోగులను బ్రిటీష్ అధికారులే చూసుకునేవారు. వాటి నిర్వహణ, జీత భత్యాల నిమిత్తం నిజాం ప్రభుత్వం బ్రిటీష్‌వారికి ఆంధ్రా జిల్లాలను దారదత్తం చేయడం జరిగింది. అందుకే వీటిని సీడెడ్ జిల్లాలంటారు. ఇది 1800ల నాటి సంఘటన.

ఇట్లా ఏర్పాటైన సైన్యం ఆరోగ్యం, చికిత్సకు సంబంధించిన బాగోగులని పట్టించుకోవాల్సిన బాధ్యత కూడా బ్రిటీష్ రెసిడెన్సీ అధికారుల పైనే ఉండేది. అందుకే 1814లో బ్రిటీష్ రెసిడెంట్ సర్ హెన్రీ రస్సెల్ తమ సైన్యం వైద్యం నిమిత్తం ఈస్టిండియా కంపెనీ, గవర్నర్ జనరల్ అనుమతితో రెండు పోస్టులను సృష్టించాడు. ఇట్లా సృష్టించిన పోస్టుల్లో నియమితులైన ఫస్ట్ డ్రెస్సర్, సెకెండ్ డ్రెస్సర్ పేరిట ఇద్దరు వైద్యులు చికిత్సను అందించేవారు. దీనికి కొనసాగింపుగా 1818లో అప్పటికే ఉన్న వైద్య సిబ్బందికి అదనంగా ఒక సర్జన్‌ని నియమించారు. ఆ తర్వాత 1827లో 'హైదరాబాద్ కంటిం జెంట్'కు (పటాలం) అనుబంధంగా ఒక మెడికల్ స్టోర్ కీపర్, మరో మెడికల్ సూపరింటెండ్-(సర్జన్)ని కూడా నియమించారు. ఇట్లా 1835లో బొల్లారం మిలిటరీ కేంద్రంలో రెసిడెన్సీ అధికారులు ఒక మెడికల్ స్కూల్‌ని ప్రారంభించారు. ఈ సమయంలో కల్నల్ జె. స్టెవార్ట్ రెసిడెంట్‌గా ఉన్నాడు. స్థానికులకు అల్లోపతి మెడిసిన్‌లో శిక్షణ ఇచ్చి వారిని సైన్యంలోనే ఉద్యోగస్థులుగా, సహాయకులుగా నియమించడం వారి ఉద్దేశ్యం. ఈ స్కూల్ మొదటి ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ సర్జన్ థామస్ కీ పనిచేశారు. ఈయనకు సహాయకుడిగా మెడికల్ స్టోర్ కీపర్ సైమన్ యంగ్ ఉన్నారు. అయితే ఇక్కడ పనిచేసే సూపరింటెండ్ రిటైర్ కావడంతో ఈ మెడికల్ స్కూల్ నిర్వహణ వల్ల రెసిడెన్సీ ఖజానా మీద అధిక భారం పడడమే గాకుండా దానివల్ల ఆశించిన ఫలితాలు దక్కడం లేదనే మిషతో అప్పటి రెసిడెంట్ జేమ్స్ స్టువార్ట్ ఫ్రేజర్ పాఠశాలను రద్దు చేసిండు. ఈ నిర్ణయం 1846 మే ఒకటిన జరిగింది. దీంతో హైదరాబాద్‌లోని పత్రికలు రెసిడెంట్ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. తీవ్రంగా విమర్శించాయి. ఈ విషయం ఈస్టిండియా కంపెనీ అధికారులకు కూడా చేరింది. దీంతో


దారుషిఫా బిల్డింగ్

ఫ్రేజర్ దిద్దుబాటు చర్యలు చేపడుతూ పూర్తిస్థాయిలో మెడికల్ స్కూల్ ఏర్పాటు చేసే ఉద్దేశ్యంతోనే ప్రస్తుతమున్నదాన్ని రద్దు చేశామని చెబుతూ, త్వరలోనే ఆ పాఠశాల ప్రారంభమవుతుందని ప్రకటించాడు. ఈ మేరకు ఫ్రేజర్ ఈస్టిండియా కంపెనీ గవర్నర్ జనరల్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి మెడికల్ పాఠశాల నడిపేందుకు అనుమతి తీసుకున్నాడు. ఇదే విషయాన్ని నాలుగో నిజామ్ నాసర్‌జంగ్ దృష్టికి కూడా తీసుకొచ్చినాడు. ఎందుకంటే వీటి నిర్వహణకయ్యే ఖర్చు నిజాం ప్రభుత్వమే భరించేది. తమ ప్రజలకు ఉపయోగపడే ప్రతిపాదనకు నాసర్‌జంగ్ అంగీకారం తెలిపినాడు. అంతేగాదు ఈ మెడికల్ పాఠశాలలో బోధనా భాష 'ఉర్దూ'లో ఉండాలని షరతుని విధించినాడు. అందుకు ఫ్రేజర్ అంగీకరించడంతో మొత్తం భారతదేశంలోనే దేశీయ భాషల్లో 'మెడికల్ విద్య'ను బోధించే మొట్ట మొదటి పాఠశాల 1846 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో ప్రారంభమయింది. ఇట్లా పూర్తి విదేశీ వైద్య విద్యను స్వదేశీ భాషలో బోధించిన ఘనత హైదరాబాద్‌కు దక్కుతుంది.


జేమ్స్ స్టువార్ట్ ఫ్రేజర్

అయితే గ్రీకులో పుట్టి పర్షియా గుండా హైదరాబాద్‌కు వచ్చిన 'యునాని' వైద్యంలో నిజాం రాజులకు, నవాబులకు, ప్రజలకు నమ్మకముండేది. బ్రిటీష్ రెసిడెన్సీలో అల్లోపతి వైద్యం అందిస్తున్నప్పటికీ దాని పట్ల నవాబులకు, నిజాం రాజులకు ముఖ్యంగా హకీమ్‌లకు ఏ మాత్రం నమ్మకముండేది కాదు. ఈ హకీమ్‌లు నవాబులకు, రాజులకు ఆంగ్ల వైద్యం పట్ల పూర్తి వ్యతిరేకతను నూరి పోశారు. 'టాబ్లెట్' మింగితే రక్షించే, చికిత్స చేసే, ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తమది కాదని చెప్పేవారు. ఒక రకంగా 'అల్లోపతి' వైద్యం పట్ల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిండ్రు. ఇలాంటి దశలో 1845-46 ఆ ప్రాంతంలో నాలుగో నిజామ్ నాసిరుద్దౌలా 'డయాబిటిస్'తో బాధపడుతూ ఉండేవాడు. 'యునాని' వైద్యంతో ఆయనకు స్వస్థత చేకూరలేదు. దీంతో నిజామ్‌ని క్షేమ సమాచారాలు కనుక్కోవడానికి వచ్చిన ఫ్రేజర్ అల్లోపతి వైద్యం గురించి చెబుతూ, దాని ద్వారా స్వస్థత పొందవచ్చని పేర్కొన్నాడు. అంతేగాదు చికిత్స నిమిత్తం రెసిడెన్సీ వైద్యుడు మెక్లీన్‌ని పంపించాడు. ఈ సమయంలో డాక్టర్ మెక్లీన్‌కు నాసిరుద్దౌలా కొన్ని షరతులు విధించాడు. 'నేను మీరిచ్చే ఒక్క అల్లోపతి మాత్రను కూడా మింగేది లేదు. కనీసం ముట్టుకునేది లేదు'. అని తేల్చి చెప్పిండు. దానికి మెక్లీన్ అంగీకరిస్తూ కొన్ని 'టెస్టులు' చేసి 'డయాబిటిస్'కు పాటించాల్సిన పత్యాన్ని సూచించాడు. 'డైటింగ్'లో మార్పులు చేసిండు. డాక్టర్ సూచించిన పత్యాన్ని, డైటని తూ.చ. తప్పకుండా నాసిరుద్దౌలా పాటించాడు. దీంతో మూడు నెలల్లోనే ఆయన ఆరోగ్యం కుదురుకుంది. అలా అల్లోపతి వైద్యంపై నిజాంకు నమ్మకం ఏర్పడింది. ఇట్లా హైదరబాద్‌లో తొలి మెడిసిన్ స్కూల్ ఆధునిక పద్ధతుల్లో స్థాపనకు పునాదులు పడ్డాయి.


డాక్టర్ మెక్లీన్

బ్రిటీష్ రెసిడెన్సీ హాస్పిటల్ (ప్రస్తుత సుల్తాన్ బజార్ దవాఖానా) సూపరింటెండెంట్‌గా, సర్జన్‌గా డాక్టర్ విలియం కాంప్‌బెల్ మెక్లీన్ 1844లో నియమితుడయిండు. ఇందుకు గాను ఆయనకు నెలకు వెయ్యి రూపాయలు జీతంగా లభించేది. ఆయనకు ఐదు వందల రూపాయల అదనపు జీతం ఇచ్చే ఖరారుతో 'హైదరాబాద్ మెడికల్ స్కూల్' 1846లో నగరంలోని ఆబిడ్స్ ప్రాంతంలో (ఒకప్పటి ప్యాలెస్ థియేటర్ ఉన్న స్థలంలో) 'మెడికల్ స్కూల్' ఏర్పాటయింది. దీనికి తొలి ప్రిన్సిపాల్‌గా మెక్లీన్ పనిచేశారు. అయితే బోధన ఉర్దూలో చేయాల్సి రావడంతో ఆయన ఆ భాషలోనూ పట్టు సాధించాడు. కోర్సు మెటీరియల్ అంతా కూడా ఉర్దూలో తయారు చేయించారు. కేవలం ఉర్దూలోనే కాదు తెలుగులో కూడా కొన్ని వ్యాధులు, వాటి నివారణకు సంబంధించిన వివరాలు ఈ మెడికల్ స్కూల్ వాళ్లు ప్రచురించారు. 1850ల నాటికే హైదరాబాద్‌లో 'మశూచి-స్ఫోటకం' గురించి మెక్లీన్ ఇంగ్లీషులో రాసిన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేసి అచ్చేశారు. ఇట్లా మెక్లీన్ ఒకవైపు బ్రిటీష్ రెసిడెన్సీలో పనిచేస్తూనే, నాసిరుద్దౌలా, షంషుల్ ఉమ్రా, సూరజ్ ఉల్ ముల్క్ తదితర రాజులు, నవాబులకు రాజ వైద్యుడిగా కూడా కొనసాగాడు. ఈయన ఈ పదవిలో 1854 వరకు ఉన్నాడు. ఈ 'మెడికల్ స్కూల్' నుంచి మొదటి బ్యాచి విద్యార్థులు 1852-53లో బయటి కొచ్చారు. మొదటి బ్యాచ్‌లో మొత్తం పది మంది విద్యార్థులు పట్టా పుచ్చుకున్నారు. ఇందులో ఒక్కరు మినహా ముస్లిములే! వారి పేర్లు. 1.మొహ్మద్ అష్రఫ్, 2. హెన్రీ పికాక్, 3. మొహ్మద్ బాకర్ అలీ, 4. ఫైజుల్లా ఖాన్, 5. సయ్యద్ ఒమర్, 6. ఐన్ ఖాన్, 7. గులామ్ జిలానీ, 8. ఖ్వాజా అష్రఫ్, 9. మొహ్మద్ యాకూబ్, 10. పీర్ ఖాన్.

నిజానికి మెక్లీన్ హైదరాబాద్‌లో 'అల్లోపతి వైద్య పితామహుడు'. ఎడింబరో విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఈయన 1811 నవంబర్ 29న స్కాట్లాండ్‌లో పుట్టి చాలా ఏండ్లు ఇండియాలోని వివిధ ప్రదేశాల్లో పనిచేశారు. రిటైరైన తర్వాత ఇంగ్లండ్‌లోని వివిధ మెడికల్ కళాశాలల్లో లెక్చర్లిచ్చారు. ఈయన తన 87వ యేట 1898 నవంబర్ పదో తేదిన మరణించారు. ఈయన తన జీవిత చరిత్రను కూడా రాసుకున్నారు. మెక్లీన్ ఏర్పాటు చేసిన ఈ 'మెడికల్ స్కూల్' 1861లో 'అఫ్జల్ గంజ్ దవాఖానా'గా మారింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఏర్పాటైన తర్వాత 1925లో దానికి అనుబంధంగా 'ఉస్మానియా మెడికల్ కాలేజి'గా రూపుదిద్దుకుంది. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మెడికల్ స్కూల్ ప్రారంభం అంత ఈజీగా ఏమీ జరగలేదు.

'హైదరాబాద్ మెడికల్ స్కూల్' మెక్లీన్ పూనిక మేరకు సరైన పద్ధతుల్లో ప్రారంభమయింది. తొలుత నెలకు ముప్పయి రూపాయల

అద్దెతో ఒగిల్వీ అనే భూస్వామి భవనాన్ని కిరాయికి తీసుకున్నారు. అలాగే అమీర్ అలీని క్లర్క్‌గా నియమించుకున్నాడు. దుబాసీగా ముర్రే అనే అతన్ని ఉద్యోగిగా నియమించాడు. వీరికి తోడుగా ఇద్దరు అటెండర్లను కూడా ఆయన నియమించాడు. ఇదంతా బాగానే ఉన్నది కానీ విద్యార్థులెవ్వరూ మెడిసిన్ విద్యను చదవడానికి ఆనాడు సిద్ధంగా లేరు. దీనికి ప్రధాన కారణం ఐదారేండ్లు 'హకీమ్' కోర్సును చదవాల్సి రావడం. అలాగే బోధన ఉర్దూలో ఉన్నప్పటికీ విషయం పెద్దగా తెలిసింది కాకపోవడం కూడా ఒక కారణం. కొంతమంది వైద్యాలయంలో మానవ కంకాళాలను చూసి భయపడి విద్యను మధ్యలోనే మానుకున్న వారు కూడా ఉన్నారు. అయితే ఈ సమస్యల్ని అధిగమించడానికి విషయాన్ని డాక్టర్ మెక్లీన్ నాలుగో నిజాం దృష్టికి తీసుకొచ్చినాడు. అందుకు ఆయన తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా తన కార్యాలయాధికారి మీర్ ఇమామ్ అలీఖాన్‌ని కోరినాడు. చివరికి నవాబ్ షంషుల్ ఉమ్రా దగ్గర వకీల్‌గా పనిచేస్తున్న గులామ్ మొహియుద్దీన్ ఖాన్ విద్యార్థులను చేర్పిస్తానని మాటిచ్చాడు. ఆ మేరకు షంషుల్ ఉమ్రా పోషణలో చదువుకుంటున్న నాలుగు వందల మంది ఉర్దూ, పర్షియన్ బాగా తెలిసిన విద్యార్థుల నుంచి 30 మంది తెలివైన విద్యార్థులను తీసుకొని రావాల్సిందిగా అక్కడి అధ్యాపకులను ఆదేశించారు. అందులో నుంచి షంషుల్ ఉమ్రా తానే స్వయంగా ఒక పదిమంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చాడు. మీ భవిష్యత్తు బాగుంటుంది, దానికి నాది భరోసా అంటూ వారికి ధైర్యాన్నిచ్చాడు. వైద్య విద్య చదవడం ద్వారా సేవ చేయడమే గాకుండా, ఆర్థికంగా కూడా బలపడవచ్చని వారిని ప్రోత్సహించాడు. అంతేగాకుండా ఎంపికైన విద్యార్థులందరికీ ఒక 'ఇంక్‌పాట్', 'నైఫ్', పేపర్ బండిల్స్ తానే స్వయంగా అందించి వారి వైద్యవిద్యకు అండగా నిలిచాడు.


డాక్టర్ నాసిరుద్దౌలా

ఇట్లా ప్రారంభమైన స్కూల్‌లో పాసైన వారికి 'హకీమ్' సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పాఠశాలలో ప్రతి సంవత్సరం 30 మంది విద్యార్థులకు బోధన చేసేవారు. అయితే అందులో పది, పన్నెండు మించి పాసయ్యే వారు కాదు. వాళ్ళు మళ్ళీ తర్వాతి సంవత్సరం పరీక్షలు రాసేవారు. ఇట్లా పాసైన 'హకీమ్'లు సాలర్‌జంగ్, షంషుల్ ఉమ్రా తదితర నవాబుల దగ్గర వైద్యులుగా చేరేవారు. సాలర్‌జంగ్ వద్ద వైద్యులుగా చేరిన వారు నగరంలో ఉచిత వైద్య సేవలు అందించేవారు. మరికొంతమందిని హైదరా బాద్ ప్రధాని సాలార్జంగ్ తాలూకా కేంద్రాల్లో 'హకీమ్' లుగా నియమించినాడు. వీరికి నెలకు ఆనాడు 30 రూపాయల జీతాన్ని ఇచ్చేవారు. ఈ హకీమ్‌లకు పూర్తి వైద్య సదుపాయాలతో డిస్పెన్సరీని ఏర్పాటు చేయడమే గాకుండా వారు ధనవంతుల నుంచి కొంత ఫీజు వసూలు చేసుకునేందుకు అనుమతిచ్చారు. అట్లాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఆనాడే ఉచిత వైద్య సదుపాయాన్ని సాలర్‌జంగ్ కల్పించారు. మెక్లీన్ అనంతరం ఈ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జార్జ్ స్మిత్ పనిచేశారు.


డాక్టర్ ఎడ్వర్డ్ లారీ

1861లో డాక్టర్ స్మిత్ ప్రమోషన్‌పై మద్రాసు మెడికల్ కాలేజికి వెళ్ళిండు. స్మిత్ స్థానంలో ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఫ్లెమింగ్ నియుక్తులయ్యారు. ఆ తర్వాత 1867లో డాక్టర్ పంబర్టన్, 1882లో డాక్టర్ విండోవ్ తదితరులు ప్రిన్సిపాల్స్‌గా వ్యవహరించారు. ఈ దశలో మెడికల్ విద్యార్థులకు నెలకు నాలుగు రూపాయల స్టైఫండ్ ఇచ్చి ఇంగ్లీషు నేర్చుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహించింది. 1861–62 తర్వాత వైద్య విద్యలో చేరడానికి ఎక్కువ మంది ఆసక్తి కనబరచడంతో విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సికింద్రాబాద్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఫోర్బ్స్ చైర్మన్‌గా వ్యవహరించేవారు. ఆయనతో పాటుగా ఆల్వాల్‌కు చెందిన డాక్టర్ సాండర్సన్, సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ మార్టిన్ సభ్యులుగా ఉండేవారు. బోధనా మాధ్యమాన్ని ఇంగ్లీషుకు 1883–84లో మార్చినారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అదే కొనసాగుతున్నది. ఈ సమయంలో 'మెడికల్ స్కూల్'కు ఎడ్వర్డ్ లారీ అనే అతను ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. ఈయన తర్వాత అంటే 1888–94లో క్లోరోఫామ్ మిషన్‌ని ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ కీర్తిపతాకను, పరిశోధన రంగానికి నిజాం ప్రభుత్వం చేస్తున్న సేవలను ఎరుక పరిచాడు. ఇంగ్లండ్‌లోని వివిధ పత్రికల్లో వ్యాసాలు రాసి హైదరాబాద్‌లో జరుగుతున్న పరిశోధనలను వెల్లడించారు. 'లాన్సెట్' అనే ఒక బ్రిటన్ పత్రిక సంపాదకుడు ఆయన పరిశోధనలపై కొంత సందేహాన్ని వ్యక్తం చేసిండు. అయితే ఆ సందేహాన్ని నివృత్తి చేసుకునేందుకు బ్రిటన్ నుంచి పత్రిక ప్రతినిధిని రప్పించి వివిధ జంతువులపై హైదరాబాద్‌లో'అనస్తీషియా' విషయంలో చేసిన పరిశోధనలు రుజువు చేసినాడు. దీని కొనసాగింపుగానే హైదరాబాద్‌లో రోనాల్డ్ రాస్ మలేరియా కారకాల మీద చేసిన పరిశోధనకు గాను 1902లో నోబెల్ ప్రయిజ్ వచ్చింది. అలాగే ముత్యాల గోవిందరాజులు నాయుడు కూడా తర్వాతి కాలంలో ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. డాక్టర్ మల్లన్న ఇక్కడి నుంచే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తెలంగాణ బిడ్డ.

ఇట్లా ప్రపంచ చరిత్రలో హైదరాబాద్ వైద్య రంగానికి ఒక విశిష్టమైన స్థానమున్నది. అంతేకాదు నిజాం ప్రభుత్వం వైద్యవిభాగాలను ప్రోత్సహించింది. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించింది. వైద్యవిద్యలో నూతనంగా చోటు చేసు కుంటున్న పరిశోధనలు వైద్యులందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు గాను సాలార్జంగ్ ఆర్థిక సహకారంతో ఈ మెడికల్ స్కూల్ 'రిసాలా తిబ్బాత్' అనే వైద్య పత్రికను నడిపించింది. ఈ పత్రికకు ఆనాడు ఒక్క హైదరాబాద్‌లోనే గాకుండా బొంబాయి, కలకత్తాల్లో కూడా చాలా మంచి పేరుండేది. ఇన్నేండ్లు విస్మృతంగా ఉన్న ఘన చరిత్ర అందరికీ తెలియాలి.

–సంగిశెట్టిశ్రీనివాస్, m:98492 20321
e: sangishettysrinivas@gmail.com








రకరకాల కారణాలతో తెలంగాణ ప్రముఖుల చరిత్రలు అంతగా వెలుగులోకి రాకుండా పోయాయి. ఆయా ప్రముఖులపై ప్రజలకు ఒక అవగాహన కల్పించేలా వివిధ వ్యాసాల సంకలనంతో **మనిషి** పేరిట తెలంగాణ రిసోర్స్ సెంటర్ కొన్ని పుస్తకాలను ప్రచురించింది.




పై పుస్తకాలు లభించు చిరునామా :

టీఆర్‌సి 3-6-712/2, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88. Email: trchyd@gmail.com

# అడుగడుగున కథ ఉంది ‘సుల్తాన్ బజార్’

ఒకప్పుడు సుల్తాన్ బజార్ లేదు.

ఆ ప్రాంతమంతా రెసిడెన్సీ బజార్‌లోనే కలిసి ఉండేది. అక్కడ నిజాం పరిపాలన కాక బ్రిటిష్ రెసిడెంటు ప్రభుత్వం నడిచేది. 1933లో కొంత ప్రాంతాన్ని నిజాంకు అప్పగించారు. అప్పుడు ఆ కొత్త ప్రాంతాన్ని సుల్తాన్ బజార్ అన్నారు. అప్పుడు ఇదొక వస్త్ర వ్యాపారుల విఫణి వీధి.

సుల్తాన్ బజార్‌కు దగ్గరలో ఉన్న “బడీ చావుడీ” ప్రాంతమంతా మహా రాష్ట్రులతో నిండి ఉండేది. శ్రీకృష్ణదేవరాయల భాషా నిలయం పక్క సందులో మరాఠీలు మరాఠీల కోసం నడిపే “విశ్రాంభవన్” అనే భోజనాలయం ఉండేది. అంతా శాఖాహారమే. మనుషులను చూసి గోల్ గోల్ గరం గరం రొటీలను తయారు చేసేవారు. మరాఠీ సంప్రదాయంలో కూచోటానికి ఒక పీట దాని ముందు పళ్లెం పెట్టుకోటానికి మరోపీట. స్వామీ రామానంద తీర్థ శిష్యులు దానిని నిర్వహించేవారు. గిరాకీలు రానప్పుడు వారు రాట్నం వడుకుతూ కూచునేవారు.



స్వామీ రామానందతీర్థ



పండిత్ నరేంద్రజీ

బడీ చౌడీలో నివసించే మరాఠీలకు దేశభక్తి ఎక్కువ. ఒకసారి బుద్ధితక్కువై ఆ ప్రాంతంలోని ఇళ్లపై రజాకారులు దాడిచేసారు. అప్పుడు మరాఠీ స్త్రీలు చెప్పులు, చాటలు, చీపుర్లు చేతబట్టి వారిని తరిమితరిమి కొడ్తే రజాకార్లు వెనక్కి తిరిగి చూడకుండా ఒకటే పరుగు. అక్కడ నివసించే డాక్టర్ హరిశ్చంద్ర హెడా, జ్ఞానకుమారి హెడాలు అక్కడి ప్రజలను చైతన్యపరిచారు. ఇమ్రోజ్ పత్రికా సంపాదకుడు షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు నడిరోడ్డుపై తల్వార్లతో నరికి హత్య చేసాక నిండుగర్భిణి ఐన ఆయన భార్యను రహస్యంగా తప్పించి తమ ఆసుపత్రిలో పురుడు పోసిన ఘనత “హెడా” దంపతులదే. వారిద్దరూ అనేక త్యాగాలు చేసినా స్వాతంత్ర్యం వచ్చాక ఎటువంటి పదవులను స్వీకరించలేదు. వారి దవాఖానా ఇప్పటికీ కాచీగూడ టూరిస్ట్ హోటల్ ఎదురుగా ఉంది.

ఈ వీధిలోనే “మోతీమహల్” సీన్మా టాకీసు ఉండేది. మూకీ సీన్మాలు కాక హిందీ టాకీ సీన్మాలు ఆడేవి. ఆడవాళ్లకు మేడపైన చెక్కలతో కట్టిన ప్రత్యేకమైన క్లాసు ఉండేది. ఆ రోజులలో చాలా సీన్మా హాళ్లలో స్త్రీలకు ప్రత్యేకమైన క్లాసులు ఉండేవి. సీన్మా ప్రొజెక్టర్ స్త్రీలు కూచునే వెనక భాగం వైపు ఒక గోడ ఉండేది. ఒకరోజు హఠాత్తుగా ఆ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. క్షణాలలో స్త్రీలు కూచున్న చెక్కల సెక్షన్ మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. అనేక మంది స్త్రీలు పిల్లా పాపలతో సహా మాడి మసైనారు. కొంత మంది ధైర్యం చేసి ఆ మేడపై నుండి క్రిందికి దుంకారు. వారి కాళ్లు చేతులు విరిగినాయి. ఒక స్త్రీ తన చీర విప్పి ఒక స్తంభానికి కట్టి దాని సహాయంతో క్రిందికి జారింది. ఆ చీర పుణ్యమా అని మరి కొంత మంది స్త్రీలు తప్పించుకున్నారు. ఆ అగ్నిప్రమాద విషాదం తర్వాత చాలా కాలం ఆ సీన్మాహాలు మూతబడింది. తర్వాత దానిని సరికొత్తగా నిర్మించారు. అప్పుడు దాని పేరు “దిల్షాద్ టాకీసు”. రాజ్ కపూర్ సీన్మాలన్నీ అందులోనే విడుదల అయ్యేవి. నగర ప్రజలకు ఆ సీన్మాటాకీసుతో ఎన్నెన్నో మధుర జ్ఞాపకాలు ముడిపడి ఉండేవి. కాని క్యా ఫాయిదా? కాలక్రమంలో అది కూడా కళ్లముందే కాలగర్భంలో కలిసిపోయి అక్కడ కోళ్ల పౌల్ట్రీఫాంల లాంటి అపార్ట్‌మెంట్లు మొలిచాయి.

సుల్తాన్ బజార్‌లోని దిల్షాద్ టాకీస్ ఎదురుగా ఉదయ్ క్లాత్

స్టోర్స్ అనే బట్టల దుకాణం ఉండేది. దాని యజమాని పేరు దేవయ్య. ఈ దుకాణం పై గదిలో ప్రతిరాత్రి "ఆర్యయువ క్రాంతి దళ్" అనే విప్లవకారుల సంస్థ సమావేశాలు జరిగేవి. 1) నారాయణ్‌రావ్ పవార్ 2) పండిత్ విశ్వనాథ్ (గన్‌ఫౌండ్రి) 3) రెడ్డి పోచనాథం (గన్‌ఫౌండ్రి) 4) జి.నారాయణస్వామి (లాలాగూడలో రైల్వే ఉద్యోగి) 5) బాలకిషన్ (టేలర్, సుల్తాన్ బజార్) 6) గండయ్య 7) జగదీష్ ఆర్యలు ఆ దళం సభ్యులు. కొండా లక్ష్మణ్ బాపూజీ వారికి సలహాదారుడే గాక ఆర్థికంగా సహకారం అందించేవాడు. ఏడవ నిజాం నవాబును ఎట్లా ఖతం చేయాలో వారు ప్రణాళికను ఆ గదిలోనే రచించారు. ఫలితంగానే 1947 డిసెంబర్ నాల్గవ తారీఖునాడు కింగ్ కోఠీలో నిజాం వెళ్తున్న కారుపై బాంబు వేశారు. కాని నిజాం బ్రతికి బయటపడినాడు.

ఈ సుల్తాన్ బజార్‌లోనే మాడ్రన్ హేర్ కటింగ్ సెలూన్ ఉండేది. అందులో గండయ్య పనిచేసేవాడు. అతనిది పాలమూరు జిల్లాలోని పాలమాకుల స్వగ్రామం. బాంబు ప్రయోగం విఫలం కాగానే అతను పాలమాకుల పారిపోయాడు. కాని ఆ రాత్రే అతనిని గిరఫ్తార్ చేసారు. ఈ హేర్ కటింగ్ దాటగానే "గిరి కాఫీ హౌజ్" అనే చిన్న హోటల్ ఉండేది. అది కూడా విప్లవకారులకు "అడ్డా"గా పనిచేసేది. వీరందరూ సామాన్యమైన యువకులే కాని కాలం కత్తుల వంతెన మీద ఈ అట్టడుగు జనాలు అగ్గిపిడుగులు కురిపించారు.

***సుల్తాన్ బజార్ క్లాక్‌టవర్ వద్ద 1938లో మొదటిసారి స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రథమ సత్యాగ్రహం జరిగి ఏడుగురు కాంగ్రెసు నాయకులు అరెస్టు అయినారు. స్వామి రామనంద తీర్థ, గోవిందరావు నానల్, వామన్‌రావ్ నాయక్ వీరిలో ప్రముఖులు.***

ఈ సుల్తాన్ బజార్ చౌరస్తాలనే అణాగ్రంధమాల వ్యవస్థాపకుడు కె.సి.గుప్త మాస్కో కమ్యూనిస్టు పుస్తకాలను అమ్మేవాడు. తర్వాత కాలంలో అది "విశాలాంధ్ర" పుస్తకాల దుకాణంగా మారింది. ఆ దుకాణం ఇప్పటికీ అక్కడే నడుస్తుంది. దాని కొత్తపేరు "నవ చేతన".

సుల్తాన్ బజార్ క్లాక్‌టవర్ వద్ద 1938లో మొదటిసారి స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రథమ సత్యాగ్రహం జరిగి ఏడుగురు కాంగ్రెసు నాయకులు అరెస్టు అయినారు. స్వామి రామనంద తీర్థ, గోవిందరావు నానల్, వామన్‌రావ్ నాయక్ వీరిలో ప్రముఖులు. ఈ 1938వ సంవత్సరం నగర రాజకీయాల చరిత్రలో చాలా ముఖ్యమైన సంవత్సరం. ఒక వైపు స్టేట్ కాంగ్రేస్ సత్యాగ్రహమే గాక అటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కూడా విద్యార్థులు "వందేమాతరం" ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ సంవత్సరంలోనే. బహద్దూర్ యార్ జంగ్ ఈ సంవత్సరంలోనే మజ్లిస్ ఇత్తెహాదుల్ ముసల్‌మీన్ సంస్థను ప్రారంభించాడు.. దూల్‌పేటలో మొదటిసారి మతకలహాలు జరిగింది ఈ 1938 సంత్సరంలోనే!

ఈ సుల్తాన్ బజార్ గల్లీ ఆఖరిలో ఎడమవైపు రాయల్ టాకీసు. అదిప్పుడు లేదు. షాపింగ్ కాంప్లెక్సుగా మారింది. దాని ఎదురుగా కుడివైపు రాజాకందస్వామి మార్కెట్. అది ఇప్పటికీ ఉంది. రాజాకందస్వామి తమిళుడు. మొదలియార్ కుటుంబానికి చెందినవాడు. మూడవ నిజాం కాలంలో ఇతను ప్రముఖ ఇంజనీరు. 1802వ సంవత్సరంలో కోఠీలోని బ్రిటిష్ రెసిడెంటు భవనాన్ని నిర్మించింది ఇతనే. అప్పటి రెసిడెంటు కిర్క్‌పాట్రిక్ అతని నైపుణ్యానికి మెచ్చి "రాజా" అన్న బిరుదును ప్రసాదించాడు. ఈ మార్కెట్ దాటగానే గుజరాతీ గల్లీలో హనుమాన్ వ్యాయామశాల. ఇందులో నుండే నిజాంకు వ్యతిరేకంగా అనేక మంది యోధులు జన్మించారు. హైదరాబాద్ నగరంలో జాతీయోద్యమానికి గ్రంథాలయాలు, వ్యాయమశాలలు రెండు ముఖ్య కేంద్రాలుగా పనిచేసాయి. 1908లో మూసీకి వరదలు వచ్చి సగం పట్నం కొట్టుకపోయిన తర్వాత కార్వాన్ ప్రాంతంలో నివసించే గుజరాతీ, మార్వాడీ షావుకార్లు అందరూ ఇక్కడ స్థిరనివాసాలు, వ్యాపారాలు ప్రారంభించారు. అట్లా గుజరాతీ గల్లీ పేరు వచ్చింది. దీన్ని దాటి ముందుకు వెళ్తే హనుమాన్ టేక్డీ వస్తుంది. ఆంధ్రపితామహ మాడపాటి హన్మంతరావు నివసించిన "ఆంధ్రకుటీరం" ఇక్కడే ఉండేది.

ఇక్కడ మజేదార్ "మజాక్" ఒకటి మీకు చెప్పాలె.

ఒకసారి ప్రముఖ ఆంధ్రా కాంగ్రెసు నాయకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మాడపాటి హన్మంతరావు ఇల్లు "ఆంధ్రకుటీరం"లో బసచేశాడు. ఆయన తన రెచ్చగొట్టే ఉపన్యాసాల ద్వారా ప్రజలలో ఏం విప్లవం తెస్తాడో అన్న భయంతో నిజాం సర్కారు ఆయన్ని గిరఫ్తార్ చేయటానికి "వారెంట్" జారీ చేసింది. ఆ వారెంటు ఉర్దూభాషలో ఉంది. ఉర్దూకు స్వంత లిపి లేదు. ఫార్సీ లిపినే వాడుతారు. ఫార్సీ లిపిలో భారతీయ శబ్దాలు రాయటం చాలా కష్టం. "పట్టాభి సీతారామయ్య" అని రాయాలంటే "టప్పాబహీ సత్తార్ మియా" లా ఉంటుంది.

ఆంధ్రకుటీరానికి అరెస్టు వారెంటు పట్టుకొచ్చిన తురక పోలీసు జవానులు "యహాఁ సత్తార్ మియాఁ హై క్యా" అని హన్మంతరావును అడిగారు. దానికి ఆయన "యహాఁ సత్తార్ మియా కోయీ నహీఁ. ఇన్కా నాంతో సీతారామయ్యా హై" అన్నాడు. దాంతో వారు తికమకకు గురై "మాఫ్ కర్నా" అని సలాం కొట్టి వెళ్లిపోయారు. అట్లాగే మరోసారి "టంగుటూరి ప్రకాశం" మీద కూడా ఉర్దూలో అరెస్టు వారెంటు జారీ అయ్యింది. తురక పోలీసులు ఏకంగా ప్రకాశం పంతులు దగ్గరికే వచ్చి "యహాఁ టాంగ్ టూటీ పీర్ కాసిం కౌన్ హై" అని అడిగారు. దాంతో ప్రకాశం దర్జాగా పాన్ నములుతూ కాలు మీద కాలు వేసుకుని చక్కగా ఊపుకుంటూ "టాంగ్ టూటీ? యహా తో సబ్‌కే టాంగ్ అచ్ఛాహై దేఖో" అని కొంటెగా సమాధానం ఇచ్చాడు. టాంగ్ టూటీ పీర్ ఖాసిం ఇక్కడ లేడనుకుని పోలీసులు ఉత్తచేతులు ఊపుకుంటూ డీలాపడి వాపస్ వెళ్లిపోయారు.

**కాలప్రవాహంలో సుల్తాన్‌లందరూ కొట్టుకుపోయినా చివరికి సుల్తాన్ బజార్ మాత్రం మిగిలిపోయింది.**

*(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం నుంచి)*

**-పరవస్తు లోకేశ్వర్,** m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

అలనాటిమేటి తెలంగాణ శాసనాలు-12

# రెండో పులకేశి హైదరాబాదు రాగిరేకు శాసనం (క్రీ.శ.610-11)

(తొలిసారిగా తెలుగులో)

తెలంగాణ కొత్త చరిత్ర బృందం **తలవర** శ్రీరామోజు హరగోపాల్ గారు నాకు ఒకరోజు ఫోన్ చేశారు. నేను **తెలంగాణలో బాదామీ చాళుక్యులు** అన్న పుస్తకాన్ని రాస్తున్నానని, తనకు రెండో పులకేశి హైదరాబాదు రాగిరేకు శాసన ప్రతిబింబాలు, పాఠం ఉంటే పంపిస్తారా, అని అడిగారు. నేను కూడ రెండో పులకేశి గురించి చదివినపుడు ఆ శాసన ప్రస్తావనను గమనించానే తప్ప, శాసన పాఠాన్ని గానీ, ముద్రలను గానీ చూడలేదు. పురావస్తు (వారసత్వ) శాఖ గ్రంథాలయంలో ఎంత వెదికినా దొరకలేదు. ప్రముఖ శాసన పరిశోధకులను అడిగినా లాభం లేకపోయింది. ఎన్. రమేశన్‌గారు, హైదరాబాదు రాగిరేకు శాసనాలు, **ఇండియన్ యాంటిక్వరీ** వాల్యూం, 6లో ఉన్నట్లు రాశారు. ఐసీహెచ్ఆర్ వారు ప్రచురించిన **బాదామీ చాళుక్య శాసనాలు** పుస్తకంలో కూడ శాసనముద్రలు లేవు. అడగాల్సిన వారినందరినీ అడిగాను. చివరికి అడిగిన వారికి అడిగినట్లుగా చరిత్ర, శాసన సూచీలను, సమాచారాన్ని అందించే కొండా శ్రీనివాసులును అడిగాను. మీరు నమ్మరు గానీ, శ్రీనివాసులు ఫ్లీట్ రాసిన రెండో పులకేశి హైదరాబాదు రాగిరేకు శాసనం (ముద్రలతో సహా) **ఇండియన్ యాంటిక్వరీ,** ఇంకా, ఫ్లీట్ మరో రచన **డినాస్టీస్ ఆఫ్ ది కానరీస్ డిస్ట్రిక్ట్సు ఆఫ్ ది బాంబే** ప్రెసిడెన్సీ **(1882)** నుంచి పంపించారు. దీంతో హరగోపాల్‌గారి కోరిక,నా కోరిక తీరింది.

పులకేశి. పొలికేశి. గడ్డిలాంటి జుట్టుగలవాడు. జూలుగల సింహంలాంటివాడు. ఈ పేరు ఇద్దరు బాదామీ చాళుక్యరాజుల కుంది. ఒకరు మొదటి పులకేశి (క్రీ.శ.544-566) ఇతడు బాదామీ చాళుక్య వంశానికి పునాదిరాయి. రాజ్యానికి మూలస్థంభం. ఇంకొకరు రెండో పులకేశి (క్రీ.శ.610-642). బాదామీ చాళుక్య రాజ్యాన్ని సామ్రాజ్యంగా విస్తరించాడు. రెండో పులకేశి, క్రీ.శ.566 నుంచి 592 వరకూ పాలించిన మొదటి కీర్తివర్మ కొడుకు. రాజ్యపునాదులను బలోపేతం చేసిన కీర్తివర్మ క్రీ.శ.592లో మరణించే నాటికి సింహాసనాన్ని అధిష్ఠించాల్సిన రెండో పులకేశి చిన్నపిల్లగాడు. అందువల్ల అతని పినతండ్రి మంగళేశుడు రాజైనాడు. సింహాసనాన్ని అసలు వారసుడైన రెండోపులకేశికి అప్పగించటానికి విముఖత చూపటంతో యుక్త వయస్కుడైన రెండోపులకేశి, క్రీ.శ.609-10లో మంగళేశునితో యుద్ధం చేసి, వధించి సింహాసనాన్ని వశపరచుకొన్నాడు. ఎరెయతియదిగల్ అని (రాజు కాక ముందు) పిలువబడిన రెండో పులకేశి, రణవిక్రముడన్న బిరుదుగల మంగళేశుని, నడనూరులో జరిగిన ఎళ్పత్తుసింబిగె అనే యుద్ధంలో చంపాడని అనంతపురం జిల్లా పెదవడుగూరు శాసనం చెపుతుంది. (**ఎపిగ్రాఫియా ఇండికా,** వా. XL పే.225). సింహాసనాన్నెక్కిన తరువాత రాజ్యాన్ని సుస్థిర పరచి, పశ్చిమగాంగులు, కాదంబులు, ఆళుపలు, మౌర్యుల (కొంకణ)ను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. తరువాత, లాట, మాళవ, ఘూర్జరులను, హర్షవర్ధనున్ని, కళింగ, కోసల, ఆంధ్ర ప్రాంతాలను జయించి నట్టు రెండోపులకేశి విడుదల చేసిన, ప్రస్తావనలున్న శాసనాలు చాలా ఉన్నాయి. అవి, పెదవడుగూరు శాసనం, **దక్షిణ భారత శాసన సంపుటి** వా.9,శా.సం.46; హైదరాబాదు రాగిరేకు శాసనం క్రీ.శ.613, **ఇండియన్ యాంటిక్వరీ,** వా.6,పే.72-75; మోడ్లింబ్ రాగిరేకు శాసనం, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా. 38, పే.215-18, కందల్ గామ్ రాగిరేకు శాసనం, క్రీ.శ.614-15, **ఇండియన్ యాంటిక్వరీ,** వా.14, పే.330-31; రెండో పులికేశి ఎనిమిదో పాలనా సం. క్రీ.శ.617-18 నాటి విష్ణువర్ధనుని సతారా రాగిరేకు శాసనం, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.19, పే.303-11; లోహనేర్ రాగిరేకు శాసనం క్రీ.శ.630, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.27, పే.37-41; కొప్పరం రాగిరేకు శాసనం, పాలనా సం.21, క్రీ.శ.630, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.18, పే.257-61; కుబ్జవిష్ణువర్ధనుని తిమ్మాపురం రాగిరేకు శాసనం, **ఎపిగ్రాపియా ఇండికా,** వా.9, పే.317-19; ఐహోలు ప్రశస్తి శాసనం,

> ***పులకేశి, పొలికేశి, గడ్డిలాంటి జుట్టు గలవాడు. జూలుగల సింహంలాంటి వాడు. ఈ పేరు ఇద్దరు బాదామీ చాళుక్యరాజుల కుంది. ఒకరు మొదటి పులకేశి (క్రీ.శ.544-566) ఇతడు బాదామీ చాళుక్య వంశానికి పునాదిరాయి. రాజ్యానికి మూలస్థంభం. ఇంకొకరు రెండో పులకేశి (క్రీ.శ.610-642). బాదామీ చాళుక్య రాజ్యాన్ని సామ్రాజ్యంగా విస్తరించాడు. రెండో పులకేశి, క్రీ.శ.566 నుంచి 592 వరకూ పాలించిన మొదటి కీర్తివర్మ కొడుకు.***

క్రీ.శ.634-35, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.6, పే.1-12; తుంబైయనూరు రాగిరేకు శాసనం, ఎన్. రమేశన్, **కాపర్ ప్లేట్ ఇన్స్‌క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ మ్యూజియం, హైదరాబాదు,** వా.1, హైదరాబాదు 1962, పే.40-45; మారుటూరు రాగిరేకు శాసనం, **ఇదే గ్రంథం, పే.**11-39; చిప్లూన్ రాగిరేకు శాసనం, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.3, పే.50-53; లక్ష్మేశ్వర్ రాతిశాసనం, **ఇండియన్ యాంటిక్వరీ,** వా.7, పే.106-07; **దక్షిణ భారత శాసన సంపుటి**-20, శా.నిం.3; కడమరకాలవ నమూనా గుడిశాసనం, కె.వి.రమేష్, **చాళుక్యాస్ ఆఫ్ వాతాపి,** 1964,పే.98; రెండో పులకేశి మరియూ యువరాజు మొదటి విక్రమాదిత్యుని ఐహోలు శాసనం ముక్క ఇదే **గ్రంథం,** పే.104. నెరూర్ రాగిరేకు శాసనం, **ఇండియన్ యాంటిక్వరీ** వా.8, పే.43-44; ఇంకా, రెండో పులకేశి చివరి శాసనం, ఆయన కుమారుడు మొదటి విక్రమాదిత్యుడు మొదటి శాసనం మధ్య 13 సం॥ల కాలంలో విడుదలైన, ఆదిత్యవర్మ కర్నూలు రాగిరేకు శాసనం, **జెబిబిఆర్ ఏఎస్,** వా.16, పే.223-25, 233-35; అభినవాదిత్యుని నెలకుండ రాగిరేకు శాసనం, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.32, పే.213-16 మరియు పిట్టిఅమ్మన్ అరళిహొండ శాసనం, **ఎపిగ్రాఫియా ఇండికా,** వా.37, పే.333-34. ఇవి రెండో పులకేశి చరిత్ర, సాధించిన విజయాలు, చేసిన దానాల వివరాల నందిస్తున్నాయి.

క్రీ.శ.621/624లో తన తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనున్ని వేంగి ప్రాంత పాలకునిగా నియమించి తూర్పు చాళుక్యరాజ్యాన్ని ఏర్పరచాడు. అటు తరువాత, పల్లవ రాజులైన మొదటి మహేంద్రవర్మను తరిమి కొట్టాడు. ప్రస్తుత హైదరాబాదు రాగిరేకు శాసనంలో పేర్కొన్నట్లు 'సమరశత సంఘట్ట సంసంక్తపరనృపతి పరరాజయోగలబ్ధ పరమేశ్వరాపరనామధేయః' అని కీర్తించబడినా క్రీ.శ.641-42లో, పల్లవరాజు మొదటి నరసింహవర్మ జరిపిన యుద్ధంలో మరణించక తప్పలేదని చరిత్రకారులు పేర్కొన్నారు. ఏదిఏమైనా చాళుక్యరాజుల్లో అత్యంత పరాక్రమవంతునిగా పేరుగాంచాడు. ఇతని కాలంలో వాతాపి నగరాన్ని సందర్శించిన చైనా బౌద్ధాచార్యుడు యువాన్ చ్వాంగ్ అతని పాలనను ప్రశంసించాడు. ఇతని గొప్పతనాన్ని ఐహోలు ప్రశస్తి శాసనంలో, తనమిత్రుడు, మంత్రి అయిన రవికీర్తి వివరంగా పేర్కొన్నాడు.

అప్రతిహత చాళుక్య చక్రవర్తి రెండో పులకేశిని, శక్తిత్రయ సంపన్నుడని (మంత్రశక్తి, ఉత్సాహశక్తి, ప్రభుశక్తి) శాసనాల్లో పేర్కొనబడినాడు. సత్యాశ్రయ, పృథ్వీవల్లభ, పరమేశ్వర, మహారాజ, మహారాజాధిరాజ ప్రధ్వస్తప్రబల శత్రుమహిమా, ప్రతాపాతిశయోప నీత సమగ్ర సామస్త మండల, నిర్గృహీతదుష్టజన, పరిగృహీత విద్వత్ సఖుడు, అనుగృహీత భృత్యవర్గ, భృత్యలబ్ధ ప్రసాద, అప్రతిహతజ్ఞ, సర్వషడ్గుణాశ్రయ, పరమభాగవత, దేవద్విజగురు సుశ్రుషవర, దక్షిణాపథ పృథ్వీవ్యూహస్వాపి హిమాచలఅనుకారీ అని కీర్తించ బడినాడు.

ఈ హైదరాబాదు రాగిరేకు శాసనం, హైదరాబాదులోని బేగంబజారులో ఉంటున్న మహేంద్ర శాంతయ్య అనే జైన గురువు దగ్గర నుంచి 1882లో జనరల్ ఫ్రేజర్ సంపాదించి, సర్ డబ్ల్యు ఇల్లియట్‌కు చేర్చగా ఆయన వాటిని ఫాసిమైల్ కలెక్షన్స్‌లో చేర్చాడు. అలా సేకరించిన రెండో పులకేశి రాగిరేకు శాసన వివరాలను ముద్రలతో సహా ఫ్లీట్ మహాశయుడు, **ఇండియన్ యాంటిక్వరీ,** వా.6.లో ప్రచురించి పుణ్యం కట్టుకోవటాన మనకు దక్కింది.

రెండో పులకేశి హైదరాబాదు రాగిరేకు శాసన పాఠం.

**మొదటి రేకు:**



1. స్వస్తి శ్రీమతాం సకలభువన సంస్తూయమాన మానవ్యసగోత్రాణాం హారతీపుత్రాణాం స
2. స్తలోకమాతృభిః సప్తమాతృభిరభివర్ధితానాం కార్తికేయాను గ్రహ పరిరక్షణ ప్రా
3. ప్త కళ్యాణ పరంపరాణాం భగవన్నారాయణ ప్రసాద సమాదాదిత వరాహలా
4. ఞ్ఛనేరక్షణ వశీకృతాశేష మహీభృతాం చలిక్యానాం కులమలం కరిష్ణ (ష్ణోః)
5. అశ్వమేధావభృథ స్నాన పవిత్రికృత గాత్రస్య సత్యాశ్రయ శ్రీ
6. పొలికేశి వల్లభ మహారాజస్య పౌత్రః పరాక్రమాక్రాన్త వనవాస్యాది పరన్న
7. పతిమండల ప్రతి బద్ధ విశుద్ధ కీర్తి పతాకస్య కీర్తివర్మ వల్లభ మహా
8. రాజస్య తనయో న్య వినయాదిగుణ విభూత్యాశ్రయః శ్రీ సత్యాం

**రెండో రేకు మొదటి పక్క**



9. శ్రయ పృథివి వల్లభమహారాజః సమర శతసంఘట్ట సంసక్త పరన్నపతి పరా

10. జయోపలబ్ధపరమేశ్వరాపరనామ ధేయః సర్వానాజ్ఞాపయత్యస్తు వోమితంమ్ర
11. యా వాతాపీనగరీ మధిష్టితానాత్మనః ప్రవర్ధమానరాజ్యాభిషేక సంవత్సరేత్వృత
12. యే శకన్న పతి సంవత్సర శతేషు చతుత్రింశాధికేషు పంచస్వతీతేషు భావ్ర
13. పదామావాస్యాయాం సూర్యగ్రహణ నిమిత్తం మాతాన్ పిత్రోరాత్మనః పుణ్యా
14. వాప్తయే వాసిష్ఠస గోత్రాయ తైతిరీయాయ తగరాధివాసినే
15. చతుర్వేదాయోః బరఖేదకులనాధేయాయ జ్యేష్ఠశర్మణే రోట్కా
16. క్యుత్తరతః కవప్పగ్రామదక్షిణతః మాకరప్పిర్నామ గ్రామః

రెండో రేకు – రెండో పక్క :



17. సనిధిః సోపనిధిః సక్లప్తః సోపరికరః
18. ణార్ధముదకపూర్వకం దత్తః అయమస్మద్దాయో పంచమహాయజ్ఞ నిర్వాప
19. న్తవ్యో వర్ధనీయశ్చయో వాజ్ఞానాదంజర మంమరం వాత్మానం మన్య మానోప
20. హరేత్స పంచమహాపాతక సంయుక్తః బహూని కల్పసహ
21. ప్రాణి నరకం వసతి యః పాలయతి తాన్యేవ స్వర్గావసతి
23. రాజభిస్సగరాదిభిః యస్యయస్య యదా భూమిల్లోస్య తస్యం

మూడో రేకు :



24. తదాఫలం స్వదత్తాం పరదాత్తాం వాయత్నాద్రక్ష యుధిష్టర మహీం మహీ
25. మతాం శ్రేష్ఠ దానాచ్ఛ్రేయోన్నపాలనం షష్ఠి వర్ష సహస్రాణి స్వర్గో
26. మోదతి భూమిదః ఆచ్ఛేతా చానుమన్తాచతాన్యేవ నరకే వసేత్ వింధ్యా
27. ట వీష్వతో యాసు శుష్క కోట రవాసినః కృష్ణాహయోపి జా
28. యన్తే భూమిదానం హరస్తియే! దత్తానియానీహపురా నరేంద్రైః
29. ర్మార్థయ షష్కరాణి నిర్మాల్య వాస్తప్రతిమాని తాని కో నామ సాదానాని ధ
30. ధుః పునరాదదీతః‌త్ర ।ఇతి।

మానవ్యగోత్రానికి చెంది, హారీతి పుత్రులైన చాళిక్య వంశానికి చెందిన సప్తమాతృకల చేత, కార్తికేయునిచేత రక్షించబడుతున్న, భగవన్నారాయణుని చేత వరాహలాంఛనాన్ని పొందిన, సమస్త భువనముల చేత స్తుతించబడిన, అశ్వమేధ అవభృధ స్నానంతో పవిత్రమైన శరీరం కలవాడైన, సత్యాశ్రయ మొదటి పొ(పు)లికేశి వల్లభ మహారాజు మనుమడు; వనవాసి మొదలైన పరరాజుల ఏలుబడిలో నున్న అనేక రాజ్యాలపై తన పరాక్రమంతో దాడి చేసి విశుద్ధకీర్తి పతాకాన్నెగరేసిన కీర్తివర్మ వల్లభమహారాజ కుమారుడు; వినయగుణ సంపన్నుడు, సత్యాశయ బిరుదాంకితుడైన, వంద యుద్ధాల్లో శత్రురాజులనోడించి, పరమేశ్వర బిరుదు పొందిన పృధ్వీవల్లభ మహారాజు రెండో పులకేశి, తన పాలనలో నున్న ప్రజలను ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నాడు. "శకరాజు తరువాత 534 సంవత్సరాల తరువాత, తన మూడో పాలనా సం॥లో, భాద్రపద మాస అమావాస్య, సూర్య గ్రహణ నిమిత్తం, తనకు, తన తల్లి దండ్రులకు పుణ్యం కోసం, రోట్కుతికి గ్రామానికి ఉత్తరంగా కదప్ప గ్రామానికి దక్షిణంగా ఉన్న మాకరప్పి అనే గ్రామాన్ని సర్వకరపరిహారంగా నిధినిక్షేపాలతో పాటు, ఐదు గొప్ప యజ్ఞాలు చేయటానికి, ఉంబరఖేద వంశానికి, వశిష్ట గోత్రలి, తైత్తిరీయ శాఖకు చెంది, తగరనగరవాసి జ్యేష్ఠశర్మకు, ధారాపూర్వకంగా, వాతాపి నగరం నుంచి దానం చేస్తున్నాను. నేనిచ్చిన ఈ దానం నా తరువాత రాజులు పరిరక్షించి, వృద్ధి చేయాలి".

రెండో పులకేశి గుణగణాలను వర్ణించటమే కాక, అతడు క్రీ.శ.610వ సం॥లో సింహాసనం ఎక్కాడన్న విషయాన్ని తెలియ జేయటం వల్ల, ఆ విషయం హైదరాబాదునగరం ద్వారా వెలికి రావటం వల్ల, ఈ శాసనం **అలనాటి తెలంగాణ మేటి శాసనాల్లో** ఒకటైంది. శాసనాక్షరాలు, తొలి కాలపు కన్నడ అక్షరాలు రూపుదిద్దుకొంటున్న నేపథ్యాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ శాసన పాఠం ముద్రల నందించిన ప్రముఖ చరిత్రకారుడు కొండా శ్రీనివాసులుకు, తెలుగులో తొలిసారిగ ప్రచురిస్తున్న యం. వేదకుమార్‌గారికి కృతజ్ఞతలు.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in



# స్మైల్ ప్లీజ్...

## ఆగస్టు 19న వరల్డ్ ఫోటోగ్రఫీ డే

ఫోటో.. మాటలకందని ఓ దృశ్య కావ్యం.. ప్రేమగా లాలిస్తుంది.. హాయిగా నవ్విస్తుంది.. కోపంగా కసురుకుంటుంది.. కంటతడి కూడా పెట్టిస్తుంది..

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జాక్వేస్ మాండే డాగ్వేర్ 1837లోనే తొలిసారి డాగ్వేరియన్ ఫొటోగ్రఫీ విధానానికి రూపకల్పన చేశారు. రెండేళ్ల తర్వాత 1839 జనవరి 9న ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఈ విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. వందేళ్ల తర్వాత ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం డాగ్వేర్ ఫొటోగ్రఫీ పేటెంట్లను కొనుగోలు చేసింది. ప్రజలందరికీ ఈ విధానం ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు గుర్తుగా 2010 నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. అప్పట్లో ఫొటోలు తీసేందుకు రాగి, వెండిని ఉపయోగించేవారు.

### ఒక్క క్లిక్.. ఎన్నో భావాలకు లాజిక్..

కంటెంట్ ఎంత బాగా ఉన్నా.. అందుకు తగ్గ కటౌట్ లేకపోతే ఆ స్టోరీ వేస్టే.. అంత గొప్పదనం తెలిపే కటౌట్ ను కేవలం ఒక్క క్లిక్ తో క్రియేట్ చేయొచ్చు.. కేవలం ఒక్క ఫొటోతో ఎన్నో భావాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసే అద్భుతమైన శక్తి ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. మానవ జీవితానికి ఈ ఫొటోగ్రఫీకి అవినాభావ సంబంధం ఉంది. కాలగర్భంలో కలిసిపోయిన ఎన్నో విషయాలకు స్వీట్ మెమోరీస్‌కు ఫొటోలే నిదర్శనంగా నిలుస్తాయి.

బ్లాక్ అండ్ వైట్‌తో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలానికి అనుగుణంగా కలర్‌ఫుల్‌గా మారింది. దీంతో ఫొటోగ్రఫీ రోజురోజుకు ఎన్నెన్నో ప్రత్యేకతలను పరిచయం చేస్తూ కొత్త పుంతలు తొక్కుతోంది.

### ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర :

పలు రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతి చర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. రెండు గ్రీకు పదాల కలయికే ఫొటోగ్రఫీ. ఫొటో అంటే చిత్రం. గ్రఫీ అంటే గీయడం అని అర్థం.. ఫైనల్‌గా ఫొటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం అన్నమాట. ఈ ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో ప్యారిస్ లో బ్లాక్ అండ్ వైట్ కలర్లతో ఫొటోగ్రఫీ ప్రారంభమైంది.

### మన దేశంలో ఫొటోగ్రఫీ ప్రస్థానం ఎప్పుడు ప్రారంభమైందో తెలుసా..

ఫ్రాన్స్ దేశంలో 1839లో అధికారికంగా ఫొటోగ్రఫీని ప్రపంచానికి ఉచితంగా అందించినా.. భారతదేశానికి 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. అప్పుడు కూడా బ్రిటీష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని వినియోగించేవారు. 1977 నుంచి భారతదేశంలోని సామాన్యులకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి వచ్చింది. మన దేశంలో తొలిసారిగా లాలా దీన దయాళ్ ఫొటోగ్రఫీకి శ్రీకారం చుట్టారు.

### జ్ఞాపకాలకు మధురత అద్దే ఫొటోగ్రఫీ

ఒకప్పుడు రీల్స్‌తో ఫొటోలు తీసే స్థాయి నుంచి ఇప్పుడు చిన్న మెమొరీ కార్డుతో వందలాది ఫొటోలు తీసే స్థాయికి ఫొటోగ్రఫీ చేరుకుంది. ఇంతటి పరిజ్ఞానం వెనుక ఎందరో శాస్త్రవేత్తల అధ్యయనాలు, పరిశోధనాలు, నిరంతర కృషి దాగివుంది. ఆ మహనీయులను ఒక్కసారి గుర్తు చేసుకోవడమే ఈ అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం ముఖ్యోద్దేశం.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com

ద

# సామరస్య పర్యావరణం – అభివృద్ధి – పరిరక్షణ

అభివృద్ధి, పరిరక్షణలనేవి పర్యావరణ చింతనలో తరచుగా ప్రస్తావితమవుతూ ఉంటాయి. అభివృద్ధి వాదులు పరిరక్షణ గురించి ఆలోచించరని పర్యావరణ వాదులు పేర్కొంటూ ఉంటారు. పరిరక్షణ వాదులు అభివృద్ధిని అడ్డుకుంటూ ఉంటారని అభివృద్ధి వాదులు అభియోగం మోపుతూ ఉంటారు. పర్యావరణ చింతనలో ఈ రెండూ ఒకదానికొకటి విరుద్ధమైనవిగా, పరస్పరం వ్యతిరేకించుకునేవిగా కనబడుతూ ఉంటాయి. వాస్తవానికి ఈ రెండూ పార్శ్వాలు లేదా పక్షాలు ఒకదానితో ఒకటి ఏకీభవిస్తూ ఒక సయోధ్యను సాధించవచ్చు. సామరస్య పూర్వకంగా వ్యవహరించవచ్చు. కారణాలు ఏవైనా గానీ అభివృద్ధికి, పరిరక్షణకు మధ్య ఒక వైషమ్యం ఎప్పుడూ కొనసాగుతూ ఉన్నట్లుగా గమనించగలం. ఆ వైషమ్యం మరింతగా ఈ రెంటి మధ్య దూరాలను, అంతరాలను పెంచుతూ పోవటం కంటే ఎక్కడో ఒక దగ్గర వీటిని మరింత సాన్నిహిత్యంలోకి తెచ్చే ప్రయత్నం జరగాలి. ఆ ప్రయత్నాన్ని ఇటీవలి కాలంలో సయోధ్యపర్యావరణంగా భావించటం జరుగుతూ ఉన్నది. అభివృద్ధికి మూల్యంగా పరిరక్షణను వదులుకోవలసిన అవసరం లేదని, పరిరక్షణ కారణం సాకుగా అభివృద్ధిని ఆపుకోవలసిన, నిరోధించాల్సిన పనిలేదని కూడా 'సామరస్య పర్యావరణం' అనే భావన మనలను ఆలోచింపజేస్తున్నది.



మానవాళి సహజ ప్రపంచం లేదా ప్రకృతి మీద అపరిమితమైన ఒత్తిడిని వనరుల విషయంగా విధిస్తూ వస్తున్నది. మానవ ఆర్థిక సంక్షేమాన్ని త్యాగం చేయకుండానే భూమి మీద మనుగడ సాగిస్తున్న అనేక జీవజాతులను కాపాడుకోగలమనే విషయంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. లేదా ప్రజలు చర్చించుకునే విధంగా ప్రేరేపణ ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉంది. అసలు మానవ కార్యకలాపాల మధ్య భూమండలం మీద జీవజాతులు ఎలా మనగలుగుతాయనేది ఎప్పుడూ ప్రశ్నార్థకమే. మానవాళి తన అభివృద్ధిని, తన సంక్షేమాన్ని మాత్రమే చూసుకోకుండా ఇతర జీవ జాతుల అభివృద్ధి, సంక్షేమంతోటే తను అభివృద్ధిమవుట ఉంటుందనేది గుర్తించగల చైతన్యం, అవగాహన పెంపొందాలి. ఎకాలజీకి ఎకనమిక్స్‌కి జరుగుతున్న యుద్ధం, ఘర్షణ నివారింపబడాలంటే పరిసరాలతో స్నేహపూర్వక సంబంధాలను ఏర్పరచుకోవాలి. మానవ సంస్కృతి, నాగరికతలు భూమిమీది మానవేతర జాతులను మట్టుబెట్టకుండా వాటి అంతానికి, అంతరింపుకు కారణం కాకుండా జీవించడం నేర్చుకోవాలి. అందుకు కావలసింది ఇతర మానవేతర ప్రాణులు, జీవ జాతులలో కలసి జీవించటం, ఈ భూమిని పంచుకోవటం జరగాలి. అంటే మానవ ఆవాసాలను ఉద్దేశపూర్వకంగా ఇతర జీవరాశులలో పంచుకొనేందుకు సంసిద్ధులం కావాలి. పర్యావరణ తాత్త్విక అవగాహనలో ఈ సయోధ్య పర్యావరణం లేదా సామరస్య పర్యావరణం ఇస్తున్న ఆలోచన ఇదే. అంటే మన పర్యావరణ అవగాహన చైతన్యంలో మన పరిసరాలలో ఎవరు పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు పర్యావరణ పరిరక్షణకు ఎటువంటి యాత్రలు చేస్తున్నారో వాటిని అధ్యయనం చేయాలి. అవగాహన పెంచుకోవాలి. తద్వారా వచ్చే చైతన్యాన్ని ఉమ్మడిగా పంచుకోవాలి. మానవేతర జీవజాతులలో మనం పంచుకోవలసినది ఎంతయినా ఉన్నది. నిజానికి ఇటువంటి అవగాహనా చైతన్యాలు మన జీవన విధానంలో ఎన్నయినా కనిపిస్తాయి. ఒక వ్యవసాయం మీద ఆధారపడిన రైతు కుటుంబం పాడికోసం రెండు పశువులను పెంచుకుంటే ఆ పశువు ఇచ్చే పాడి మొత్తాన్ని స్వీకరించడు. దాని సంతతికి ఒక భాగం వదిలి తక్కిన మూడొంతుల పొదుగును పిండుకోవటం అనేది గ్రామ సీమలో మనం చూసిందే. అయితే పాడి పరిశ్రమగా మారాక పాడి పశువులకు ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ ఇచ్చి మరీ పొదుగు పిండేయటం, పొదుగుకు

యంత్రాలు అమర్చి సైతం పొదుగు పిండటం కూడా మన అనుభవంలో ఉన్నదే. ఆ పశువులకు తమ సంతతిని దూరం చేసి యాంత్రీకరణతో మనిషి ప్రాణి ధర్మాన్ని విస్మరించిన వైనం కూడా మన అనుభవంలోదే. ఇటువంటివి మన సామాజిక జీవితంలో ఇతర ప్రాణుల నొప్పిని, బాధను అర్థం చేసుకోగలిగిన సంఘటనలు, ఉదంతాలు ఎన్నో కనిపిస్తాయి. ఆ ఆచరణ వెనుక గల పర్యావరణ విలువల వ్యవస్థను అర్థం చేసుకోవటం ద్వారా సామరస్య పూర్వక పర్యావరణం సృష్టించుకోవలసిన అగత్యాన్ని గుర్తించగలుగుతాం. ఆమోదించ గలుగుతాం కూడా.



మనిషి కర్తవ్యం, ధర్మం భూమండాలాన్ని దోపిడి చేయటం కాదు. వనరులను పిండటం కాదు. సంపాదన ఆపివేయటం, జీవితాన్ని నిలిపివేయటం, లాభం ఆశించకుండా పని చేయటం అనే దాన్ని సామరస్య పర్యావరణం బోధించదు. భూమి మీద జీవరాశులు పెద్ద ఎత్తున అంతరించిపోయే పరిస్థితులను సృష్టించకుండా ఈ ప్రమాదాలను నివారించాలని సామరస్య పర్యావరణం చెపుతుంది.

దీనికి ఒకటే దారి. భూమిపైన సహజ ఆవాసాలను కాపాడాలి. ఇప్పటికి మనిషి నీడపడని సహజ ఆవాసాలు కాపాడబడాలి. మనకు ఎన్ని ఆవాసాలను కాపాడటం చేతనైతే అన్నిటినీ యథాతథంగా ఉంచాలి. ఇక రెండవది. ఇప్పటికే మనుషులు ఆక్రమించి వృద్ధి పరచబడిన సహజ ఆవాసాలను మరింత సహజ స్థితికి తీసుకొచ్చే విధంగా రూపుదిద్దటం. దీనినే మనం పునరుద్ధరణ పర్యావరణం అంటున్నాం. 'జాగ్రత్త గలిగిన పాదం ఎక్కడికైనా అడుగు వేయగలుగుతుంది' అని ఒక చైనా దార్శనిక రుషి చెప్పినట్లుగా తగిన జాగ్రత్తలు మనం పర్యావరణ పరంగా తీసుకోవలసి ఉంది. ఇప్పటి వరకూ మనం వేటిని కాపాడుకుంటూ వచ్చామో, వేటివల్ల పర్యావరణ వ్యవస్థలు సురక్షితంగా ఉండగలిగాయో వాటిని కొనసాగించేందుకు వెనకాడకూడదు. మనమంతా మనుషులం. మానవాళిగా ఇప్పటి వరకు సాధించుకు వచ్చినదేదీ భావి తరాలకు అందకుండా పోకూడదు. మనం నిర్మించుకున్న ఈ ప్రపంచంలో భాగస్వాములం మనమే కనుక ఇది మనకే చెందుతుంది. మానవాళి తప్పిదాలు మానవేతర జీవ జాతుల మనుగడకు ముప్పును తేకూడదు. ఆపదలు సృష్టించకూడదు.

సయోధ్య లేదా సామరస్య పర్యావరణం అనేది అదొక శాస్త్రీయమైన ఆవిష్కరణ, వ్యవస్థీకరణ, నిర్వహణ ఈ మూడు సరికొత్త ఆవాసాలను నెలకొల్పి అక్కడ ఉండే అన్ని రకాల మానవేతర జీవరాశులను పరిరక్షిస్తాయి. అటువంటి స్థలాలు జీవజాతుల వైవిధ్యాన్ని ప్రేమిస్తూ, ఆ జీవ వైవిధ్యం కారణంగా తమ సాంస్కృతిక వైవిధ్యం ఇంతకాలం నిలిచి ఉందని గుర్తిస్తాయి. ఆ కొత్త ఆవాస స్థలాల్లో మనుషులు జీవిస్తారు. పని చేస్తారు. ఆడతారు పాడతారు. పునరుద్ధరణ లేదా సయోధ్య పర్యావరణం అంటే భూవినియోగం మానవాళి ఎలా చేస్తుందనే దాని మీద ఆధారపడి నిర్వహించబడుతుంది. ఇప్పుడు వాడుతున్న దాని కంటే వివేకవంతంగా, విచక్షణాయుతంగా భూమి వినియోగం జరగాలి. అది మన అవసరాలను ఎలా తీరుస్తుందో అలాగే వన్య ప్రాణుల, స్థానిక జీవరాశుల అవసరాలను కూడా సరి సమానంగానే తీర్చగలుగుతుంది. ఇప్పుడు మానవాళికి కావలసింది ఇతర మానవులతో సయోధ్య, సామరస్యాలు కావు ప్రకృతితో, పర్యావరణంతో, పరిసర ఆవాస వ్యవస్థలలో, ఆయా ఆవరణ వ్యవస్థలలోని అనేక జీవ జాతులతో సయోధ్య, సామరస్యం కావాలి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# జాంబపురాణం - ప్రదర్శనా వైవిధ్యం

భారతదేశం వర్ణ, కులవ్యవస్థ ఆధారంగా నిర్మితమైనది. ఈ వ్యవస్థలపై ప్రజాజీవనం ఉందని పైకి అనక పోయినా జానపదులు దీనికి అలవాటై పోయారని చెప్పవచ్చు. గ్రామీణ వ్యవస్థకు జానపద విజ్ఞానం ఒక అమూల్య సంపద. ఇది ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమింపచేస్తున్న తరగని పెన్నిది. ఈ విజ్ఞానం పైకి బహుముఖాలతో, రూపాలతో, ప్రయోజనాలతో కనపడుతున్నా అంతస్సూత్రంగా మాత్రం జానపదుల జీవన విధానాన్ని వారికి కావల్సిన ముందు చూపును అంటి పెట్టుకునే లక్షణం జానపద విజ్ఞానానికి ఉంది.

జానపద విజ్ఞానంలో జానపద కళారూపాలు అంతర్భాగం. దీనిలో వస్తువైవిధ్యం, ప్రదర్శనా వైవిధ్యం కలిగిన కళారూపాలు ఎన్నో ఉన్నాయి. ఇవి కొన్ని కులాలకు వంశపారంపర్యంగా జీవన భృతిని కలిగిస్తున్నాయి. ఐతే ఇలాంటి కులాల్లో కుల పురాణాలు ప్రదర్శించే కళాకారులను ప్రధానంగా పేర్కొనవచ్చు. వీరిలో చాలా వరకు త్యాగం సంప్రదాయం ఉన్న వారే అధికంగా ఉన్నారు.



కులపురాణం ప్రదర్శకులు మొదటి నుంచి వైవిధ్యభరితంగా తమ కళారూపాన్ని ప్రదర్శిస్తూ పోషిత కులాలను రంజింప చేస్తున్నాయి. ఇదే క్రమంలో ధాతృకులాల ఔన్నత్యాన్ని కాపాడుతూ తమ ఉనికిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. ప్రతిఫలంగా వారిచ్చే త్యాగంతో జీవనం గడుపుతున్నారు. కుల పురాణాల ప్రదర్శనల ద్వారా భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

కుల పురాణాలు ప్రదర్శించే కళాకారుల్లో రుంజ, పిచ్చుక కుంట్ల, మాష్టి, కిన్నెర, భాట్స్, ఢాడి, తోటి, పర్దాన్, పట్టెడని కళాకారులు తమ కథాగానం ద్వారా, కాకి పడిగెల, ఏనంటి, గౌడజెట్టి, గుర్రపు, కొర్రాజుల, పూజరి, అద్దపు, కూనపులి, మాసయ్యలు, ఉక్కరి, కొమ్ము, తెల్జూరు, పాండవులోల్లు పటం కథా రూపంలోను, చిందు వాళ్ళు నాటక రూపంలోను, నులకచందయ్యలు వచన రూపంలోను కులాపురాణాలు ప్రదర్శిస్తారు. ఈ కళాకారులు ఆయా ధాతృకులాల వద్దకు వెళ్లి వారి వారి కుల పురాణాలు ప్రదర్శిస్తారు.

**జాంబ పురాణం - ప్రదర్శనా వైవిధ్యం :**

దళిత మౌఖిక సాహిత్యం చరిత్రలో జాంబ పురాణం అపూర్వమైనది. ప్రదర్శన సైతం వైవిధ్యభరితమైనది. ఈ పురాణాన్ని దళిత ఉపకులాలకు చెందిన వృత్తి కళాకారులు ప్రదర్శిస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న త్యాగం/మిరాశి హక్కులను పొందుతూ కళామతల్లి ముద్దుబిడ్డలుగా పేరొందారు. ప్రదర్శనే జీవనాధారంగా భావించిన వీరు దళిత సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భవిష్యత్‌కు మార్గదర్శకంగాను, అనుసంధానకర్తలు గాను మారుతున్నారు. ముఖ్యంగా జాంబ పురాణాన్ని డక్కలి, చిందు, మాష్టి, కిన్నెర, నులక - చందయ్య కళాకారులు ప్రదర్శిస్తారు. ఈ పురాణం మాదిగ కులస్థులకే చెందినదే అయినా, విశ్వం పుట్టుక, దేవతల ఆవిర్భావం కూడా ఉంటుంది. అదేవిధంగా మాదిగ వారి పుట్టుక చరిత్రతో పాటు, సమాజంలోని వివిధ కులాల పుట్టుక, కుల నిర్మాణం, ఉత్పత్తి, వృత్తి పనిముట్లు ఆవిర్భావ చరిత్రలు సవివరంగా ఉంటాయి. వేదాలు, ఉపనిషత్తులు, యుగాలు వంటి ఎన్నో విషయాల వివరణ ఉంటుంది. జాంబ పురాణాన్ని లోతుగా అధ్యయనం చేస్తే సృష్టి రహస్యాలు, సామాజిక విలువలు, కట్టుబాట్లు అర్థం చేసుకోవచ్చు.

**జాంబ పురాణం - ఇతర కుల పురాణాలతో సంబంధం :**

జాంబ పురాణం ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా ఆశ్రిత వృత్తి కళాకారులు ఉన్నప్పటికీ, జాంబపురాణంలో అంతర్భాగమైన ఆది పురాణంను ఒక ఘట్టంగా చేసుకొని ప్రదర్శించే వృత్తి కళాకారులు కూడా ఉన్నారు. జాంబ పురాణ ప్రదర్శనలో ప్రధాన ఘట్టం ఆదిపురాణం. దీనినే శక్తిపురాణం శక్తి విలాసం, అని కూడా అంటారు. మిగతా కులపురాణాల్లో కూడా ఆది పురాణంను ప్రధాన ఘట్టంగా చేసుకొని మాసయ్యలు మడేలు పురాణం, ఏమాటి, గౌడజెట్టి వాళ్ళు గౌడపురాణం, అద్దపువాళ్ళు నాభికాపురణంను ప్రదర్శిస్తారు. కాగా బైండ్ల, పంచాల కథకులు మాత్రం ఎల్లమ్మ కథా ప్రదర్శనలో భాగంగా ఆదిపురాణంను వివరిస్తారు.

**జాంబ పురాణం ప్రత్యేకతలు - అధ్యయన ఆవశ్యకత**

జాంబ పురాణ ప్రదర్శన వెనుక జానపదుల నమ్మక వ్యవస్థ ఎంతో దాగి ఉంది. కులాల పుట్టక, సృష్టి ఆవిర్భావం వివరించడమే ఈ పురాణం ప్రత్యేకత. ప్రధాన ఘట్టమైన ఆదిపురాణం లేదా శక్తి పురాణంనకు కథకులు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఇంకా ఈ పురాణంలో విశ్వం పుట్టుక, దేవతల వివాహాలు, వృత్తి పరికరాల తయారీ, వివిధ కులాలు, కులవృత్తుల గురించి వివరంగా తెలుసుకోవచ్చు. యుగాల ప్రస్థావన చిందు, ఢక్కలి వారి జాంబ పురాణాల్లో చక్కగా వివరిస్తారు. నందవీర, అనంత, అచ్యుత, అద్భుత,



తమండ, తారక, అండజ, భిన్నజ, అన్యోన్య, అలంకృత, విశ్వంభర, సరిభవ, సకధర్మ, సకల స్వరూప, కృతా, త్రేతా, దాప్వర, కలియుగాల చరిత్ర, దేవతల పుట్టుక, వివిధ సంఘటనలు ఉంటాయి. ఆకాశం, భూమి పుట్టుక అనంతంనెర జాంబవవంతుడు, శ్రీమన్నారాయణుడు, ఆదిశక్తిల ఆవిర్భావం గురించి వివరించడం జరుగుతుంది. సృష్టి రచనలో భాగంగా ఆదిపరాశక్తి మూడు గుడ్లు పొదడం, ఆ గుడ్ల నుండి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు జన్మించడం, గుడ్లపై పెచ్చులు ఆకాశం, భూమి, సూర్య, చంద్రులు, నక్షత్రాలుగా ఏర్పడిన విధానం ఉంటుంది.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వివాహ సందర్భంలో జాంబవంతుడు వెండి, బంగారు, రాగి కొండలను కరిగించి మంగళ సూత్రాలు తయారు చేయిస్తాడు. ఇతర వస్తువుల తయారీకోసం ఢక్కలి వాడిని చంపి, అతని శరీరంలోని ఒక్కొక్క భాగం నుండి ఒక్కొక్క వృత్తి పనిముట్లు తయారు చేసి విశ్వబ్రహ్మకు అందిస్తాడు. ఈ వస్తువులతో మంగళ సూత్రం తయారు చేసి ఇస్తాడు.

జాంబ పురాణంలో ఎన్నో మానవీయ విలువలు ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తున్న అస్పృశ్యత గతంలో లేదని వారించేదే జాంబ పురాణం. అస్పృశ్యత పేరుతో శూద్రులు, అణగారిన కులాలపై జరిగిన, జరుగుతున్న అణచివేతలను రూపుమాపేందుకు ఈ పురాణం ఎంతగానో దోహదపడుతుంది. చిందు, ఢక్కలి వారు ప్రదర్శించే జాంభపురాణంలో అగ్రకులాలు, అణగారిన కులాల మధ్య జరిగే సంభాషణతో ప్రారంభమవుతుంది. ఎవరిది ఎక్కువ కులం కాదు అందరు సమానం అని బోధపడే విధంగా కథాగమనం సాగుతుంది.

వ్యక్తుల మధ్య వావి వరుసలు ఏ విధంగా ఉండాలనే విషయాలు జాంబ పురాణ కథలో చక్కగా వివరించబడుతాయి. తల్లీకొడుకుల, అన్నా చెల్లెళ్ల అనుబంధం, తల్లి రుణం తీర్చుకోవడం వంటి వాటి గురించి శక్తి పురాణంలోని సృష్టి ఆవిర్భావంలో తెలుసుకోవచ్చు. అదేవిధంగా తల్లి దండ్రుల నుండి వారసత్వంగా సంక్రమించే వస్తువులను అన్నదమ్ములు సమపాళ్లల్లో పంచుకోవాలనే విషయాన్ని జాంభపురాణం వివరిస్తుంది. ఆదిశక్తి నుండి సంక్రమించిన వివిధ విద్యలు, వస్తువులు త్రిమూర్తులు సమానంగా పంచుకొని నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు.

**జాంబపురాణం - పాత్రల ప్రాధాన్యత :**

జాంబ పురాణం ప్రదర్శనలో వివిధ పాత్రలు మనకు కనిపిస్తాయి. ప్రతీ పాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ప్రదర్శకులు తమ కథాగమనానికి అనుగుణంగా ఆయా పాత్రలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అవగతం అవుతుంది. ముఖ్యంగా ఢక్కలి, చిందు కళాకారులు ప్రదర్శించే జాంబపురాణంలోని ఆది పురాణం ఘట్టాన్ని పరిశీలిస్తే ఆదిపరాశక్తికి మొదటి ప్రాధాన్యతను, ఆ తరువాత శంకరుడికి రెండవ, జాంబవంతుడికి మూడ, ఆడ, మగ నెమళ్లకు నాలుగవ, ఐదవ ప్రాధాన్యత ఇచ్చినట్లు జాంబ పురాణ కథ ద్వారా తెలుసుకోవచ్చు. కథకులు ఆయా పాత్రలకు ఎలాంటి ప్రాధాన్యత కల్పించినా ఆది జాంబవంతుడు చుట్టూ కథాగమన సాగడం గమనార్హం.

**ముగింపు :**

జాంబ పురాణ అధ్యయనం నేటి ఆధునిక యుగంలో అత్యంత ఆవశ్యకమైనదిగాను, ప్రాధాన్యత కలిగినది గాను చెప్పవచ్చు. జాంబ పురాణ ప్రదర్శకులైన చిందు, డక్కలి, మాష్టి, కిన్నెర, నులక చందయ్య కళాకారుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. వారిని పరిరక్షించుకొని భవిష్యత్ తరాలకు జాంబపురాణ ఆవశ్యకతను తెలియజేయాల్సిన అవసరం అందరిపై ఉంది. దీనికై విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, పరిశోధకులు జాంబపురాణాన్ని వివిధ కథకుల ద్వారా సేకరించి తులనాత్మక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. జాంబ పురాణం పరిరక్షణ, పరిపోషణ కోసం యువ కళాకారుల శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు వివిధ స్థాయిల్లో దశల వారీగా పాఠ్యాంశాల్లో జాంభ పురాణం ఏర్పరిచేలా ప్రభుత్వం చర్య చేపట్టాలి.

జాంబ పురాణం వివిధ ప్రదర్శనలను ఆడియో, వీడియో, ఫోటో మాధ్యమంలో డాక్యుమెంటేషన్ చేయడంతో పాటు కథల్ని ఉన్నదున్నట్లుగా ఎత్తిరాసి పుస్తకరూపంలో ప్రచురించాలి. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో జాంబ పురాణ ప్రదర్శనలు, సదస్సులు ఏర్పాటు చేసి జాంభపురాణం ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి. ప్రభుత్వం జాంబపురాణం ప్రదర్శనా కళాకారులను గుర్తించి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి. కళాకారులకు వృద్ధాప్య పెన్షన్లు, ఉచిత నివాసగృహాలు, ప్రయాణ రాయితీలు కల్పించి ఆదుకున్నట్లే జాంబపురాణ కథకులకు ఆదరణ కలుగడంతో పాటు, జాంబ పురాణం పదికాలాల పాటు సజీవంగా ఉంటుంది.

- డా॥ గడ్డం వెంకన్న
m : 9441305070
e : gaddamvenkanna@gmail.com

## సమాచార సాంకేతిక రంగంలో – బహుముఖ ప్రయోజనకారి

# బిగ్‌డేటా...!!

దారిద్ర్యరేఖకు దిగువనున్న వర్గాల ప్రజలందరినీ పేదరిక విషవలయం నుండి వెలుపలికి తీసుకొచ్చేందుకు దేశంలోని ప్రజలందరి యొక్క వ్యక్తిగత అర్హతలు, ఆయా పథకాల నియమ నిబంధనల సమాచారాన్ని క్రోడీకరించి వారందరికీ విభిన్న రకాల సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విజయవంతంగా అమలు చేస్తూ, దేశం నుండి పేదరిక మహమ్మారిని తుదముట్టించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నాయి.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ వంటి ఎలక్ట్రానిక్ వాణిజ్య వేదికలు (E-Commerce Platforms) తమ వినియోగ దారుల నుండి ఇష్టాలు మరియు భాగస్వామ్యాల (Likes & Shares) రూపంలో వెలువడే వారి ప్రతిస్పందనలకు సంబంధించిన సమాచారాన్ని నమోదుచేసుకుని తదను గుణంగా, వారికి సేవలు అందిస్తూ భారీ స్థాయిలో లాభాలు ఆర్జించడం మనందరం చూస్తూనే ఉన్నాం. 'ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, కూ' లాంటి సామాజిక మాధ్యమాలు కూడా వినియోగ దారుల ఇష్టాయిష్టాలను తెలుసుకొని, తదనుగుణంగా తమ సంస్థల నిర్వహణలో మెళకువలు పాటిస్తూ కోట్లాదిరూపాయల లాభాలు ఆర్జిస్తున్నాయి. అంతేకాకుండా భూవాతావరణంలో సంభవించే మార్పులకు సంబంధించిన సమాచారాన్ని అనుక్షణం నమోదు చేసుకుంటూ, వాటి పర్యవసానాలను నిరంతరం, నిశితంగా పరిశీలిస్తూ ఎల్‌నినో, లానినా, కరువులు, భూకంపాలు, వరదలు, సునామీల్లాంటి ప్రకృతి విపత్తుల నుండి ప్రపంచవ్యాప్తంగా నున్న విభిన్న వాతావరణ కేంద్రాలు ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నాయి. ఇవి మచ్చుకు కొన్ని ఉదా॥లు మాత్రమే. అయితే ఇలా విభిన్న సంస్థలు ఎలా తమ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాయని తరచిచూస్తే, మనకు లభించే ఏకైక సమాధానమే "బిగ్‌డేటా". "ఇందుండు దందుగలదని సందేహం వలదన్నట్లు" ప్రతీ రంగంలోనూ బిగ్ డేటా విస్తృత ప్రయోజనాలందించే కల్పవృక్షంగా విరాజిల్లుతోంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన బిగ్‌డేటా గురించి మనం కూడా తెలుసుకుందామా!!




### బిగ్‌డేటా అంటే?

మనం కంప్యూటర్‌తో ఏవైనా క్రియలను నిర్వహించేటపుడు అక్షరాలు, అంకెలు, విభిన్న సంకేతాల రూపంలో ఉత్పత్తి కాబడే వాటిని సమాచారం (Data) అంటారు. ఈ సమాచారమంతా (Data) ఎలక్ట్రిక్ సంకేతాల రూపంలో కంప్యూటర్‌లో నిల్వచేయబడి, ప్రసారం చేయబడుతుంది.

పెద్ద మొత్తంలో సమాచారాన్ని (డాటా) 'బిగ్‌డేటా' (Bigdata also data, But with huge size) అంటారు. కాలం గడిచే కొద్దీ దీని పరిమాణం కూడా విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. కాబట్టి బిగ్‌డేటా అత్యధిక పరిమాణం (Huge volume) మరియు అత్యంత సంక్లిష్టతలతో (Complexity) కూడి ఉంటుంది. అందువల్ల దీనిని సాంప్రదాయ గణన యంత్రాలు నిల్వచేయడం, ప్రసారం చేయడం లాంటి ప్రక్రియల్ని సమర్థవంతంగా నిర్వహించలేవు.

### బిగ్‌డేటా – దానిలోని రకాలు

బిగ్ డేటా క్రింద పేర్కొన్న విధంగా 3 రకాలుగా ఉంటుంది.

**నిర్మాణాత్మక సమాచారం (Stctured Data) :**

ముందస్తుగా (Preset) ఒక స్థిరమైన ఆకృతిలోకి మార్చి, క్రమపద్ధతిలో అమర్చిన సమాచారాన్ని నిర్మాణాత్మక సమాచారం అంటారు. ఇది ఒక పట్టిక రూపంలో అడ్డ మరియు నిలువు వరుసలు (Rows & Colummns)ను కల్గి ఉంటుంది. ఈ రకమైన సమాచారంలోకి సులభంగా ప్రవేశించి (Access) మనకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చు. ఈ రకమైన సమాచారాన్ని నవీకరించడం గానీ లేదా తొలగించడం గానీ చాలా తేలిక. అంతేకాకుండా దీనిని సాంప్రదాయ దత్తాంశనిధి అయిన అనుసంధాన దత్తకోశ నిధి (Relational Database management System - RDMS)లో ఫైల్స్ మరియు రికార్డ్స్ రూపంలో నిల్వచేయవచ్చు.

ఉదా: ఎస్క్యూఎల్ (SQL-Stctured query lamsauge)

డేటాబేస్, ఎక్సెల్ షీట్స్, ఆన్‌లైన్ పత్రాలు (Online firms), జీపీఎస్ లేదా ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్

**నిర్మాణాత్మకం కాని సమాచారం (Unstctured data) :**

ముందస్తుగా (Preset) ఒక క్రమపద్ధతిలో అమర్చని, స్థిరమైన ఆకృతి లేనటువంటి సమాచారాన్ని నిర్మాణాత్మకం కాని సమాచారం (Unstctured data) అంటారు. దాదాపు 80 నుండి 90 శాతం నిర్మాణాత్మకం కాని సమాచారం ప్రపంచ వ్యాప్తంగా నున్న విభిన్న రకాల సాంకేతిక సంస్థల నుండి ఉత్పత్తి అవుతుంది. నిర్మాణాత్మక సమాచారంతో పోలిస్తే దీని పరిమాణం కాలం గడిచే కొద్దీ శరవేగంగా పెరుగుతుంది. అయితే దీనిని సాంప్రదాయ బద్ధంగా వినియోగించే అనుసంధాన దత్త కోశనిధిలో నిల్వచేయలేము. No Sql డేటాబేస్, డేటాలేక్స్, డేటావేర్‌హౌసెస్ లాంటి వాటిలో నిలవచేయవచ్చు. ఈ రకమైన సమాచారంలో అక్షరాలు (letters), చిత్రాలు (images), దృశ్యరూపకాలు (Videos) లాంటివి ఉండడం వల్ల, సాధారణ సాఫ్ట్‌వేర్స్ సహకారంతో, నిర్మాణాత్మక సమాచారం (Stcutrued data)లో లాగా దీనిలోకి సులువుగా ప్రవేశించడం (Access), వెతకడం (Search), ప్రసారం (Process), విశ్లేషణ (Analysis) లాంటి కార్యక్రమాలు చేయడం అంత సులువు కాదు. ఇలాంటి సమాచారం విశ్లేషణకు కృత్రిమ మేధ సహకారం తీసుకుంటారు. ఈ రకమైన సమాచారంలో ఎన్నో విలువైన విషయాలు ఉ ంటాయి. అత్యున్నత వాణిజ్య సంస్థలు తమ కీలక వ్యాపార నిర్ణయాలకు సంబంధించిన ప్రకటన చేసేటప్పుడు విలువైన సమాచారాన్ని ముందస్తుగా పరిశీలించడం జరుగుతుంది.




ఉదా : ఈ మెయిల్స్, సామాజిక మాధ్యమాలు మొబైల్, కమ్యూనికేషన్ మరియు విభిన్న శాస్త్రసాంకేతిక సంస్థల నుండి వెలువడే సమాచారం.

**పాక్షిక నిర్మాణాత్మక సమాచారం (Semi-Stctured data) :**

డేటాకు ఉండవలసిన ఎలాంటి లక్షణాలు లేకుండా, కేవలం ఒక నిర్మాణాన్ని (Stcture) మాత్రం కలిగి ఉన్న సమాచారాన్ని "పాక్షిక నిర్మాణాత్మక సమాచారం" అంటారు. దీనికి నిర్మాణాత్మక మరియు నిర్మాణాత్మకం కాని సమాచారం యొక్క రెండింటి లక్షణాలు ఉ ంటాయి. ఈ సమాచారాన్ని యథాతథంగా కాకుండా, కొన్ని మార్పులు చేర్పుల అనంతరం అనుసంధాన దత్తకోశ నిధిలో నిల్వచేయలేము. మంచి స్థిరమైన నిర్మాణం (Well defined stcutre) లేకపోవడం వల్ల దీనిని ప్రోగ్రామ్స్ ద్వారా సులువుగా ఉపయోగించుకోలేము. అయితే ఈ సమాచారానికి ట్యాగ్స్ (Jags) మరియు ఎలిమెంట్స్ వంటి లక్షణాలు ఉండడం వల్ల దీనిని సులువుగా విశ్లేషించవచ్చు. ఈ సమాచారంలో అడ్డు మరియు నిలువు వరుసలు ఉండవు. ఉ దా॥ ఎక్స్ఎంఎల్ (XML) ఫైల్స్, జిప్ ఫైల్స్, వెబ్‌పేజెస్.

**బిగ్ డేటా లక్షణాలు :**

**పరిమాణం (Volume) :**

బిగ్‌డేటా పేరులోనే బిగ్ అన్నపదం ఉంది. అనగా దీని పరిమాణం పెద్దదిగా ఉంటుంది. డేటా యొక్క పరిమాణం, డేటా యొక్క విలువను నిర్ధారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఏదైనా ఒక సమాచారం బిగ్‌డేటానా, కాదా అన్నది దాని పరిమాణం (Volume)పైనే ఆధారపడి ఉంటుంది. కాబట్టి పరిమాణం అనేది బిగ్‌డేటా యొక్క ముఖ్యలక్షణంగా చెప్పవచ్చు.

**భిన్నత్వం (Variety) :**

బిగ్‌డేటా ఏకరూపాన్ని కలిగి ఉండదు. దీనిలో నిర్మాణాత్మకం (Stcture), నిర్మాణాత్మకం కాని (Unstcture), పాక్షిక నిర్మాణాత్మకం (Semi stcture) వంటి భిన్నత్వం ఉంటుంది. గతంలో స్ప్రెడ్‌షీట్స్ (Spread Sheets) మరియు డేటాబేస్ (Database)లు మాత్రమే సమాచారానికి వనరులు (Sources)గా ఉండేవి. కానీ ప్రస్తుతం ఇమెయిల్స్, ఫోటోస్, వీడియోలు, ఆడియోలు, పీడీఎఫ్ (PDF)లు వంటి భిన్నమైన లేదా వైవిధ్యమైన సాధనాల నుండి డేటా లభిస్తోంది. ఇలా విభిన్న వనరుల నుండి లభించే నిర్మాణాత్మకం కాని (Unstcture Data) సమాచారాన్ని నిల్వచేయడం (Store), కావలసిన సమాచారాన్ని వెతికి పొందడం (Mining) మరియు విశ్లేషణ (Analyse) చేయడంలో కొన్ని సమస్యలున్నాయి.

**వేగం (Velocity) :**

ఎంత వేగంగా విభిన్న వనరుల నుండి సమాచారం (Data) ఉత్పత్తి అవుతుంది అన్న విషయాన్ని ఇది తెలుపుతుంది. వాణిజ్య సంస్థలు, అప్లికేషన్ లాగ్స్ (Application logs), నెట్‌వర్క్స్, సామాజిక మాధ్యమ సంస్థలు, సెన్సర్స్ (Sensors), మొబైల్ సాధనాలు మొదలగు వాటినుండి బిగ్ డేటా అన్నది నిరంతరంగా మరియు అపరిమితంగా ఉత్పత్తి అవుతూనే ఉంది. ఇలా ఉత్పత్తి అయిన బిగ్‌డేటాను, విభిన్న వ్యక్తులు మరియు సంస్థల యొక్క అవసరాలకు అనుగుణంగా ఒక క్రమపద్ధతిలో వేరుచేసి (Process) అందిస్తారు.

**వైవిధ్యం (Variability) :**

సమాచారంలో నిరంతరాయంగా కలుగుతున్న మార్పులు లేదా వైవిధ్యాన్ని గురించి ఇది తెలుపుతుంది. అపరిపక్వ (Raw data) సమాచారాన్ని అర్థం చేసుకోవడం, అందులోని విభిన్న పదాలకు అర్థాన్ని విశదీకరించడంపై Variability ప్రధానంగా దృష్టికేంద్రీకరిస్తుంది (The ways in which the big data be used and formatted). డేటా అనేది నిరంతరాయంగా మారుతూ ఉంటే, అది డేటా యొక్క నాణ్యతపై ప్రభావాన్ని చూపిస్తుంది.

**ప్రామాణికత (Veracity) :**

ఇది డేటా యొక్క ప్రామాణికత్వం లేదా ఖచ్చితత్వాన్ని సూచిస్తుంది. బిగ్‌డేటా విషయాని కొస్తే డేటా యొక్క నాణ్యతే

కాకుండా, ఆ డేటా ఏరకానికి (Type) చెందినది ఎలా ప్రాసెస్ చేయబడింది, ఎక్కడి నుండి (Source) తీసుకోబడింది అన్న అంశాలు విశ్వసించదగినవిగా ఉండాలి.

ఇందుకోసం మన దగ్గరున్న బిగ్‌డేటాలో పక్షపాతం (bias), వైపరీత్యం (abnormality) లేదా అసమానత (inconsistency), నకిలీ (Duplication), అస్థిరత (Valatility) లాంటి లక్షణాలను నియంత్రించగలిగితే బిగ్‌డేటా యొక్క ప్రామాణికత మెరుగుపడుతుంది.

**విలువ (Value) :**

సాధారణంగా "ఎక్కువ పరిమాణంలో లభించిన సమాచారం లేదా బిగ్ డేటాకు" ఎలాంటి ప్రాముఖ్యత ఉండదు. అయితే అందులో ఉన్న సమాచారానికి కొన్ని మార్పులు, చేర్పులు చేసినట్లయితే దానికి ఒక నిర్దిష్టమైన రూపం వస్తుంది. అలాంటి నిర్దిష్టసమాచారాన్ని విభిన్న రకాల వ్యాపార సంస్థలు, వ్యక్తులు తమ అవసరాలకోసం ఉపయోగించుకుంటారు. తద్వారా ఆ సమాచారానికి "విలువ" పెరుగుతుంది.

**బిగ్‌డేటా – విశిష్టత :**

130 కోట్ల జనాభా ఉన్న భారత్ లాంటి దేశంలో బిగ్‌డేటా పరిశ్రమ ఎదుగుదలకు అపరిమితమైన అవకాశాలున్నాయి. ఇటీవల నాస్‌కామ్ (NASSCOM) నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఇండియాలో డేటా అనలిటిక్స్ ఇండస్ట్రీ 2025 నాటికి 16 బిలియన్ డాలర్ల మార్క్‌ను చేరుకుంటుందని అంచనా.




**బిగ్ డేటా అనువర్తనాలు :**

ప్రభుత్వ పాలనా రంగంలో బిగ్‌డేటా ఈ క్రింది విధంగా కీలకమైన పాత్రను పోషిస్తుంది.

**భద్రతా సంస్థలు మరియు పోలీస్‌శాఖ :**

భద్రతా సంస్థలు (Security Agencies) సైబర్ దాడులను నిరోధించడానికి, సెక్యూరిటీ విభాగాల పనితీరును మెరుగుపరచు కోవడానికి, కార్డ్ సంబంధిత మోసాలను పసిగట్టడానికి (Detect card Related fraud cases), పోలీస్ శాఖ నేరగాళ్ళ కార్యకలాపాలను అంచనావేయడానికి ప్రధానంగా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ నందు బిగ్‌డేటాను వినియోగిస్తారు.

**విద్యారంగం :**

విద్య యొక్క నాణ్యతను మెరుగుపరచడానికి బిగ్‌డేటాను వినియోగిస్తారు.

**విపత్తు నిర్వహణ :**

విపత్తులను అవగాహన చేసుకొని వాటికి సరైన నివారణ చర్యలు సూచించేందుకు బిగ్‌డేటా ఉపయోగపడుతుంది.

**ఆర్థికరంగం :**

ఈ రంగంలో బిగ్‌డేటా ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయి. ప్రధానంగా భీమారంగంలో వినియోగదారులకు మంచి నాణ్యతతో కూడిన సేవలు అందిస్తూ, జాప్యం లేకుండా వారి యొక్క ఫిర్యాదులు పరిష్కరించవచ్చు. బ్యాంకింగ్ రంగంలో ఆర్థికపరమైన లావాదేవీలను క్రమపద్ధతిలో నిర్వహించవచ్చు. ఆర్థిక సంస్థల యొక్క నష్టాలను తగ్గించి, వారికి అనుకోకుండా సంభవించే ఆపదలను (Risks) నివారించవచ్చు. పన్ను ఎగవేతదారులపై తగు నిఘా ఉంచడం ద్వారా పన్ను ఎగవేతను అరికట్టవచ్చు. ఉత్పత్తి మరియు ధరల గణాంకాల ఆధారంగా స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ)ని లెక్కించవచ్చు. తామర తంపరగా పుట్టుకొచ్చే షెల్ కంపెనీలను నిరోధించవచ్చు. మనీలాండరింగ్‌కు అడ్డుకట్ట వేయడం ద్వారా తీవ్రవాద సంస్థలకు నిధులు అందకుండా చర్యలు తీసుకోవచ్చు.

**వైద్య ఆరోగ్యరంగం :**

బిగ్‌డేటాను వైద్య ఆరోగ్యరంగంలో ఈ క్రింది విధంగా వినియోగించవచ్చు.

రాబోయే వ్యాధులను ముందస్తుగా అంచనా వేయవచ్చు. సంక్రమించిన రోగాలకు తగు చికిత్స మరియు మందులు సూచించవచ్చు. రోగియొక్క క్లినికల్ డేటా ఉపయోగించుకొని రోగియొక్క ఆరోగ్యం విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు. కఠినమైన వ్యాధినిర్ధారణా పరీక్షలు (Critical Diagnostic tests) మరియు నూతనంగా సంక్రమించే వ్యాధులకు తగు చికిత్స పద్ధతులు కనుగొనడానికి పరిశోధన మరియు అభివృద్ధి (R&D) సంస్థల్లో బిగ్‌డేటాను వినియోగిస్తారు.

**ఆహార మరియు వ్యవసాయ రంగం :**

ఆహార మరియు వ్యవసాయ రంగంలో మంచి నాణ్యత కలిగిన విత్తనాలను ఎంపిక చేయడానికి, వాతావరణంలో వచ్చే మార్పులను పసిగట్టడంలోనూ, నీటి పారుదల మరియు సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతుల వినియోగంలోనూ పంటల నాశించే వివిధ రకాల తెగుళ్ళను గుర్తించవచ్చు.

**స్మార్ట్ గవర్నమెంట్ :**

సత్వర నిర్ణయాలు తీసుకోవడం, ప్రజలకు కావలసిన సేవలు సకాలంలో అందజేయడం, ప్రభుత్వ విధానాలు ప్రజలు తెలుసుకొని, వాటిలో ప్రజలు భాగస్వామ్యం వహించేందుకు, జవాబుదారీతనంతో వ్యవహరించేందుకు ప్రభుత్వ పాలన ఎంతో పారదర్శకంగా ఉండాలి. ఈ నిర్ణయాలన్నీ ఈ–గవర్నెన్స్ ద్వారా సులువుగా అమలు చేయవచ్చు. ఇందుకు బిగ్‌డేటా ఎంతో తోడ్పడుతుంది. అదేవిధంగా ప్రజల్లో కూడా సృజనాత్మకత, సాధికారత, సమ్మిళితత్వం (inclusivity) భాగస్వామ్య భావనలు, బిగ్‌డేటా వల్ల అభివృద్ధి చెందుతాయి. ఈ గవర్నెన్స్, స్మార్ట్

గవర్నెన్స్ సాకారంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**డిజిటల్ ఇండియా :**

డిజిటల్ ఇండియాలో భాగమైన బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీ, ఈ–క్రాంతి పథకం ద్వారా ప్రజలకు ఎలక్ట్రానిక్ ఆధారిత సేవలు అందజేయడం, ఓపెన్ డేటా ప్లాట్‌ఫామ్‌ను ప్రోత్సహించడం, అదే విధంగా డిజిటల్ లాకర్, ఈ–సైన్, మైగవ్‌డాట్ ఇన్ (Mygov.in) లాంటి 9 విభాగాల ద్వారా సేవలదించడంలో 'బిగ్‌డేటా' కీలకపాత్ర పోషిస్తుంది.

**ఆధార్ :**

దేశంలోని కోట్లమంది ప్రజల గుర్తింపు పత్రంగా వినియోగించ బడుతున్న ఆధార్ కార్డ్ రూపకల్పన లోనూ, జన్‌ధన్– ఆధార్ – మొబైల్ (Jamtirinity) పథకాల అమలులోనూ 'బిగ్‌డేటా టెక్నాలజీదే' ప్రధాన పాత్ర అని చెప్పవచ్చు.

**బిగ్ డేటాను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు:**

బిగ్‌డేటాను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కూడా అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా "నీతి ఆయోగ్" దేశంలోని ప్రైవేటు సంస్థలతో కలిసి జాతీయ సమాచార మరియు విశ్లేషణ వేదిక (National data & Analytics platform) ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది. ఇది పౌరులు, విధానకర్తలు మరియు పరిశోధకులకు కావలసిన సమాచారాన్ని అందించే ఏకైక వనరుగా వ్యవహరించనుంది.




భారత్ ఆడిట్ మరియు అకౌంట్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో ఉత్పత్తి అయ్యే డేటానంతా సమగ్రపరిచి, విశ్లేషించేందుకు అనువుగా భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్), సమాచార నిర్వహణ మరియు విశ్లేషణా కేంద్రం (Center for data management and Analytics)ను ఏర్పాటు చేసింది.

భారత గణాంక మరియు పథక అమలు మంత్రిత్వశాఖ (Ministry of Statistics and programm implimentation) 'నేషనల్ డేటా వేర్ హౌస్ అండ్ అఫిషియల్ స్టాటిస్టిక్స్' అన్న సంస్థను స్థాపించాలన్న యోచనలో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం మరియు బిగ్‌డేటా, విశ్లేషణా సాధనాలను వినియోగించి స్థూల అర్థశాస్త్ర గణాంకాలను ఈ సంస్థ ద్వారా మెరుగుపరచాలని గణాంక మంత్రిత్వశాఖ ప్రయత్నిస్తోంది.

భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా నున్న వ్యవసాయ శాఖ ఆస్తులను మ్యాపింగ్ చేయడానికి ఇస్రోతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

స్మార్ట్‌ఇండియా, డిజిటల్ ఇండియా, డిజిటల్ ఎకానమీ (ఉదా॥ భీమ్ యాప్ (App) మొ॥నవి. దేశంలో బిగ్‌డేటాను వినియోగించి సుపరిపాలన (good governance) అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కొన్ని ప్రత్యేక చర్యలని చెప్పవచ్చు.

**బిగ్‌డేటా వినియోగంలో ఎదురయ్యే సవాళ్ళు :**

**సాంకేతిక సమస్యలు :**

అత్యధిక జనాభా కలిగిన భారత్ లాంటి దేశంలో ప్రజల నుండి సేకరించిన డేటాను నిలవచేసేందుకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొన్న వ్యవహారం. కంప్యూటర్ స్టోరేజ్ యూనిట్లు మరియు సర్వర్లు పెద్ద మొత్తంతో డేటాను నిల్వచేయడం వల్ల ఒత్తిడి అధికమై అవి సక్రమ పనితీరును కనబరచక మొరాయించే అవకాశం ఉంది.

**డేటా భద్రత :**

ఆధార్ పత్రాలను జారీచేయడం కోసం ప్రభుత్వం మరియు వివిధ రకాల అవసరాల నిమిత్తం బ్యాంకులు, మొబైల్ నెట్‌వర్క్ నిర్వహణా సంస్థలు, మరియు సామాజిక మాధ్యమ సంస్థలు దేశంలోని పౌరుల నుండి సేకరించిన డేటా బయటకు విడుదలయ్యి దుర్వినియోగం కాకుండా, సురక్షితంగా భద్రపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని సామాజిక మాధ్యమ సంస్థలు తమ వినియోగ దారుల డేటాను అక్రమంగా కొన్ని వ్యాపార సంస్థలకు అందజేశారన్న అపవాదు వినిపిస్తున్న నేపథ్యంలో యూరోపియన్, అమెరికాల తరహాలో మనదేశంలో కూడా డేటాను భద్రపరిచేందుకు అవసరమైన చట్టాలు రూపొందించి, నియమనిబంధనలను కఠినతరం చేయాలి.

**చివరిగా :**

బిగ్‌డేటా వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల వచ్చే దుష్పరిణామాలు అంతకంటే ఎక్కువ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమాచార గోప్యత (Data Privacy)ను పరిరక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. అందులో భాగంగా సమాచార భద్రతా చట్టాల (Data Protection Laws)ను మరియు సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలి. సమాచార చౌర్యాన్ని నిరోధించేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ లాంటి సాంకేతికతలను వినియోగించాలి. అప్పుడే ప్రజలకు పూర్తిస్థాయిలో బిగ్‌డేటాద్వారా మంచి నాణ్యత కలిగిన సేవలను అందించవచ్చు నడంలో ఎలాంటి సందేహం లేదు.

–పుట్టా పెద్ద ఓబులేసు,
m : 9550290047
e : obu.jmd@gmail.com



# మన రామప్పకు విశ్వమంతా గుర్తింపు

## ప్రపంచ వారసత్వ కట్టడంగా ఎంపిక

### కాకతీయుల కళావైభవానికి యునెస్కో గుర్తింపు

రాళ్లలో పూలు పూయించిన అలనాటి శిల్పి అపురూప కళాఖండమైన రామప్ప అస్తిత్వం నేడు అంతర్జాతీయంగా వైభవోపేతమైంది. భారతీయ శిల్ప కళాచరిత్రలో అతి విలక్షణమైన స్థానాన్ని చాటిన శైలి కాకతీయ శిల్పానిది. ఈ శైలిలో కూడా మరింత విశిష్టమైనది రామప్ప. రామప్ప గుడిగోడల రమణీయ మంజరులని మహాకవులు కీర్తించిన మదనికలు.. లలిత కళాభిమానులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ శిల్ప సౌందర్యం ఒకరికి కవిత్వానుభూతి కలిగిస్తే.. మరొకరి హృదయంలో పాటై అలరించింది. జాయపసేనాని చేత నూతన నాట్యభంగిమలనే ఆవిర్భవింపజేసింది. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపుపొందిన రామప్ప రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఈ ఖ్యాతి గొన్న తొలి నిర్మాణం.

ఇసుక పునాదులు! తేలే ఇటుకలు! రాయిని మీటితే రాగాలు! నల్ల రాతిపై సొగసైన మదనికలు! సూది బెజ్జం సందుతో అతి సూక్ష్మ శిల్పాలు! విభిన్న రూపాల్లో వందలాది ఏనుగుల బొమ్మలు! అదరహో



అనిపించే శిల్ప కళా వైభవం.. ఇప్పటికీ అబ్బుర పరిచే అప్పటి ఇంజనీరింగ్ టెక్నాలజీ విశ్వవిఖ్యాతమైంది! అంతర్జాతీయ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు లభించింది! గత కొన్ని ఏండ్లపాటు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం సలిపిన అవిరళ కృషికి దక్కిన ఫలితం ఇది.

కాకతీయుల ఘనమైన శిల్పకళా వైభవానికి, అద్భుత నిర్మాణశైలికి ప్రతీక, 800 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సుప్రసిద్ధ రామప్ప ఆలయం వైపు ఇప్పుడు విశ్వమంతా అబ్బురపడి చూస్తోంది. తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేటలోని రామప్ప ఆలయానికి అరుదైన గౌరవం లభించింది. రామప్పకు ప్రపంచ వారసత్వ సంపదగా ఐక్యరాజ్యసమితి విద్యా, విజ్ఞాన సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు లభించింది. చైనాలోని ఫ్యూజు వేదికగా యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ (యూడబ్ల్యూహెచ్‌సీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఆదివారం (25.7.2021) సాయంత్రం 4:36 గంటలకు డబ్ల్యూహెచ్‌సీ ప్రతినిధులు రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలోకి చేర్చారు. రామప్పకు మద్దతుగా రష్యా సహా 17 దేశాలు ఓటు వేశాయి. రామప్పకు అరుదైన గుర్తింపు లభించడం పట్ల తెలంగాణ సహా దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.



**ఇవీ ప్రమాణాలు..**

సాంస్కృతిక సంపదను పరిరక్షిస్తూ ఆ వారసత్వాన్ని వచ్చే తరాలకు అందించడమే యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల ఎంపిక వెనుక ముఖ్య ఉద్దేశం. అయితే ఓ నిర్మాణం, ప్రపంచ వారసత్వ కట్టడంగా ఎంపిక జరగాలంటే కొన్ని ప్రమాణాలున్నాయి. ఆ మేరకే యూడబ్ల్యూహెచ్‌సీ ఎంపిక చేస్తుంది. సదరు కట్టడం.. మానవ నిర్మాణ శైలిలో తనదైన ప్రత్యేకతను కలిగివుండాలి. ఓ తరం సంస్కృతికి సంబంధించి గానీ, ప్రత్యేకంగా ఓ కాలానికి సంబంధించి గానీ మానవ విలువల్లో వచ్చిన మార్పును ప్రతిబింబించేదిగా ఉండాలి. నాటి కళలకు సంబంధించిన భావనలు ప్రాముఖ్యతను కలిగి ఉండాలి. కట్టడం జీవితకాలానికి సంబంధించి ధరిత్రి చరిత్రకు ఉదాహరణగా ఉండాలి.

**ఎంపిక విధానం..**

ఇప్పటికే పలుమార్లు యునెస్కోకు నామినేట్ అయిన రామప్పకు ఈసారి 'గుర్తింపు' అంత తేలిగ్గా ఏమీ లభించలేదు. రామప్ప ఎంపిక పరంగా సమావేశంలో తీవ్ర నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచ వారసత్వ జాబితాలోకి రామప్పను చేర్చడాన్ని నార్వే వ్యతిరేకించింది. రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించేందుకు తొమ్మిది అంశాలను 2019లో పాలంపేటను సందర్శించిన పురావస్తు కట్టడాలు, క్షేత్రాల అంతర్జాతీయ మండలి (ICOMOS) ప్రతినిధులు తమ నివేదికలో ప్రస్తావించారు. తదుపరి సాంకేతిక నిపుణులతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ అంశాలతో కమిటీకి ఆన్‌లైన్ ద్వారా, ప్రత్యక్షంగా వెళ్ళి పైన పేర్కొన్న విషయాలను వివరాలను చాలా దేశాల ప్రతినిధులకు ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అందజేశారు. అయితే తక్షణమే రామప్పను వారసత్వ కట్టడంగా గుర్తించేలా రష్యా ప్రత్యేక చొరవ తీసుకుంది. 2019 నాటి ICOMOS నివేదికను 22.7 నిబంధన కింద రామప్పను కట్టడాల నామినేషన్లలో పరిగణనలోకి తీసుకునేలా చేసింది. అటు భారత్ కూడా దౌత్య పద్ధతిలో రాయబారం నెరిపింది. చారిత్రక కట్టడాలను ఎంపిక చేసేందుకు విచ్చేసిన 24 దేశాల ప్రతినిధులకు చారిత్రక కట్టడంగా రామప్ప విశిష్టత గురించి



వివరించింది. ఇది ఫలితాన్నిచ్చింది.

రామప్పకు మద్దతుగా 24 దేశాల్లో రష్యా సహా ఇథియోపియా, ఒమన్, బ్రెజిల్, ఈజిప్ట్, స్పెయిన్, థాయ్‌లాండ్, హంగరీ, సౌదీ అరేబియా, సౌత్ ఆఫ్రికా తదితర 17 దేశాలు ఓట్లు వేశాయి. 2019లో భారత్ నుంచి యునెస్కోకు రామప్ప ఆలయం ఒక్కటే నామినేట్ అయింది. రామప్పకు మనదేశం నుంచి ఇతర కట్టడాలేవీ పోటీలో లేకపోవడమూ కలిసొచ్చింది. రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం కొన్నేళ్లుగా ప్రయత్నాలు సాగాయి. రామప్ప తొలిసారిగా 2012లో యునెస్కోకు నామినేట్ అయింది. తర్వాత 2013, 14, 19లో నామినేట్ అయింది. 2019 వారసత్వ కట్టడాల ఎంపిక కోసం 2020లో జరగాల్సిన యునెస్కో ప్రతినిధుల సమావేశం కరోనా కారణంగా ఈ ఏడాదికి వాయిదా పడింది.

### భారీ కసరత్తు తర్వాతే...

ఏదైనా పురాతన కట్టడానికి ఐక్యరాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ(యునెస్కో) ప్రపంచ వారసత్వ గుర్తింపు రావాలంటే.. దాని వెనక భారీ కసరత్తే ఉంటుంది. ఎన్నెన్నో అంకాలను దాటి వెళ్లాక గానీ, ఓ కట్టడానికి యునెస్కో గుర్తింపు రాదు. యునెస్కో ప్రపంచ వారసత్వ కన్వెన్షన్‌లో భాగస్వామ్యమైన దేశాలకు మాత్రమే.. కట్టడాల జాబితాతో కూడిన నామినేషన్లు పంపే వీలుంటుంది. యునెస్కో ఈ విధానాన్ని 1972లో ప్రారంభించగా.. భారత్ ఆ కన్వెన్షన్‌లో 1977 నవంబరు 14న చేరింది. ప్రస్తుతం 194 దేశాలు ఈ కన్వెన్షన్‌లో ఉన్నాయి.

ప్రభుత్వాలు తమ దేశంలోని వారసత్వ కట్టడాల జాబితాను.. మ్యాపులు, ఇతర వివరాలతో కలిపి తొలుత యునెస్కోకు పంపాల్సి ఉంటుంది. దీనికీ పలు క్రైటీరియాలు ఉన్నాయి. ఒకసారి జాబితాను పంపాక.. సంబంధిత కట్టడానికి సంబంధించిన మరిన్ని వివరాలను చేర్చవచ్చు. ప్రపంచ వారసత్వ కేంద్రం దాన్ని పరిశీలించి, ఏమైనా మార్పులు చేయాల్సి ఉన్నా.. అదనపు సమాచారాన్ని జోడించాల్సి ఉన్నా.. సలహాలు, సూచనలు చేస్తుంది. ఆ కేంద్రం అధికారులు నామినేషన్‌పై సంతృప్తి చెందితే.. దాన్ని సలహా మండలికి పంపుతారు. ప్రపంచ వారసత్వ మండలిలో మూడు అడ్వయిజరీ బోర్డులు ఉంటాయి. అవి.. అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాలపై సలహా మండలి, అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ మండలి, అంతర్జాతీయ సాంస్కృతిక ఆస్తుల పరిరక్షణ, పునరుజ్జీవ కేంద్రం. ఈ మూడు మండళ్లు స్వతంత్రంగా పనిచేస్తాయి. ఇవి నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. వీలును బట్టి క్షేత్రస్థాయి లో పర్యటిస్తాయి. ఆ తర్వాత త మ నివేదికలను ప్రపంచ వారసత్వ కమిటీకి అందజేస్తాయి.

### రాష్ట్ర ప్రభుత్వ కృషికి ఫలితం

రామప్ప ఆలయానికి వారసత్వ గుర్తింపు సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2015 నుంచి ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వ కృషి ఫలితంగా 2019 సెప్టెంబర్‌లో యునెస్కో తరఫున ఐకోమాస్ ప్రతినిధి వాసుపోశానందన్ ఆలయాన్ని పరిశీలించి వెళ్లారు. ఆయన సూచనలతో 2020 సంవత్సరానికి ప్రపంచ వారసత్వ జాబితాలో చేరేందుకు భారత్ తరఫున రామప్ప దేవాలయం నామినేట్ అయ్యింది. గత నెలలో రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసింది. రామప్పకు వారసత్వ హోదా కల్పించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని నేతలు కోరారు. కట్టడం విశిష్టతలను తెలుపుతూ రాష్ట్రప్రభుత్వం వీడియోలు, పుస్తకాలను రూపొందించింది. ఐకోమాస్ సూచన మేరకు రామప్ప సమీపంలోని రెండు ఆలయాలను ప్రధాన ఆలయ పరిధిలోకి తెచ్చారు. రాష్ట్రస్థాయిలో వివిధ శాఖలతో సమన్వయానికి కమిటీ వేశారు.

### గుర్తింపుతో ప్రయోజనాలు ఇవీ

రామప్పకు ప్రపంచ వారసత్వ హోదాతో కాకతీయుల శిల్పకళా వైభవం ఖండాతరాలకు వ్యాపించనున్నది. భూగోళం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉన్నది. కల్చరల్ ఎక్స్ఛేంజ్ (సాంస్కృతిక మార్పిడి) జరుగుతుంది.

**రామప్పకు వెళ్లండి : ట్విటర్‌లో మోదీ**

'అద్భుతం! రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు లభించినందుకు అందరికీ.. ప్రత్యేకంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ఘనకీర్తి గల కాకతీయుల అద్భుత నిర్మాణ కౌశలానికి రామప్ప ఆలయం గొప్ప ప్రతీక. ప్రజలారా.. ఈ అద్భుత ఆలయానికి వెళ్లండి. ఆలయ ఠీవిని ప్రత్యక్షంగా తిలకించి ఆ అనుభూతిని సొంతం చేసుకోండి' .

**రాష్ట్ర వారసత్వానికి గుర్తింపు : వెంకయ్యనాయుడు, ఉపరాష్ట్రపతి**

13వ శతాబ్దానికి చెందిన కాకతీయ రుద్రేశ్వర(రామప్ప) ఆలయానికి యునెస్కో గుర్తింపు రావటం ఆనందంగా ఉన్నది. ఇది తెలంగాణ వారసత్వానికి దక్కిన గుర్తింపు. తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు.

**దేశంలోనే ప్రత్యేకం! : కేసీఆర్ – తెలంగాణ సీఎం**

రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తించడానికి మద్దతునిచ్చిన యునెస్కో సభ్య దేశాలకు, సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అత్యంత సృజనాత్మకత, శిల్పకళా నైపుణ్యంతో తెలంగాణలో కాకతీయులు సృష్టించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపద రామప్ప ఆలయం. ఇది దేశంలోనే ప్రత్యేకమైనది. స్వయం పాలనలో తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతికి పూర్వ వైభవం తేవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

**ఎంతో ఆనందంగా ఉంది : కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి**

రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు ఇవ్వడం ఎంతో ఆనందం కలిగించింది. దీనికి మార్గదర్శనం, మద్దతు ఇచ్చిన ప్రధాని మోదీకి దేశం తరఫున, ముఖ్యంగా తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నా. యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో విదేశాంగ శాఖ, భారత పురావస్తు శాఖ చేసిన కృషిని అభినందిస్తున్నా.

**తదుపరి లక్ష్యం హైదరాబాద్‌కు గుర్తింపే : కేటీఆర్**
**– మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి**

800 ఏండ్ల చరిత్ర కలిగిన రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందింది. ఈ శుభవార్త చెప్పున్నందుకు సంతోషంగా ఉన్నది. తెలంగాణ నుంచి యునెస్కో గుర్తింపు పొందిన తొలి ప్రదేశం రామప్ప. ఇందుకోసం ప్రయత్నించిన అందరికీ ధన్యవాదాలు. హైదరాబాద్ ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తింపు తీసుకురావటం తదుపరి లక్ష్యం.

**వారసత్వ సంపదను కాపాడుతున్న కేసీఆర్ : శ్రీనివాస్‌గౌడ్**
**– తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి**

తెలంగాణ వారసత్వ, చారిత్రక, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ వాటికి పూర్వవైభవం తీసుకొస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. అద్భుత శిల్పకళాఖండమైన రామప్పకు యునెస్కో గుర్తింపు రావటం సంతోషం. ఇందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు. పర్యాటకంగా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందటానికి రామప్పకు గుర్తింపు రావటం ఎంతగానో ఉపయోగపడుతుంది.

**మా కృషి ఫలించింది : – బి.వి.పాపారావు,**
**కాకతీయ హెరిటేజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు**

రామప్పకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు రావటంతో ఆనందంగా ఉంది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషిలో మా ట్రస్టు కీలకపాత్ర పోషించింది. పర్యాటకపరంగా రామప్ప ప్రాంత రూపురేఖలు మారతాయి.

ఆలయ పరిరక్షణకు యునెస్కో ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుంది. వరల్డ్ హెరిటేజ్ ఫండ్-1977 కింద ఆలయ అభివృద్ధికి నిధులు అందుతాయి. భూకంపాలు, వరదలు వచ్చినప్పుడు కట్టడానికి ప్రమాదం వాటిల్లితే పునరుద్ధరించేందుకు ర్యాపిడ్ రెస్పాండ్ ఫండింగ్ కూడా లభిస్తుంది. కట్టడం రక్షణకు యునెస్కో సాంకేతిక సహకారం, శిక్షణ ఇస్తుంది.

రామప్ప ఆలయంపై ఐకోమాస్ లేవనెత్తిన 9 లోపాలపై 2022లో మరో నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించాల్సి ఉంటుంది. ఆలయ సరిహద్దుల విస్తరణ, కామేశ్వరాలయం, రామప్ప చెరువు తదితర ప్రాంతాలపై మరింత స్పష్టత రానున్నది. ఐకోమాస్ సూచనల మేరకు రామప్ప ఆలయ పరిధిని మరింత పెంచే వీలున్నది.

**కల సాకరమైన వేళ...**

యునెస్కో అధికారులు చారిత్రక రామప్ప ఆలయాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశం (డబ్ల్యూ హెచ్‌ఎస్) స్థితిగతుల ప్రకారం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేశారు. చారిత్రాత్మక 'రామప్ప' ఆలయం ప్రపంచ వారసత్వ ప్రదేశ హోదాను పొందింది. ఇది తెలంగాణ ప్రజల కల నెరవేర్చిన క్షణం అవుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి ప్రపంచ వారసత్వ ప్రదేశ హోదా పొందిన మొదటి ప్రదేశం రామప్ప ఆలయం.

ప్రపంచ వారసత్వ ప్రదేశం (డబ్ల్యూహెచ్ఎస్) హోదా వల్ల రాష్ట్రానికి చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఈ స్థితి తెలంగాణలో పర్యాటకాన్ని గణనీయంగా పెంచుతుంది. ఇది స్థానికుల జీవనోపాధిలో నిరంతర అభివృద్ధికి దారితీస్తుంది. ముఖ్యంగా పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆర్థికేతర ప్రయోజనాలు చరిత్ర, సంస్కృతిని పరిరక్షించడం, సృజనాత్మకతను పెంపొందించడం. సంక్షిప్తంగా స్థానిక ఆర్థికవ్యవస్థను పెంచుతుంది. స్థానిక, ప్రపంచ పర్యాటక రంగానికి దోహదపడుతుంది. ఇది ఉపాధి, ఆదాయ ఉత్పత్తికి దారితీస్తుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరువాత ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఈ వారసత్వ సంపదపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల ప్రపంచపటంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి ఫలించి తెలంగాణ ప్రజల కల నిజమైంది.

*(మరింత సోర్స్ : ఇంటర్నెట్)*

**–సువేగా,** m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



• దళితులకు ధనభాగ్యం • ఎస్సీ సోదరుల కోసం సాధికారత పథకం

# తెలంగాణ దళిత బంధు

## దళిత సాధికారత పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నామకరణం

• పైలట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్ నియోజకవర్గం అంతా అమలు

• ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం ఒక యూనిట్ • రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అమలు

దళిత ప్రగతిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారుతున్నది. సీఎం కేసీఆర్ సారథ్యంలో సప్త వసంతాల స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలు సిరిసంపదలతో సగర్వంగా తలెత్తుకు జీవిస్తున్నాయి. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అనేక రంగాల్లో అద్భుత పురోగతి సాధించిన మన తెలంగాణ, నేడు దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్ ప్రకటించిన 'దళిత సాధికారత' దళిత

> భారత సమాజంలో వ్యక్తుల వ్యక్తిత్వ పటిమ గొప్పది. అయితే.. అనేక వివక్షల మూలంగా సామూహిక ఐక్యత లోపించి సామాజిక అభివృద్ధి ఆశించినంతగా జరుగట్లేదు. ఇది విచారకరం. అందు కోసమే తెలంగాణ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తెచ్చింది. అవసరమైన మేరకు నిధులను అందుబాటులో ఉంచుతుంది.
>
> –ముఖ్యమంత్రి కేసీఆర్

సమాజంలో గుణాత్మక మార్పులకు కారణం కానున్నది.

స్వాతంత్ర్యానంతరం ఇప్పటి దాకా అనేకమంది నాయకులు, ప్రభుత్వాలు దళితోద్ధారణ కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహించినా అనుకున్నంత ఫలితం రాలేదన్నది వాస్తవం. దళిత కుటుంబాలు నిజమైన ఆర్థిక పురోగతి సాధించకపోవడమే దీనికి సాక్ష్యం. రాష్ట్ర సాధనకోసం పుష్కర కాలం పాటు ఉద్యమం చేసిన కేసీఆర్ ప్రజల సాధకబాధకాలను

ప్రత్యక్షంగా చూశారు. దళితుల కష్టాలు, కన్నీళ్ల వెనకున్న కారణాలను విశ్లేషించారు. సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలను కనుగొన్నారు. దళితుల బతుకులు మార్చేందుకు కేసీఆర్ కంకణం కట్టుకున్నారు.

'దళిత్ ఎంపవర్మెంట్' పథకం కింద మొదటి దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వంద కుటుంబాల చొప్పున 119 నియోజకవర్గాల్లోని 11,900 కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. దీంతో దళితుల ఆర్థిక స్థితి గతులు సమూలంగా మారనున్నాయి. పరిశ్రమలు నెలకొల్పేందుకు, వ్యాపారాలు ప్రారంభించేందుకు, దళితులు ఉన్నత ప్రమాణాలతో జీవనం సాగించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.



ఇదొక్కటే కాదు ఎస్సీల ఆర్థిక, సామాజిక ప్రయోజనాల కోసం గత ఏడేండ్ల నుంచి టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ విధానం ప్రవేశ పెట్టింది టీఆర్ఎస్ ప్రభుత్వం. దీంతో రాష్ట్రంలో అనేక మంది ఎస్సీ రైతులకు మార్కెట్ కమిటీ చైర్మన్లుగా అవకాశం లభించింది. రాష్ట్రంలోని వివిధ వర్గాలకు ఇస్తున్న ఆసరా పెన్షన్లతో 4,66,167 మంది ఎస్సీలు లబ్ధిపొందుతున్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీడీ కార్మికులకు ఇస్తున్న భృతితో 27,034 మంది ఎస్సీలకు మేలుజరుగుతున్నది. రాష్ట్రంలో రైతులకు రుణమాఫీతో 6,01,024 మంది ఎస్సీలు, విద్యార్థులకు ఇస్తున్న ఫీజు రీయింబర్స్ మెంట్ తో 2.5 లక్షల మంది ఎస్సీ విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. చిన్నపాటి వ్యాపారం చేసుకొనే ఎస్సీలకు పూర్తి సబ్సిడీతో రుణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీలకు 80శాతం సబ్సిడీతో రూ. లక్ష వరకు, 70శాతం సబ్సిడీతో రూ. 2 లక్షలు, 60శాతం సబ్సిడీతో రూ.10 లక్షల వరకు రుణాలిస్తారు. సబ్సిడీ పోగా మిగతాది లబ్ధిదారులు బ్యాంకు ద్వారా పొందాలి. ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకం కింద 1,36,043 మంది లబ్ధిదారులకు సబ్సిడీ రూ.1,57,222 లక్షలు అందజేసింది. ఇలా అనేక రకాల పథకాలతో, సీఎం కేసీఆర్ దళితుల స్థితి గతులను మార్చడానికి కృషి చేస్తున్నారు. దళిత పక్షపాతిగా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్ కృషి కారణంగా, తెలంగాణ దళిత సమాజం దేశంలోనే ధనిక సమాజంగా మారే రోజులు ఎంతో దూరంలో లేవు.

### అఖిలపక్ష సమావేశం

దళిత సాధికారతపై ముఖ్యమంత్రి కెసిఆర్ ఒక అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో అన్ని రాజకీయ పక్షనేతలు పాల్గొన్నారు. 'దళిత బంధు' పథకాన్ని ప్రతిపాదించారు. దళితబంధువల్ల దళితుల జీవితాల్లో వచ్చే మార్పులను, ఆ పథకం అమలు తీరుపై కెసిఆర్ మాట్లాడుతూ..

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి అన్ని రాజకీయ పార్టీలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. రైతు బంధు పథకం, ఆసరా పెన్షన్ల మాదిరి దళితులకు కూడా నేరుగా ఆర్థిక సాయం అందించాలనుకుంటున్నామన్నారు. అందువల్లే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఈ నేపథ్యంలో రాజకీయాలను పక్కన పెట్టి ప్రతిపక్ష నేతలు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. దళితులకు సామాజిక, ఆర్థిక బాధలు తొలగిపోవాలంటే, ఏం చేయాలో, దశలవారీగా కార్యాచరణ అమలు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజాకవి గోరేటి వెంకన్న పాడిన గల్లీ చిన్నది అనే పాటను మనసు పెట్టి వింటే దళితుల సమస్యకు పరిష్కారాలు దొరుకుతాయన్నారు. గ్రామీణ, పట్టణ దళితుల సమస్యలను విడి విడిగా గుర్తించి పరిష్కారాలు వెతకాలని పేర్కొన్నారు. దళితుల సామాజిక ఆర్థిక సమస్యలను గుర్తించి సమిష్టి కృషితో సమాధానాలు సాధించాలన్నారు. 'మేము కూడా పురోగమించగలం' అనే ఆత్మస్థైర్యంతో దళిత సమాజం ముందుకు పోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయాలో ఆ సూచనలన్నీ చేయాల్సిందిగా సిఎం కెసిఆర్ అన్నారు. దళిత సాధికారతకు పైరవీలకు ఆస్కారం లేని, పారదర్శక విధానాన్ని అమలు పరుద్దామన్నారు.

నిధుల బాధ్యత తనదన్నారు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా సమిష్టి కార్యాచరణ చేపట్టే బాధ్యత మనందరం తీసుకుందామని ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. దళితుల్లో అర్హులైన కుటుంబాల గణన జరపాలన్నారు. ఇందుకోసం అట్టడుగున ఉన్న వారినుంచి సహాయం ప్రారంభించి, వారి అభ్యున్నతిని సాంకేతిక విధానం ద్వారా నిత్యం పర్యవేక్షించాలన్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదన్నారు. భూమి ఉత్పత్తి సాధనంగా ఇన్నాళ్లూ జీవనోపాధి సాగిందని, మారిన పరిస్థితుల్లో పారిశ్రామిక, సాంకేతిక తదితర రంగాల్లో దళిత యువత స్వయం ఉపాధి అన్వేషించాలన్నారు. వ్యవసాయం,



సాగునీటి రంగాలను చక్కదిద్ది ఇరిగేషన్ రంగాన్ని పట్టుబట్టి గాడిలో పెట్టినట్లు దళితుల సాధికారత కోసం కూడా ప్రభుత్వం అంతే పట్టుదలతో పనిచేయాలని నిర్ణయించిందన్నారు. వ్యాపార నిర్వహణ కోసం, తదితర స్వయం ఉపాధి రంగాల ఏర్పాటు కోసం ప్రభుత్వం మంజూరు చేసే లైసెన్స్‌లు, అందించే పెట్టుబడులు, అంశాల్లో అర్హులైన దళిత యువతకు రిజర్వేషన్ల కోటా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

### వ్యవసాయ భూమిని గణన చేయాలి

దళిత సమాజం వద్దనున్న వ్యవసాయ భూమిని గణన చేయాలని సిఎం కెసిఆర్ అన్నారు. లెక్కలను స్థిరీకరించి ఒక సమగ్ర నివేదికను అందజేయాలని సంబంధిత– అధికారులకు ఆదేశించారు. అవసరమైతే పది పదిహేను రోజులు దళితుల భూముల గణన మీదనే ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని సూచించారు. దళితుల అభివృద్ధి కోసం సామాజికంగా, ఆర్థికంగా చేపట్టాల్సిన కార్యాచరణను దేనికదిగా సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రాజెక్టులు తదితర ప్రజావసరాల కోసం భూసేకరణలో భాగంగా సేకరించాల్సి వచ్చిన అసైన్డ్ భూములకు కూడా, పట్టాభూములకు చెల్లించిన ఖరీదునే ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. ఎటువంటి బ్యాంక్ గ్యారెంటీ జంజాటం లేకుండానే ఈ పథకం ద్వారా దళితులకు సహకారం అందిస్తామన్నారు.

### చైతన్యం పెంచాలి

దళిత సాధికారత కోసం, దళిత సమాజాన్ని ఆ దిశగా అవకాశాలను అందుకునే పద్ధతిలో చైతన్యం చేయాలని సిఎం సూచించారు. ఆ దిశగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాటలు, కళా రూపాల ప్రదర్శన, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా పెద్దఎత్తున చైతన్య కార్యక్రమాలను రూపొందించాలన్నారు. అవసరమైతే గోరేటి వెంకన్న వంటి కవులను, సాంస్కృతిక సారథి తదితర కళాకారుల సేవలను వినియోగించుకోవాలన్నారు. అలాగే దళిత యువత ఆలోచనా దృక్పథంలో గుణాత్మక మార్పుకు, ఆత్మన్యూనత నుంచి ఆత్మ స్థైర్యం పెరిగి, ఉన్నత స్థాయి ఓరియంటేషన్ అలవర్చుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దళిత విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న, ఓవర్ సీస్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ పొందేందుకు.. ప్రస్తుతం అమల్లో ఉన్న ఇన్‌కమ్ సీలింగ్‌లో సడలింపు అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. అద్దాల అంగడి మాయా లోకపు పోటీ ప్రపంచంలో, ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవడానికి, దళిత బిడ్డలు తమ నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంచుకునేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందన్నారు.

### సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా..

'తెలంగాణ దళితబంధు పథకాన్ని క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేయాల్సి ఉన్నది. మూస పద్ధతిలో కాకుండా ప్రభుత్వ ఆలోచనలను అందుకుని పనిచేసే అధికార, ప్రభుత్వ యంత్రాంగం ఎంపిక జరగాలి. వారు దళితబంధు పథకాన్ని మనసుపెట్టి అమలుచేయాలి. పూర్తిస్థాయి గణాంకాలు, సరైన సమాచారం లేకుండా ఏ ప్రభుత్వ పథకమైనా పరిపూర్ణంగా అమలుకాదు. ప్రభుత్వం ఇప్పటికే నిర్వహించిన సమగ్ర కుటుంబసర్వేను ఆధారం చేసుకుని, దళితబంధు పథకం అమలులో ముందుకుసాగాలి' అని సీఎం అధికారులకు సూచించారు. 'మనం తిండి తింటున్నప్పుడు ఎంతైతే లీనమై భోజనం ఆరగిస్తామో, మనకు ఇష్టమైన పనిచేస్తున్నప్పుడు ఎంతైతే దీక్ష కనబరుస్తామో.. దళితబంధు పథకం అమలులో అధికారులు అంతే తన్మయత్వంతో పనిచేయాలి' అని స్పష్టంచేశారు. 'తమ అభివృద్ధి గురించి, గత పాలకులు అవలంబించిన విధానాల ద్వారా దళితుల్లో ఎటువంటి పురోగతి కానరాలేదనే అపనమ్మకం ఏర్పడింది. వారిలో గూడుకట్టుకున్న అవిశ్వాసం తొలిగిపోవాలి. ప్రభుత్వాలు తమ అభివృద్ధి గురించి ఆలోచిస్తున్నాయి అనే విశ్వాసాన్ని, బలమైన నమ్మకాన్ని దళితుల్లో కలిగించాల్సిన అవసరం మనమీదున్నది. సరైన గైడెన్స్ఇస్తూ దళితబంధు పథకం అమలును పర్యవేక్షించాల్సి ఉంటుంది' అని తెలిపారు. దళితబంధు పథకం అమల్లో అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తే.. ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని పేర్కొన్నారు.

### దళిత కుటుంబాల ప్రొఫైల్

దళిత కుటుంబాల ప్రొఫైల్‌ను రూపొందించాలని, వారి జీవన స్థితిగతులను పొందుపరిచాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. దళిత సమస్యలు అన్నిచోట్లా ఒకే రీతిలో ఉండవని.. గ్రామీణ, సెమీఅర్బన్, పూర్తిఅర్బన్ అనే విభాగాలుగా వారి సమస్యలను




విభజించాలని తెలిపారు. అందుకనుగుణంగా దళితబంధు పథకం ద్వారా అభివృద్ధి కార్యాచరణను అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'భారత సమాజంలో వ్యక్తుల వ్యక్తిత్వ పటిమ గొప్పది. అయితే.. అనేక వివక్షతల మూలంగా సామూహిక ఐక్యత ఆశించినంతగా లేకపోవడంతో సామాజిక అభివృద్ధి జరుగట్లేదు. ఇది విచారకరం. అందుకోసమే తెలంగాణ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తెచ్చింది. అవసరమైన మేరకు నిధులను అందుబాటులో ఉంచుతుంది' అని సీఎం పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వవిప్ బాల సుమన్, ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగ్‌రావు, సెక్రటరీలు స్మితా సబర్వాల్, భూపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, డైరెక్టర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అమలులో మూడు ముఖ్యాంశాలు

తెలంగాణ దళితబంధు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలుచేయడానికి, దళితుల అభివృద్ధి కోసం మనసుపెట్టి లీనమై నిబద్ధతతో పనిచేసే అధికార యంత్రాంగం అవసరమని స్పష్టంచేశారు. వారు అధికారులుగా కాకుండా సమన్వయకర్తలుగా, కార్యకర్తలుగా భావించి పని చేయాల్సి ఉంటుందన్నారు. అట్లాంటి చిత్తశుద్ధి, దళితుల పట్ల ప్రేమాభిమానాలున్న అధికారులను గుర్తించాలని సీఎం ఉన్నతాధికారులను ఆదేశించారు. కులం, జెండర్, ఆర్థికం, తదితర పేర్లతో వివక్షకు గురిచేసి ప్రతిభావంతులను ఉత్పత్తిరంగానికి దూరంగా ఉంచడం వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగానే కాకుండా మొత్తం జాతికే నష్టం కలిగిస్తుందని సీఎం స్పష్టంచేశారు. దళిత సాధికారత కోసం కృషి చేయడమంటే సమాజంలో వివక్షకు గురవుతున్న ఒక ప్రతిభావంతమైన వర్గాన్ని ఉత్పత్తిలో భాగస్వాములను చేసేందుకు కృషి చేయడమేనని తెలిపారు.

### బ్యాంక్ ఖాతాల్లోకి ఆర్థిక సాయం

దేశంలోని ఇతర కులాలు, వర్గాల్లో కూడా ఆర్థిక వివక్ష ఉన్నదని.. అయితే దళితులపై సామాజిక వివక్ష అనే అదనంగా ఉన్నదని, తరతరాలుగా దేశంలో పట్టి పీడించబడుతున్నదని సీఎం ఆవేదన వ్యక్తంచేశారు. దళితులను ఆర్థిక, సామాజిక వివక్ష నుంచి దూరంచేసి వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని చెప్పారు. రైతుబంధు పథకం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయాన్ని, రైతును అభివృద్ధిపథంలో నడిపించిన విధంగా.. దళితబంధు పథకం ద్వారా రాష్ట్రంలో దళిత సాధికారతకోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కుటుంబం యూనిట్‌గా అర్హులైన, ఎంపిక చేయబడిన దళిత కుటుంబాలకు నేరుగా ఆర్థికసాయం అందజేసి, వారికి ఇష్టమైన పనిని ఎంచుకుని అభివృద్ధి చెందే వెసులుబాటును కల్పించాలని.. ఇటీవలి దళిత ప్రజాప్రతినిధుల సమావేశం నిర్ణయించిందని గుర్తుచేశారు. ఆ నిర్ణయం మేరకు దళారుల బాధలేకుండా రైతుబంధు తరహాలో దళితబంధు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థికసాయాన్ని జమచేస్తామని పునరుద్ఘాటించారు.

### ఉత్తర్వులు జారీ

రాష్ట్రంలో దళితులను పేదరికం నుంచి బయటపడేసేందుకు

# హుజూరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టు



**వంద మంది ఐఏఎస్ అధికారులతో సర్వే**

**అన్ని దళిత కుటుంబాల వివరాలు సేకరణ**

**నిబంధనల మేరకు అర్హులైన వారి ఎంపిక**

**ఎంపికైన వారందరికీ దళిత బంధు సాయం**

**లబ్ధిదారుల గుర్తింపునకు ఊరికో ఐఏఎస్**

**అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు అక్కడే**

**మండలాల పర్యవేక్షణకు ప్రిన్సిపల్ సెక్రటరీలు**

**ప్రత్యేకంగా 1500-2000 కోట్లతో అమలు**

**తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం**

దేశంలోనే గతంలో ఎన్నడూ, ఏ పథకాన్నీ అమలు చేయని రీతిలో, అత్యంత సమగ్రంగా దళిత బంధు పథకం అమలుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్ఠ కార్యాచరణ సిద్ధం చేశారు. దళిత బంధు పైలట్ ప్రాజెక్టు చేపట్టే హుజూరాబాద్ నియోజకవర్గంలో నూటికి నూరు శాతం సాచ్యురేషన్‌తో ఈ పథకాన్ని అమలు చేస్తారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దళిత జనాభా 70 వేలు. ఆ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కలిపి మొత్తమ్మీద 20,929 దళిత కుటుంబాలున్నాయి. వీరిలో అర్హులైన కుటుంబాలన్నింటికీ ప్రభుత్వం దళిత బంధు సాయాన్ని అందించనుంది. పైలట్ ప్రాజెక్టు కింద హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అధ్యయనం చేయడం ద్వారా రాష్ట్రంలోని మిగతా 118 నియోజకవర్గాల్లో దళితుల పరిస్థితి ఎలా ఉంది? పథకం అమలులో వచ్చే సాధకబాధకాలు ఏమిటి? క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే అనుభవాలు, సమస్యలపై ప్రభుత్వం ఒక అవగాహనకు రానున్నది. దళిత బంధు అమలుపై ఐఏఎస్ అధికారులకు ప్రత్యక్ష అనుభవం కలిగించడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందులో భాగంగా, రాష్ట్ర అధికార గణమంతా దాదాపు వారం రోజుల పాటు హుజూరాబాద్‌లోనే కొలువుదీరి దళితుల స్థితిగతులను మైక్రో లెవల్‌లో అధ్యయనం చేస్తుంది. హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 95-100 గ్రామాలున్నాయి. ఒక్కో గ్రామాన్ని ఒక్కో ఐఏఎస్ అధికారికి అప్పగిస్తారు. అంటే దాదాపు 100 మంది ఐఏఎస్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 33 మంది కలెక్టర్లు, 33 మంది అదనపు కలెక్టర్లు, మరికొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు ఊరికొకరు చొప్పున బాధ్యతలు తీసుకుని ఈ బృహత్‌యజ్ఞంలో పాలుపంచుకుంటారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలను, ఐదుగురు ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. తమ మండలంలోని గ్రామాల్లో సర్వే చేసే ఐఏఎస్ అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేస్తారు. పైలట్ ప్రాజెక్టును సాచ్యురేషన్ స్థాయిలో చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. అర్హులైన దళిత కుటుంబాలకు దళిత బంధు సాయం అందించడానికి అవసరమైతే 1500-2000 కోట్లైనా వెచ్చించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఐఏఎస్ అధికారులు వారం రోజుల పాటు తమకు కేటాయించిన గ్రామాల్లో సర్వే చేసి దళిత కుటుంబాల స్థితి గతులను తెలుసుకుంటారు. ఆ తర్వాత నిబంధనలను అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. నిబంధనల ప్రకారం, అర్హులుగా ఎంపిక చేయబడిన కుటుంబాలకు దళిత బంధు పథకాన్ని పరిపూర్ణస్థాయిలో (సాచురేషన్ మోడ్ లో) వర్తింప చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు కనుక, ఈ అనుభవం, తర్వాత తమ జిల్లాల్లో పథకాన్ని అమలు చేసేప్పుడు ఉపయోగపడుతుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అనేక సందర్భాల్లో మైక్రో లెవల్ ప్లానింగ్‌తో పథకాలను రూపొందించింది. అధికారుల నివేదికలపై ఆధారపడి నిర్ణయాలు తీసుకునే గత ప్రభుత్వాలకు భిన్నంగా, క్షేత్ర స్థాయి పరిస్థితులను స్వయంగా బేరీజు వేసుకుని పథకాలను తయారు చేసింది. ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా రైతులతో, స్థానిక నాయకులతో, వీఆర్వోలతో, ఇంజినీర్లతో మాట్లాడిన సందర్భాలున్నాయి. గ్రామస్థాయి ప్రణాళికలు తయారు చేసే విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా పలు గ్రామ సభల్లో పాల్గొని, ఆ అనుభవాలతో పథకాలు రూపొందించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో చేపట్టబోతున్న దళిత బంధు పైలట్ ప్రాజెక్టు, అధికారులకు ఒక కేస్ స్టడీగా, ఒక రోల్ మాడల్‌గా మారనుంది.

దశాబ్దాలుగా దెబ్బతిన్న మనిషికి, ఆత్మ విశ్వాస కల్పనే అసలు ఆదరువు.

నీకు తోడుగా నేనున్నాననే భరోసానే భవిష్యత్తు.

ఒక ఆశ
జీవితాన్ని నిలబెడుతుంది.
ఒక ఆసరా
బతుకుకు చేయూతనిస్తుంది.
ఒక అండ
కుటుంబాన్ని నిలబెడుతుంది.
ఒక తోడు
కష్టంతో కలబడే శక్తినిస్తుంది.
ఒక ఆశ్వాసన
ఊరికి ఊపిరి పోస్తుంది.
ఒక ప్రయత్నం
జాతి ప్రస్థానాన్నే మారుస్తుంది.

ఉమ్మడి పాలనలో పొలం కోసం కలవకపడిన మన రైతన్నను, మగ్గంపై ప్రాణాలుగ్గబట్టుకుని బతికిన మన నేతన్నను, కడకాలంలో కనికరించేవారు లేక కష్టపడ్డ వృద్ధులను.. అర్ధాకలితో వస్తులున్న పేదలను, వితంతువులను.. అనేక వర్గాల ఆర్తులను ఆప్యాయతతో ఆదుకున్న తెలంగాణ.. ఇప్పుడు మరో విప్లవాత్మక సంస్కరణకు శ్రీకారం చుడుతున్నది. దేశానికే ఆదర్శంగా నిలిచే ఎన్నో పథకాలను ప్రారంభించిన కేసీఆర్ ప్రభుత్వం మరో గేమ్ చేంజింగ్ స్కీమ్‌కు వేదిక కాబోతున్నది. దశాబ్దాలుగా అణచివేతకు గురైన దళితుల సాధికారత కోసం వినూత్న ప్రయోగం చేయబోతున్నది. ప్రాజెక్టు రిపోర్టులు, అనుమతులు, బ్యాంకులు, రుణాలు, లంచాలు, కమీషన్ల వంటి బాదరబందీలకు చెక్ పెడుతూ దళిత కుటుంబాలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు నేరుగా భారీగా ఆర్థికసాయం చేయబోతున్నది. లక్షలాది అన్నదాతల కడగండ్లు తీర్చిన రైతు బంధు తరహాలోనే, లక్షలాది దళిత సోదరుల కష్టాలను తీర్చేందుకు తెలంగాణ దళిత బంధు పథకాన్ని అమలు చేయనున్నది.

ప్రభుత్వం తెలంగాణ దళితబంధు పథకాన్ని అమల్లోకి తెస్తూ ఆదేశాలు జారీచేసింది. ఈ పథకానికి సంబంధించి జీవో ఎంఎస్ నంబర్ 6ను విడుదలచేసింది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అర్హులైన కుటుంబాలను ఎంపికచేసి పథకాన్ని అమలుచేయనున్నట్టు పేర్కొన్నది. 2021–22 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే వెయ్యికోట్లతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిపాదించింది. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి (ఎస్సీఎస్డీఎఫ్) కింద ఇప్పటికే కొనసాగుతున్న ప్రగతి కార్యక్రమాలతో సంబంధం లేకుండా తెలంగాణ దళితబంధును అమలుచేయనున్నట్టు ప్రభుత్వం జీవోలో వెల్లడించింది. ఈ పథకానికి ఎంపికైన ఒక్కో కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసేందుకు ఎలాంటి బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా రూ. 10 లక్షల చొప్పున నగదు సహాయాన్ని పూర్తి గ్రాంటు రూపంలో ఇవ్వనున్నట్టు పేర్కొన్నది. ఈ పథకాన్ని ముందుగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ నియోజకవర్గంలో అర్హులైన దళిత కుటుంబాలన్నింటికీ పథకం వర్తింపజేస్తామని.. ఇక్కడ పథకం అమలులో వచ్చే ఫలితాలను అధ్యయనంచేసిన తర్వాత రాష్ట్రమంతటా అమలుచేస్తామని జీవోలో ప్రభుత్వం వెల్లడించింది.

**త్వరలో వర్క్‌షాప్**



తొలుత పైలట్ ప్రాజెక్టులో భాగంగా హుజూరాబాద్‌లో ఈ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తారు. ఆ తర్వాత అక్కడ క్షేత్రస్థాయి అనుభవాలను సమీక్షించుకున్నాక.. రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు అమలు మరింత సులువవుతుందని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. పైలట్ ప్రాజెక్టు అమలుకు కలెక్టర్లు, ఇతరఅధికారులతో త్వరలోనే వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఈ స్కీమ్‌లో మూడు ముఖ్యమైన అంశాలుంటాయని వివరించారు.

“మొదటిది పథకం అమలు చేసి పర్యవేక్షించడం. రెండోది పథకం ఫలితాలను అంచనా కట్టడం. మూడోది లబ్ధిదారులు–ప్రభుత్వ భాగస్వామ్యంతో రక్షణ నిధిని ఏర్పాటు చేయడం. ఈ పథకం ద్వారా అందించే పది లక్షల నగదుతోపాటు, లబ్ధిదారుడికి ప్రభుత్వ భాగస్వామ్యంతో రక్షణ నిధిని ఏర్పాటు చేస్తాం. లబ్ధిదారులకు అనుకోకుండా ఏదైనా ఆపద తలెత్తినప్పుడు.. ఈ నిధిని నుంచి వారికి ఆర్థిక సాయం అందుతుంది. ఈ పథకం ద్వారా ఉన్నత స్థితికి చేరిన దళిత కుటుంబం అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక కష్టాలకు లోనైతే.. ఈ నిధి ఒక రక్షణ కవచంగా నిలుస్తుంది. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి



దళితులను తీసుకెళ్లడమే ఈ పథకం ముఖ్య లక్ష్యం" అని సీఎం వెల్లడించారు.

**కార్యకర్తల్లా పనిచేసే అధికారులు కావాలి**

దళిత బంధును క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి దళితుల అభివృద్ధికి మనసుపెట్టి నిబద్ధతతో పనిచేసే అధికార యంత్రాంగం అవసరమని సీఎం స్పష్టం చేశారు. అధికారుల్లా కాకుండా.. సమన్వయకర్తలుగా, కార్యకర్తలుగా భావించి పనిచేసేవారిని గుర్తించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేను ఆధారంగా చేసుకుని, దళిత బంధు పథకం అమలులో ముందుకు సాగాలన్నారు.

దళితుల్లో గూడుకట్టుకున్న అవిశ్వాసం తొలగిపోవాలి. ప్రభుత్వాలు తమ అభివృద్ధి గురించి ఆలోచిస్తున్నాయనే విశ్వాసాన్ని, బలమైన నమ్మకాన్ని దళితుల్లో కలిగించాల్సిన అవసరం మనందరిపై ఉంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ పథకం అమల్లో అధికార యంత్రాంగం అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. దేశంలోని ఇతర కులాల్లో వర్గాల్లో కూడా ఆర్థిక వివక్ష ఉందని.. అయితే దళితులను సామాజిక వివక్ష అనేది తరతరాలుగా పట్టి పీడిస్తోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. దళితులను ఆర్థిక, సామాజిక వివక్ష నుంచి దూరం చేసి.. వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు.

"రైతు బంధు పథకంతో రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని, రైతులను అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపించాం. దళిత బంధు ద్వారా రాష్ట్రంలోని దళితుల సాధికారతకు విశేష కృషి చేస్తాం. కుటుంబం యూనిట్‌గా అర్హులను ఎంపిక చేసి, నేరుగా ఆర్థిక సాయం చేస్తాం. ఆ మొత్తాన్ని వారు ఏవిధంగానైనా ఉపయోగించుకోవచ్చు. ఈ విధానాన్ని ఇటీవలి దళిత ప్రజాప్రతినిధుల సమావేశంలో నిర్ణయించాం" అని గుర్తుచేశారు. దళితుల సమస్యలు అన్నిచోట్ల ఒకేలా ఉండవని, అందుకే దళిత కుటుంబాల ప్రొఫైల్‌ను రూపొందించుకుని, వారి జీవన స్థితిగతులను అందులో పొందుపరచాలని సూచించారు.

**లబ్ధిదారులు కోరుకున్నట్టే దళితబంధు**

తమ అభివృద్ధిని తామే నిర్వచించుకునే దిశగా చైతన్యమై, ఉత్పత్తిలో భాగస్వాములైన నాడే దళితుల సాధికారతకు నిజమైన అర్థం లభిస్తుందని సీఎం కేసీఆర్ అన్నారు. అనతి కాలంలో ఆర్థిక స్వావలంబన కలిగించే వినూత్న ఉపాధి పథకాలను 'తెలంగాణ దళిత బంధు' పథకంలో భాగంగా రూపకల్పన చేసి లబ్ధిదారుల ముందుంచాలని అధికారులను సీఎం ఆదేశించారు.

"క్షేత్రస్థాయిలో పైలట్ ప్రాజెక్టు చేపట్టి, నియోజకవర్గ గ్రామాల్లో పర్యటించి దళిత కుటుంబాల స్థితి గతులను అర్థం చేసుకోవాలి. వారి అభిప్రాయాలను సేకరించాలి. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వారికి అనువైన రీతిలో త్వరితగతిన ఆర్థిక స్థిరత్వాన్ని కలిగించే పలు రకాల పనులను గుర్తించి వాటిని పథకాలుగా మలచాలి. ముందు అధికారులు ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా సెన్సిటైజ్ కావాలి" అని సీఎం కేసీఆర్ వివరించారు.

"దళిత బంధు కింద లబ్ధిదారులకు అందించే ఉపాధి స్కీం వారికి ఇష్టమైనదై ఉండాలి.. వారి జీవితాలను అనతికాలంలో అభివృద్ధి చేసేదై ఉండాలి.. తప్పితే.. పథకం కోసం మూస పద్ధతిలో వారికి అంటగట్టినట్టుగా ఉండకూడదు" అని అధికారులకు సీఎం వివరించారు. హుజూరాబాద్‌లో క్షేత్రస్థాయి అనుభవాలను అర్థం చేసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధును అమలు చేయడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.




## నేతల స్పందనలు

**ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచేపోయే పథకం : మోత్కుపల్లి నర్సింహులు – బిజెపి నేత**

దళిత సాధికారతపై కేసీఆర్ నిర్వహించిన సమావేశం ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని బిజెపి నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. దళితుల అభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అందరి సలహాలు తీసుకోవడంతో దళిత సమాజంలో ఒక మానసిక ఉత్తేజం కలిగిందన్నారు. దళిత సాధికారతలో భాగంగా దళారులు లేకుండా నేరుగా రైతుబంధు పథకం వలే దళితులకు ఆర్థికసాయం అందిస్తేనే మేలు జరుగుతుందన్నారు. గురుకుల పాఠశాలలు వచ్చిన తర్వాత దళిత విద్యార్థులు, కలెక్టరు వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేయాలనే, వారి ఆకాంక్షలు నెరవేరుతుండటం ఆనందదాయక మన్నారు.



**దళిత సమాజానికి ఒక భరోసాను, ధైర్యాన్ని కల్పించారు : భట్టి విక్రమార్క – కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు**

అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించడం ద్వారా యావత్ దళిత సమాజానికి సిఎం కెసిఆర్ ఒక భరోసా, ధైర్యాన్ని కల్పించారని కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దళితుల కోసం తెచ్చిన పథకాలను పటిష్టంగా అమలు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం పటిష్టంగా ఉండడం చాలా అవసరం. ముఖ్యమంత్రి ఆలోచనలను అధికారులు పటిష్టంగా అమలు చేస్తారనే విశ్వాసం తమకుందన్నారు.

**సీఎం తీసుకున్న చొరవ అభినందనీయం : తమ్మినేని వీరభద్రం – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి**

దళిత సాధికారత కోసం సిఎం కెసిఆర్ తీసుకున్న చొరవ, దృఢ నిశ్చయం, సంతోషాన్ని కలిగిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దళిత సాధికారత కోసం ప్రభుత్వ నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు పరచాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తమ పక్షాన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

**సంతోషంగా ఉంది : చాడా వెంకట్ రెడ్డి – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి**

దళిత సాధికారత కోసం సిఎం కెసిఆర్ స్వయంగా ముందుకు రావడం., అటువంటి ఆలోచన చేయడం సంతోషంగా వుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న కళ్యాణ లక్ష్మి వంటి పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు దళితులకు భరోసానిస్తున్నాయన్నారు.

**చరిత్రలో నిలిచిపోతుంది : ఎల్. రమణ**

దేశంలోనే మొదటి సారిగా దళిత బంధు పథకం అమలు చేయాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందని టీఆర్ఎస్ నేత ఎల్. రమణ అన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు





నింపిన నేతగా కేసీఆర్ తరతరాలకు గుర్తుంటారని పేర్కొన్నారు. హుజురాబాద్ నుంచి ప్రారంభించిన రైతు బంధు పథకం విజయవంతం అయినట్టే దళిత బంధు కూడా విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**దళిత క్రాంతికి ప్రగతి వంతెన : క్రాంతి కిరణ్, శాసన సభ్యులు – ఆందోల్**

'స్వాతంత్ర్యానంతరం ఈ 70 ఏండ్లకాలంలో దళితులు అంటే దేశంలోని అన్ని వర్గాలు ఈర్ష్యపడే విధంగా అభివృద్ధి చెందారంటూ ప్రచారంలో పెట్టారు. మాటలతో మోత మోగించారు ఈ దేశంలో దళితులు తప్ప ఇంకెవరూ లేరా వారికోసమే ఈ ప్రభుత్వాలు వున్నాయా అని మిగతా వర్గాల ప్రజలు అసూయ పడే విధంగా ప్రచారం జరిగింది. కానీ వాస్తవం మాత్రం అందుకు విరుద్ధంగా వుంది..'. ఇది దళితుల అభివృద్ధిపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన చారిత్రక సత్యం.

నా వృత్తిపరమైన జీవితంలో నేను అనేక మంది ముఖ్యమంత్రులను చూశాను, మాట్లాడాను. బహుశా నా జర్నలిస్ట్ జీవితంలో, అలాగే ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యాక దళితుల స్థితిగతులపైన ఇంత లోతైన అధ్యయనం చేసిన ముఖ్యమంత్రిని చూడలేదు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రతిపాదించిన దళిత జీవిత సైద్ధాంతికతకు, ఆత్మగౌరవానికి సీఎం కేసీఆర్ ఆచరణ రూపం ఇస్తున్నారు. దళిత ఆత్మ గౌరవాన్ని నిలబెట్టి, వారి భవిష్యత్తు తరాలకు బంగారుబాటలు వేసే అద్భుతమైన ఆలోచనే ఈ కేసీఆర్ దళిత సాధికారతా విధానం.

**దళితులకు కొండంత ధైర్యం : నన్నపునేని నరేందర్, శాసనసభ్యులు – వరంగల్ తూర్పు**

ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు దళితులను ఓటు బ్యాంకుగానే చూశారు. ఓట్ల సమయంలో హామీలు గుప్పించి ఎన్నికలయ్యాక విస్మరించారు. సామాజికంగా, ఆర్థికంగా దళితులను వెనకబడేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వారి కోసం సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు వారికి కొత్త ధైర్యాన్నిచ్చాయనే చెప్పవచ్చు.

ధనవంతులైన దళితులను తెలంగాణలో చూడాలనేది కేసీఆర్ ఆకాంక్ష. దానికోసం 'దళిత ఎంపవర్‌మెంట్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. క్షేత్రస్థాయిలో మారుమూలన ఉన్న దళితుల జీవితాల్లో గుణాత్మకంగా అభివృద్ధిని సాధించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదో చారిత్రాత్మక నిర్ణయం.

ప్రజలు, దళిత వర్గాల మేధావులు చేయిచేయి కలపాలి. దళిత సాధికారత పథకంతో దళితులను అభివృద్ధి బాటలో నిలుపుదాం.

**లక్ష్యం గొప్పది, సహకరిద్దాం : సుంకె రవిశంకర్, శాసనసభ్యులు – చొప్పదండి**

శతాబ్దాలుగా సామాజిక వివక్షకు, అణచివేతకు గురవుతున్న దళితుల ఉద్ధరణకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించిన దళిత సాధికారత పథకం 'దళితబంధు' రాష్ట్ర రాజకీయాలలో నవశకానికి నాంది పలుకుతున్నది.

కేసీఆర్ పథకాలు, సంస్కరణలు దేశానికే ఆదర్శం. ఇతర రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసలు కురిపిస్తుంది. ఎస్సీ హాస్టల్‌లో పురుగుల అన్నం, పలుచటి చారు తిని చదువుకున్న నాలాంటి వారికి, హాస్టళ్లు ఇంతగా మారి దళిత బిడ్డలు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం చేస్తూ గొప్ప చదువులు చదువే రోజులు వస్తాయని ఊహకు కూడా అందలేదు. కానీ కేసీఆర్ చేసి చూపించారు. ఈ పథకాన్ని కూడా ఆయన విజయవంతం చేసి తీరుతారు.

**దళిత బంధు పథకంపై ఎన్నారైల హర్షం**

సీఎం కేసీఆర్ దళిత సాధికారత దళితబంధు పథకం ప్రకటించడం హర్షనీయమని ఎన్నారై టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కూర్మాచలం హర్షం ప్రకటించారు.

– కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com

# రిప్ వాన్ వింకిల్

సాహిత్యంతో సంబంధంలేని వ్యక్తులూ, సంస్థలూ తక్కువ. రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు సాహిత్యాన్ని తక్కువగా చదువుతూ వుండవచ్చు. కానీ పబ్లిక్ మీటింగ్‌ల్లో ఏదో ఓ కథని కవిత్వాన్నో ఉదహరించని నాయకులు అరుదు. అదే విధంగా న్యాయమూర్తులు కూడా అప్పుడప్పుడూ కవిత్వాన్నో, కథనో తమ తీర్పుల్లో ఉదహరిస్తూ వుంటారు.

ఈ మధ్యన గంగా సహాయ్ వర్సెస్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ కన్సాలిడేషన్, తీర్పు తేదీ 18 మార్చి 2021 కేసులో అలహాబాద్ హైకోర్టు రిప్ వాన్ వింకిల్‌ని ఉదహరించింది. రిప్‌వాన్ వింకిల్ కథని చదువని వ్యక్తులు అరుదని చెప్పుకోవచ్చు.

వాషింగ్టన్ ఇర్వింగ్ రాసిన చిన్న కథ రిప్‌వాన్ వింకిల్. ఇది 1819-20 ప్రాంతంలో ఆయన రాశారు. రిప్‌వాన్ ఓ రైతు. అందరితో స్నేహపూర్వకంగా వుండే వ్యక్తి. అతను ఓసారి కాట్స్‌కిల్ పర్వతాల వైపు వెళతాడు. అక్కడ అతనికి మరుగుజ్జులు ఆడుతూ కన్పిస్తారు. వాళ్ళను చూసి అతను ఆశ్చర్యపోతాడు. వాళ్ళు ఇచ్చిన పానీయాన్ని అతను స్వీకరిస్తాడు. తక్షణమే అతను నిద్రలోకి జారుకుంటాడు. 20 సంవత్సరాల వరకు అలాగే నిద్రిస్తాడు. ఆ తరువాత అతనికి మెలకువ వస్తుంది. అప్పటికి అతని వయస్సు పై బడుతుంది. ముసలివాడై పోయి వుంటాడు. తెల్లటి గడ్డం చాలా పొడవుగా పెరిగి వుంటుంది. గతంలో అతను చూసిన మరుగుజ్జులు అతనికి ఎక్కడా కన్పించరు.




అతని వూరు, కుటుంబం గుర్తుకొస్తాయి. వెంటనే తన వూరికి బయల్దేరతాడు. అతని వూరు పూర్తిగా మారిపోయి కన్పిస్తుంది. అతని భార్య చనిపోయిందని తెలుస్తుంది. అతని పిల్లలు చాలా పెద్దవాళ్ళు అయిపోయి వుంటారు. జార్జి వాషింగ్టన్ స్థానంలో కింగ్ జార్జి-3 అధికారంలోకి వచ్చి వుంటాడు. అతన్ని ఎవరూ గుర్తు పట్టరు. అతన్ని విసిగించే భార్య, అతని సోమరి తనాన్ని అసహ్యించుకునే భార్య చనిపోయి వుంటుంది. అతని కుమారుడికి వివాహం అయి వుంటుంది.

అతన్ని అతని గ్రామంలో ఎవరూ గుర్తు పట్టరు. అతను కూడా ఎవరినీ గుర్తు పట్టలేకపోతాడు. అతన్ని అతని తెల్లటి గడ్డాన్ని అందరూ ఆశ్చర్యంగా చూస్తూ వుంటారు. మెల్లగా అతను వున్న ఇంటికి వస్తాడు. అది పాతబడిపోయి వుంటుంది. పై కప్పు కిందికి వంగిపోయి వుంటుంది.

మెల్లగా తలుపుతడతాడు. ఓ మహిళ వచ్చి తలుపుతీస్తుంది. అతని భార్య పోలికలు ఆమెలో కన్పిస్తాయి. రిప్‌ని చూసి 'ఎవరూ' అని అడుగుతాడు ఆమెను. ఆమె తన పేరు చెబుతుంది. తన కూతురని రిప్ గుర్తిస్తాడు. రిప్ సంతోష పడతాడు. మానాన్న కన్పించకుండా పోయి చాలా సంవత్సరాలు గడిచాయి. మా అమ్మ కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయింది. అని ఆమె అతన్ని చూసి చెబుతుంది.

తనే ఆమె తండ్రినని అతను చెప్పేలోపు ఆమె వెళ్ళిపోతుది. అప్పుడు తన తప్పిదాన్ని రిప్ వాన్ వింకిల్ గుర్తిస్తాడు. తాను ఏ పనీ చేయకుండా, సోమరిగా వున్నందుకు తగిన ప్రతిఫలాన్ని పొందానని అనుకుంటాడు. అతన్ని అతని స్నేహితులు కూడా అతన్ని గుర్తుపట్టరు ఇదీ కథ.

ఈ కథని అలహాబాద్ హైకోర్టు తన తీర్పులో ఉదహరించింది. రిప్ వాన్ వింకిల్లకి సాహిత్యంలో చోటు వుంటుందేమో కానీ కోర్టుల్లో స్థానం లేదని కోర్టు వ్యాఖ్యానించింది.

ఆలశ్యం, జాప్యం లాంటి విషయాలలో కోర్టులు నలిగిపోతున్నాయి. న్యాయపాలన దెబ్బతింటుంది. ఇక, కేసు విషయానికి వస్తే రామ్ అవతార్‌కి తాము వారసులమని గంగా సహాయ్ కోర్టుకి వచ్చారు. అతను తమకు వీలునామా ద్వారా ఆస్తిని ఇచ్చాడని వాళ్ళ వాళ్ళ వాదన. అయితే ఆ దరఖాస్తుని నాలుగు సంవత్సరాల కాలపరిమితి దాటిన తరువాత కోర్టులో దాఖలు చేశారు. ఆ ఆలస్యానికి తగు కారణాలని కూడా వాళ్ళు తన దరఖాస్తులో పేర్కొనలేదు. ఆలస్యానికి వాళ్ళదే తప్పు. అందుకని కోర్టు వాళ్ళ దరఖాస్తుని అంగీకరించలేదు.

తమ తప్పు వుండి కోర్టుకి వచ్చే వాళ్ళ దరఖాస్తులని కోర్టులు అంగీకరించకూడదు. కేసులు జాప్యం కావడానికే అవి ఉపయోగపడతాయి తప్ప మారోరకంగా ఉపయోగపడదు. ఈ దరఖాస్తు పరిష్కరిస్తూ అలహాబాద్ హైకోర్టు రిప్ వాన్ వింకిల్ కథని తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సోమరిపోతులైన లిటొగెంట్లు తగిన సమయంలో చర్య తీసుకోరు. ఆ తరువాత తీరికగా వస్తారు. ఏదో తప్పుడు క్లెయిమ్స్‌ని సృష్టిస్తారు. కేసు పరిష్కారంలో జాప్యాన్ని సృష్టిస్తారు. తమ తప్పు లేకున్నా ఇతర పార్టీలు ఈ సోమరిపోతుల వల్ల ఇబ్బదుల పాలవుతారు. అలా కావడానికి వీల్లేదని కోర్టు అభిప్రాయపడింది.

సాహిత్యం అనేది ఒక విషయాన్ని బలంగా చెప్పడానికి, శక్తివంతంగా చెప్పడానికి ఉపయోగపడుతుంది. అది కథ కావొచ్చు, కవిత్వం కావొచ్చు. అదే సాహిత్యం గొప్పదనం. 1819వ సంవత్సరంలో రాసిన రిప్ వాన్ వింకిల్ కథని అలహాబాద్ హైకోర్టు 2021వ సంవత్సరంలో ఉపయోగించుకుంది.

సోమరిపోతులకి సోమరిపోతుల కథ.

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com





# నిప్పుల కొలిమే.. జీవనాధారం

ఊరుమ్మడి కొలిమి మాయమయ్యింది. దున్నెటోడు లేడు. నాగలి చెక్కెటోడు లేడు. కర్రు కాల్చుడు పనే లేదు. కొలిమి కొట్టం పాడువడి, అండ్ల దొరవారి గాడ్దులను కట్టెయ్యడం మొదలైంది. ఊళ్ళ రాతెండి పాత్రలు కొనే శక్తి ఎవ్వరికి లేక కంచరోల్ల కొలిమి బూడిదైపోయింది. తిననీకి తిండె లేదంటె బంగారి ఎండి సొమ్ములు చేసుకునేదెవ్వరు? ఔసులోల్ల కొలిమి కూడ కూలిపోయింది. ఒక్కటి గుడ లేకుండ ఊళ్ల ఉన్న కొలుములన్ని ఆరిపోయినయి. ఊళ్ల నిప్పు బుట్టని పాడుకాలమొచ్చింది. ఊరుమ్మడి కొలుములైతే కనబడకుండ పోయినయి. దొరవారి సొంత పనులకు గడీల కొలుముల తీర్గ కనబడేవి ఉన్నయి గాని, ఇచ్చంత్రం, ఆ కొలుముల్ల మంట ఎర్రగొస్త లేదు, తెల్లగ దయ్యం లెక్క ఉన్నది. అక్కడక్కడ పేదసాదలు ఇండ్లల్ల కొలుములు బెట్టుకుంటున్నరని మాటెల్లింది గాని ఊదు గాలది, పీరి లేవది. ఊరుమ్మడి కొలిమి అవసరం వచ్చింది.

మనిషిని మనిషికి కాకుండా చేస్తున్న, మనను మనకు కాకుండా చేస్తున్న ఒక మహమ్మారి మన ఊళ్లనూ, మన సామూహిక జీవనాన్నీ, మన ఆనందాలనూ, మన సంస్కృతినీ దెబ్బ తీస్తున్నప్పుడే మన కులవృత్తులు కూడా అణగారిపోయినై. ఒక కొలిమి మూతపడ్డదంటే ఒక వృత్తి అంతరించిందని మాత్రమే కాదు, ఒక సామూహిక జీవన సౌందర్యం అస్తమించిందని. ఒక అద్భుత కళానైపుణ్యం విధ్వంసమవుతున్నదని. వ్యవసాయం అవసరం లేని, వ్యవసాయ పరికరాల కమ్మరి కొలిమి అవసరం లేని, కంచరి పాత్రలు అవసరం లేని, కంసాలి కళాకౌశల అలంకరణలు అవసరం లేని ఒక నిరామయ, నిస్తబ్ద, నిరాశాపూరిత వాతావరణం మన ఊళ్లను కమ్మేసింది.

విశ్వకర్మీయుల/ విశ్వబ్రాహ్మణుల పంచ వృత్తులలో మొట్టమొదటి వృత్తి కమ్మరము. ఇనుమును కరిగించి వస్తువును తయారు చేసి ప్రపంచ పారిశ్రామిక వ్యవస్థకు మూల పురుషుడు లోహశిల్పి కమ్మరి. ప్రపంచంలో ఏ వస్తువు తయారు కావాలన్నా కమ్మరి కొలిమిలో కాసీ డాకలి పై సుత్తె దెబ్బలు తినాల్సిందే. భగభగ మండే కొలిమి ముందు కూర్చుని వేడిని లెక్క చేయక రైతుకు అవసరమైన పనిముట్లు చేస్తాడు. కమ్మరి కొలిమి రాజేసి ఇనప ముక్కలతో కొడవళ్ళు గునపాలు నాగళ్ళు చేస్తాడు. కొడవళ్ళకు కక్కు కొడతాడు. రెడీమేడ్ పనిముట్లు, ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో ఇనుముతో రకరకాల పనిముట్లు తయారు చేసే కమ్మరికి పని పోయింది. రైతులు గతంలో మాదిరి కొలిమి దగ్గరకు వచ్చి తమకు కావాల్సిన వస్తువులు చేయించుకొనే ఓపిక ఇప్పుడు లేదు. దాంతో వారు రెడీమేడ్ పనిముట్లు తీసుకొని తమ పనులు గడుపుకొంటున్నారు. అనావృష్టి, అతివృష్టితో రైతులు వ్యవసాయం చేయకపోవడంతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే కమ్మరి పని పోయింది. వీరు ఇప్పుడు ప్రవేటు ఫ్యాక్టరీలలో కార్మికులయ్యారు. ఆధునిక యంత్ర పనిముట్లు రావడం వల్ల కమ్మరి వృత్తి పూర్తిగా అంతరించిపోవుటకు సిద్ధమైంది. ట్రాక్టర్లు రావడం వల్ల నాగళ్లు, పొలాన్ని దున్నేందుకు ఉపయోగం లేకుండా పోయాయి. వరి కోత మిషన్లు రావడం వల్ల కోసే కొడవలి కూడా ఉపయోగపడకుండా ఉంది.

కమ్మరి వృత్తి పనివార్లకు కొలిమి ప్రధానమైనది. గాలి తిత్తి ద్వారా బొగ్గులను కాల్చి ఇనుమును వేడి చేసి తగిన విధంగా ఇనుప వస్తువులను తయారుచేస్తారు. ఎర్రగా కాలిన ఇనుప ముక్కను పెద్ద ఇనుప దిమ్మ మీద పెట్టి పెద్ద సమ్మెటతో కొట్టి కావలసిన ఆకారానికి తీసుకొచ్చి, కత్తులు, కొడవళ్ళు, గొడ్డళ్లు, తొలికలు, ఇలా రైతులకు కావలసిన ఇనుప వస్తువులను వారు తయారు చేసే వారు. దాని పేరె కొలిమి. ప్రస్తుతం ఈ కొలుములు ఎక్కడా లేవు. అప్పట్లో కమ్మరి వారు చేసె వస్తువులు నేడు యంత్రాలతో తయారయి బజారులలో దొరుకుచున్నవి.

సాధారణంగా ప్రజలు వేసవిలో వేసవి తాపానికి తట్టుకోలేక ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, మరికొందరు ఏసిలు వినియోగిస్తారు. వేసవి తీవ్రత ఎంత ఉన్నా కణకణ మండే నిప్పుల కొలిమితో వారు జీవనం చేయక తప్పదు. కాని ఈ నిప్పుల కొలిమి ఎంత భగభగ లాడితే ఇనుప వస్తువులు అంత బాగా తయారవుతాయి. ఇనుప వస్తువు





తయారికి కొలిమి వేడిచేయాలంటే వరి చిట్టు, బొగ్గులు ఉపయోగించాలి వాటిని కొనుగోలు చేయాలి. వీటన్నికంటే మలాట ఉపయోగించే కార్మికుడు ముఖ్యం. అతను లేక పోతే కొలిమి నిర్వహించలేరు. కార్మికుడికి అన్ని సదుపాయాలు కల్పించి రోజుకు నాలుగువందల నుండి ఐదువందలు రూపాయలు వెచ్చించాలంటున్నారు. పని సమయంలో కనీసం కడుపు నిండా మంచినీరు సైతం తాగలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు మొత్తం కష్ట పడితే కూలి మందం వస్తాయి అంటున్నారు. తాతలు, తండ్రుల నాటినుండి నేర్చుకున్న వృత్తని కొంతమంది అక్కడక్కడ ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. వేరేపని చేయలేక వేసవిని సైతం లెక్క చేయకుండా పనిచేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. పని నిర్వహించే ప్రదేశం సైతం నామమాత్రపు షెడ్డుతో ఏర్పాటు చేసుకుంటారు.

పూర్వం ఈ వృత్తిని చేసికొని బతికే సంచార జాతి ఇంకొకటి వున్నది. వారిని 'బైట కమ్మరులు' అంటారు. వీరు కమ్మరి పనికి కావల్సిన పనిముట్లతో ఊరూరు తిరుగుతుంటారు. వీరు ఊర్లోకి రాకుండా ఊరి బైటనే కొలిమి పెట్టుకుని కొద్ది రోజులు ఉండి వెళ్ళి పోతారు.

నగరాల ఆరు బయట, చిన్నచిన్న పట్టణాల, పల్లెల కేంద్రాల బయట రోడ్డు ప్రక్కన దేరా వేసుకొని కొలిమి ముందు కూర్చొని సుత్తినో, కత్తినో, కొడవలినో, గడ్డపారనో సానపడ్తూ ఉండే మనుషులు మనకు కనపడ్తుంటారు. బస్సులోనో, ఆటోలోనో పోతూంటే ప్రతి రోజూ గమనిస్తూనే ఉంటాం. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట 6వ నంబర్ చౌరస్తా నుండి విద్యానగర్ వెళ్లే రోడ్డు ప్రక్కన ఒక ఓ సమూహం కనపడుతుంది.

వీళ్లను తెలంగాణ ప్రాంతంలో "బైట కమ్మరోళ్లు" అని పిలుస్తారు. కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్, ధార్వాడ్, గుల్బర్గా జిల్లాలలో కనిపించే వీరిని అక్కడ "బైట కమ్మర" గా వ్యవహరిస్తారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో వీళ్లకు 'గడియా లోహార్' అనే పేరుంది. ఉత్తర భారత దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఈ సమూహాలను 'గౌసండి' అని కూడా అంటారు. సంచార జాతులైన వీరు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో విముక్త నేర జాతుల జాబితాలో ఉన్నారు. ఇన్ని రకాలుగా వర్ణించబడే ఈ బయట కమ్మరులు, తమకు చాలా బ్రహ్మాండమైన చరిత్ర, సంస్కృతి ఉందని చాలా గర్వంగా చెప్తారు. రాజస్థాన్‌లోని మేవార్ ప్రాంతం వీళ్ల పూర్వీకుల నివాసం.

సైన్యానికి ఇనుముతో కత్తులు, డాళ్ళు, బరిసెలు వంటి ఆయుధాలు తయారు చేసి ఇవ్వడం, రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయడం వీళ్ల వృత్తి. ప్రధానంగా వీరు ఇనుముతో ఏరకమైన వస్తువు నైనా సృష్టించడంలో ప్రతిభావంతులు. సాంప్రదాయ కమ్మర్లు తయారు చేసే వాటికి భిన్నమైన వస్తువులను వీరు సృష్టించే వారు. పదహారవ శతాబ్దంలో మొఘల్ వంశీయులు మేవార్‌లో రాణా ప్రతాప్ సామ్రాజ్యాన్ని చేజిక్కించుకున్నాక వీరు తీవ్ర ఒత్తిడికిగురై, మానసిక క్షోభతో ఆ రాజ్యాన్ని వదలి ఒక ప్రతిజ్ఞ చేసి వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయి సంచార సమూహాలుగా మారిపోయారని చారిత్రక వాస్తవాలు తెలుపుతున్నాయి. మొఘల్ సామ్రాజ్యం అంతం అయి రాజపుట్ రాజ్యం ప్రతిష్టించబడే వరకు తాము చిత్రదుర్గ కోటకు వెళ్లమని, పక్కా గృహంలో నివసించమని, మంచంపై నిద్రించమని, దీపాలు వాడమని, నీళ్లు చేదడానికి తాళ్లు వాడమని ప్రతిజ్ఞ చేశారట. ఇది కొట్టి పారవేసే కథ కాదు, ఈ ప్రతిజ్ఞ వాస్తవమే అని చరిత్రకారులు కూడా నిర్ధారించారు.

దేశంలోని ఐదు రాష్ట్రాలకు సంచరిస్తూ వెళ్లిన ఆ సమూహాలపై నిజాం ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులు విచారించడానికి కమిషన్లు కూడా వేశాయి. 1920లో నిజామ్ ప్రభుత్వం, హైదరాబాద్ స్టేట్ హైకోర్టు న్యాయమూర్తి సయ్యద్ సిరాజ్ ఉల్ హసన్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ గిసాడీ సమూహం ఆచార వ్యవహారాలు, సాంఘిక, సామాజిక పరిస్థితులపై వివరమైన నివేదిక తయారు చేసి వీళ్ల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పలు సూచనలు కూడా చేసింది. కర్ణాటక ప్రభుత్వం నియమించిన డాక్టర్ సి.ఎస్. ద్వారకనాథ్ కమిటీ వీళ్ల జీవన విధానంపై చాలా వివరాలు సేకరించింది. వీరి వివాహ పద్ధతులు, విడాకుల వ్యవహారాలు, బాలికలు యవ్వనంలోకి అడుగుపెట్టినప్పుడు ఆచరించే కార్యక్రమాలు, జననం, మరణానికి సంబంధించిన ఆచార వ్యవహారాల గురించి నివేదికలో నమోదు చేసింది. వీళ్లకు విద్య నేర్పడానికి తగు చర్యలు చేపట్టడం గురించే కాకుండా జీవనోపాధి, గృహ వసతి విషయాల్లో కూడా కర్ణాటక ప్రభుత్వానికి నిర్దిష్టమైన సూచనలు చేసింది. వీళ్ల సమస్యలు, తగాదాలు, కమ్యూనిటీ కమిటీలోనే పరిష్కరించుకుంటారు. న్యాయస్థానాలకు వెళ్లరు. తమను తాము హిందువులుగా భావిస్తారు. స్వామి గురప్ప, మున్నేశ్వరుడు, భైరవిలను కుల దేవతలుగా పూజిస్తారు. దేవ తలకు జంతు బలులిచ్చే ఆచారం ఉంది. వీళ్ల





బ్రాహ్మణ, క్షత్రి య, వెలమ, కాపు లాంటి పై కులాల నుండి మాత్రమే వండిన ఆహారాన్ని స్వీకరిస్తారు. గ్రామాలల్లో ఉండే కమ్మరి, కుమ్మరి, కంసాలి, కంచర వృత్తుల వారిచ్చే ఆహారాన్ని స్వీకరించరు. పండుగల సందర్భంలో వీళ్ల సంస్కృతి, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే జానపద గేయాలు స్త్రీలు పాడతారు. రాజపుట్ రాజుల శౌర్యాన్ని, ఔన్నత్యాన్ని గానం చేస్తారు. ఈ జాతి వాండ్లు గుజరాతీ, మరాఠీ సంగమంగా తయారైన గిసాడి అనే భాష మాట్లాడుతారు. స్త్రీలు, పురుషులు మార్వాడీ గ్రామీణ ప్రజల సాంప్రదాయ దుస్తులైన గాగ్రా, జాకెట్, ధోవతి రంగు రంగుల తలపాగలు ధరిస్తారు. స్త్రీలు చాలా దృఢంగా ఉంటారు. వంట చేయడంతో బాటు, స్త్రీలు కొలిమి దగ్గర బరువైన సమ్మెట ఎత్తి కాలిన ఇనుమును సాగుదీయడంలో భర్తకు సహాయపడ్తారు. వీళ్లలో విద్య చాలా తక్కువ. గ్రామాల బయట, పట్టణాల బయట నివసిస్తారు కాబట్టి, వాళ్ల పిల్లలకు ఇతర బాల, బాలి కలతో స్నేహ సంబంధాలు ఉండవు. ఆధునిక జీవన పద్ధతులుగాని మారుతున్న జీవన విధానాల ప్రభావంగాని వీళ్లపై పడలేదు. సమాజంతో దూరంగా నివాసాలు ఏర్పరచుకొని జీవించడమే ఇందుకు కారణం. ప్రభుత్వ పథకాలు ఏవీ అందు బాటులో వీళ్లకు లేవు. ఇప్పుడిప్పుడే వీళ్ల సంఘం అన్ని జిల్లాలు పర్యటించి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నది. బ్యాంకు రుణాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపాస్తుల దగ్గరే అవసరాలకు డబ్బులు తెచ్చుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో వీళ్లకు ఏ రిజర్వేషన్ జాబితాలోనూ స్థానం లేదు. అవసరమయినప్పుడు రెవెన్యూ అధికార్లు సాంప్రదాయ కులవృత్తులు నిర్వహించే, బి.సి. 'బి' గ్రూపుకు చెందిన కమ్మరి సర్టిఫికెట్ ఇస్తున్నారు. ఈ సర్టిఫికెట్ తమకేమీ ప్రయోజనం చేకూర్చడం లేదని వీళ్ల నాయకులు అభిప్రాయపడ్తున్నారు. నిజాం కాలంలోనే తమని ఎస్టీలుగా గుర్తించాలనే సూచనలు వచ్చాయని, సంచార జాతిగా గుర్తించాలనే సూచన ఇమడ్చబడకపోవడం చాలా విచారకరం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతిని గడియా లోహార్, గిసాడి, భువాలియా, పాచల్, చిత్తోరియా లోహర్, రాజ్ పుట్‌లుగా రాజస్థాన్ ప్రభుత్వం గుర్తించింది.



గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా వీళ్లను గుర్తించ డం జరిగింది. ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త ఎస్.పి. రుహేలా వీరిని బైల్ కమ్మరి (ఎడ్ల బండ్లలో సంచరించు కమ్మర)గా, ఆధునిక యంత్ర యుగంలో కూడా వీరు చాలా నాణ్యతతో తమ ఇనుప పనిముట్లు తయారు చేస్తారని అభిప్రాయపడ్డారు.

బైట కమ్మరులకు విశ్వబ్రాహ్మణులకు ఎటువంటి పోలిక కానీ సంబంధంకానీ లేదు. విశ్వబ్రాహ్మణ / విశ్వకర్మ కులస్తులు సాంప్రదాయ కమ్మరులు. 'బైట కమ్మరులు' ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్డ తెగల జాబితాలో 10వ కులం. బి.సి. జాబితాలో 21వ కులంగా చేర్చబడినారు.

తెలంగాణ ప్రభుత్వం నియమించిన బిసి కమిషన్‌కు వారు తమ పరిస్థితిని వివరించి, తమను ఎస్‌టి జాబితాలో చేర్చి, సంచార జాతుల కేటగిరిలో గుర్తింపు ఇవ్వాలని అభ్యర్థన చేశారు. తమ జీవన పరిస్థితులను అధ్యయనం చేసి, ప్రభుత్వ పథకాలు అందుబాటులోకి తేవడానికి ఏదైనా సామాజిక పరిశోధన సంస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొలిమి దగ్గర ఉండి ఇనుప సామాన్ల తయారీలో ప్రమాదవశాత్తు మరణిస్తే భీమా సౌకర్యం కల్పించాలి అని వీరు డిమాండు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వారి న్యాయమైన కోరికలను నెరవేర్చి చేతి వృత్తులకు చేయూత అందించేందుకు విశేష కృషి చేస్తుంది. ఆ కృషి ఫలించి కులవృత్తులకు మళ్లీ పూర్వవైభవం రావాలని ఆశిద్దాం.

-సువేగా,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# కొడవటిగంటి సైన్స్ రచనా ప్రణాళిక

కొడవటిగంటి కుటుంబరావు అనగానే మనకు కథ గుర్తుకు వస్తుంది. కానీ అదే రీతిలో ఆయన పేరు చెప్పగానే ఆయన చేసిన సినిమా సమీక్షలు గుర్తుకు రాకపోవచ్చు. ఆయన నెరపిన సంపాదకత్వం మన మదిలో మెదలకపోవచ్చు. సృజించిన బాలసాహిత్యం స్ఫురించక పోవచ్చు. సైన్స్ వ్యాసాలు రాసిన కుటుంబరావు తర్వాత ఆ స్థాయిలో సినిమా గురించి వేరెవరూ రాయలేదంటే ఆశ్చర్యం లేదు. సచిత్ర వారపత్రికలకు ఆయన డెబ్బైయ్యేళ్ళ క్రిందట ఏర్పరచిన చట్రం స్థూలంగా నేటికీ ఉందంటే అవాస్తవం కాబోదు. మూడు దశాబ్దాలపాటు బాల సాహిత్యానికి ఆయన చేసిన కృషి గణించడం దాదాపు సాధ్యం కాదు. తెలుగులో సైన్స్ రచన విషయంలో కుటుంబరావు అంతటి సమగ్రమైన రచయిత అంతకుముందు లేరు. తర్వాత అసలే లేరన్నా అతిశయోక్తి కాదు. కొడవటిగంటి రచనా వర్ణపటంలో సాహిత్యం, సినిమా, సామాజికం, రాజకీయం, బాలసాహిత్యం, సైన్స్, చరిత్ర ఇలా అన్నీ ఉన్నాయి. ఆయన దేనికీ లోటు చేయలేదు కవిత్వం తప్ప. కొ.కు. మొత్తం సాహిత్యాన్ని ఒక ట్యాంకుతో పోలిస్తే ఆయన చేపట్టిన ప్రక్రియలు కథ, నవల, వ్యాసం, గల్పిక వంటివి వివిధ కుళాయిల్లాగా పరిగణించాలి. నిజానికి ఆ ట్యాంకును సైన్స్ ట్యాంక్‌గానే పరిగణించాలి. స్థూలంగా, సూక్ష్మంగా సైన్సుకు ఆధారభూతమైన వాస్తవికత, హేతువు, పరిష్కారాల దృష్టితోనే ఆయన రచనా ప్రస్థానం సాగుతుంది. అయితే కొన్ని అంశాలు ప్రాచుర్యంలోకి రాకపోవటానికి ఆయన బాధ్యత లేదు. అది తెలుగు వారి పరిమితమైన ఆసక్తి కావచ్చు లేదా వారి పరిణతి చెందని జ్ఞానం కావచ్చు.



కుటుంబరావు గారి కంటే ముందు కాళీపట్నం కొండయ్య, వసంతరావు వెంకటరావు వంటి కొంతమంది జనరంజక విజ్ఞాన శాస్త్ర రచన చేశారు. అయితే ఆయన రచనా కాలం దృష్ట్యా విజ్ఞానశాస్త్ర రచన మీద దృష్టి పెట్టక తప్పని పరిస్థితి ఉంది. ఒకటవ, రెండవ ప్రపంచ యుద్ధాల మధ్య సాంకేతిక పురోభివృద్ధి ఉంది. లేదా ఆ మధ్య వ్యవధిలో తయారైన ఆటంబాంబు ప్రపంచ యుద్ధాన్ని త్వరపెట్టి ఉండవచ్చు – "శాస్త్ర పరిశోధనలు సమాజాన్ని మార్చడమే గాక, సామాజిక పరిణామాన్ని వేగిరించాయి" అని కుటుంబరావే 1962లో వ్యాఖ్యానించి నట్టు. 1934లో కొ.కు. వ్యాసరచయితగా జన్మించారని అంచనా! తర్వాత సంభవించిన రెండవ ప్రపంచయుద్ధం (1939–45)లో వాడిన అణుసామగ్రి ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన రీతిలో సైన్స్‌పట్ల ఆసక్తిని రేకెత్తించింది. మొదటి ప్రపంచయుద్ధం తర్వాతనే జర్నలిజం ఒక ప్రత్యేక అధ్యయన అంశంగా విప్పారిందని ఒక అంచనా. అటువంటి సంబంధమే రెండవ ప్రపంచ యుద్ధానికి ప్రపంచ స్థాయిలో సైన్స్ రచనా వృద్ధికీ సంబంధం వుందని మరో పరిశీలన! అప్పటికి కుటుంబరావులోని వ్యాస రచయితకు పుష్కరం వయసుంది. దాంతో ఆయన చేతిలో సైన్స్ రచన సర్వ సమగ్రంగా, అత్యంత వాస్తవికమైన రీతిలో రూపొందింది.

సాహిత్యం, సామాజిక, రాజకీయ, సినిమా, సైన్స్ వ్యాసాలు మొత్తం దాదాపు వెయ్యి దాకా వుంటాయని విప్లవ రచయితల సంఘం కుటుంబరావు రచనలు సంకలనం చేస్తూ పేర్కొంది. కుటుంబరావు వ్యాసరచయితగా ఐదు అంశాలు స్పృశించారనుకోవచ్చు. అయితే "సైన్స్ వ్యాసాలు" అంటూ విరసం వెలువరించిన సంకలనంలో సుమారు 150 ఉన్నాయి. అందులో లేని హోమియోవైద్యం వ్యాసాలు, వాటితో పాటు బుద్ధికొలత వ్యాసాలను సైన్స్‌గా పరిగణించకపోయినా ఇతరత్రా సంకలనాలలో ఉండే "సైన్స్ స్పృహ గల" ఇతర అంశాల వ్యాసాలు కలుపుకుంటే కుటుంబరావు సైన్స్ వ్యాసాలు ఆయన మొత్తం వ్యాసాలలో ఆరో వంతు నుంచి ఐదో వంతుదాకా ఉంటాయి. ఇక్కడ సైన్స్ అంటే సైన్స్ అని ప్రత్యేకంగా పిలవబడే అంశాలతో పాటు, టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం – ఇలా చాలా అంశాలు 'సమగ్రం' అనే రీతిలో మనకు దర్శనమిస్తాయి.

అన్నింటినీ తాత్విక భూమికతో స్వీకరించి, చారిత్రాత్మక కోణంతో పరిశీలించి, సామాజిక స్పృహతో వర్తమాన సమాజానికి అనువర్తింప జేయడం కుటుంబరావు శైలి. దాంతో ప్రకృతి, దేవుడు, మతం, భయం, నాగరికత, అభివృద్ధి, కళలు, మూఢవిశ్వాసం, సోషలిజం, రాజకీయాలు, వాణిజ్యం – ఇలా చాలా పార్శ్వాలు వాటికి తెలియకుండా సైన్స్ రచనలో అంతర్భాగాలైపోతాయి. హిట్లర్, ఆటంబాంబుల విధ్వంసం అని కేవలం భౌతిక శాస్త్రాంశాల సాంకేతిక అనువర్తనలకే కుటుంబరావు పరిమితం కాకపోవడం అనేది సైన్స్ రచయితగా ఆయన చూపిన దార్శనికత. అప్పటికి డి.ఎన్.ఎ స్థాయి ఆవిష్కరణలతో జీవశాస్త్రం అంటే ఆసక్తికరంగా లేదనేది ఒక వాస్తవం. ఆయన భౌతికశాస్త్రం అభ్యసించినా – ఇతర అంశాల మీద మక్కువ చూపించడం ఆయన పరిశీలనకున్న సమగ్రత. అందుకే కుటుంబరావు సైన్స్‌రచన కన్నా కుటుంబరావు సైన్స్ రచనాప్రణాళిక గొప్పది.

సైన్స్ అంటూ గందరగోళ పెట్టలేదు. సరళమైన, చక్కనైన తెలుగు పదాలతో ఆయన సైన్స్‌లాగా అనిపించకుండా సైన్స్ చెప్పారు. ఈ మాటలు చూడండి– పరమాణువుల స్వభావం, (2 ఆగస్టు, 1959) అనే వ్యాసంలో 'సృష్టిలో కనిపించే అనేకత్వంలో ఏకత్వాన్ని తెలుసు కోవడమే శాస్త్ర విజ్ఞానం లక్ష్యం' – అని నిర్వచించిన కుటుంబరావు దాన్ని మరింత సరళీకరణం, సామాజీకరణం చేసి శాస్త్ర జ్ఞానావశ్యకత (17 ఫిబ్రవరి, 1963) అనే వ్యాసంలో ఇలా నిర్వచిస్తారు – "శాస్త్ర

జ్ఞానం యొక్క పరమార్థం నిజానికి, అబద్ధానికి తేడా కనిపెట్టడం”, దీనికి ఉన్న సామాజిక పార్శ్వాన్ని ఇలా వివరిస్తారు.

- దారిద్ర్యం, దోపిడి అనే భయంకర సాంఘిక వ్యాధుల మూలంగా, ఉన్న శాస్త్రజ్ఞానం ఉపయోగానికి రాకుండా పోతున్నది. (అంటువ్యాధులు- ఇమ్యూనిటీ, 1 జూలై,1956).
- నాగరికతను పెంపొందించే విజ్ఞానమంతటికీ సర్వోత్తమమైనది. ఆరోగ్యాన్ని కాపాడి పెంపొందించేది విజ్ఞానమే. (ఆరోగ్యమూ–శాస్త్ర జ్ఞానమూ, 15 జూలై 1956).

ఈ స్థాయిలో సైన్స్‌కు ఉండే సామాజిక కోణాలను గమనించిన రచయిత కుటుంబరావు ఒక్కరే అని నిర్ద్వందంగా మనం పేర్కోవచ్చు. ఈ మార్గంలోనే ఆయన రచనా ప్రణాళిక గొప్పది అని మనం వ్యాఖ్యానించడం.

‘పశుసంపదా, వాణిజ్యమూ వచ్చి బానిస జాతిని సృష్టించాయి. ఇనుము, బొగ్గు, పెట్రోలియం మొదలైనవి వచ్చి ఒక ధనిక వర్గాన్ని కొత్తగా సృష్టించి మిగిలిన వర్గాలను దానికి కనబడని బానిసలుగా చేశాయి’ – అని కుటుంబరావు ‘మానవ వంశ వృక్షం’ (1955)లో వివరిస్తారు. ఇది మనం తరచు ఆలోచించే విషయమే! దీనికి సైన్స్ అనేది ఒక ఆయుధంగా ఎవరి చేతిలో ఉందో గమనించాలి. శాస్త్ర విజ్ఞానం అనేది సామాజిక అంతరాలు- ఇటీవల కాలంలో సరికొత్త భాషలో ‘డిజిటల్ డివైడ్’ లా కల్పించకూడదు. సైన్స్ కోణంలో కుటుంబరావు సోషలిజాన్ని ఇలా వివరిస్తారు. – ‘సోషలిస్టు వ్యవస్థ అంటే.. సమస్త నాగరికతకూ ఆధారభూతమైన శాస్త్రజ్ఞానం ప్రజలపరం చెయ్యటం’ (జ్ఞానం–పరిణామం, 6మే, 1955)–అని. ఈ స్పృహతో చూసినపుడు సైన్స్ మానవ జీవితంలో ఎంత అవిభాజ్యమో సులువుగా బోధపడుతుంది. అపుడు మీరు కూడా కుటుంబరావు లాగా ‘శాస్త్ర విజ్ఞానం సాంఘిక స్వరూపంలో అడుగడుగునా విప్లవకరమైన మార్పులు తెస్తూ వచ్చింది’ అని మరోసారి నొక్కి చెబుతారు.




ఇప్పుడు పాపులర్ సైన్స్‌గా ప్రచారంలో ఉన్న పుస్తకాలను పరిశీలించండి. అందులో కేవలం సమాచారం ఉంటుంది. ఎలా వినియోగించుకోవాలో – యూసర్ మాన్యువల్ లాగా ఉంటాయి. వాడే మొబైల్ ఫోన్ దేనితో తయారుచేస్తారో మనకు తెలియదు, వాడి పారేసిన కంప్యూటర్ సామగ్రి ఎంత కాలుష్యం సృష్టిస్తుందో బోధపడదు. కంప్యూటర్ మన పని సులువు చేసిందని కూడా గమనించని మనం సామాజికంగా సాంకేతిక విజ్ఞానం ప్రభావం గురించి ఎందుకు పరికిస్తాం? ఆనాడే ఇటువంటి అవగాహన కోసమే కుటుంబరావు సైన్స్ కలం పట్టారు.

మన జాతికీనాడు సినిమాల కన్నా, కల్పనా సాహిత్యం కన్నా కూడా విజ్ఞానం, ప్రకృతి శక్తులను గురించి, ప్రకృతిని గురించి జ్ఞానం చాలా అవసరమని నండూరి రామమోహనరావు ‘విశ్వరూపం’ పుస్తకానికి రాసిన ముందుమాటలో చాలా స్పష్టంగా చెబుతారు. ‘శాస్త్ర విజ్ఞానానికి సామాజిక స్వరూపమున్న’ దని ఒక చోటా, ‘ఇది స్వతస్సిద్ధంగా సోషలిస్టు తత్వంగల’దని మరోచోటా, ‘శాస్త్ర పరిశోధన అంతర్జాతీయ స్వభావం గలది కూడానూ’ అని ఇంకోచోటా అంటారు. మరి ఈ సిసలైన సైన్స్ స్ఫూర్తిని పట్టుకుని తర్వాత వెలువడిన సైన్స్ రచనలు ఎన్ని? అనే ప్రశ్నకు ఎదురయ్యే సమాధానం తీవ్ర నిరాశను కల్గిస్తుంది. నిజానికి కుటుంబరావు సైన్స్ రచనలు- అర్ధ శతాబ్దం తర్వాత – నేడు మరింత అవసరమనిపిస్తోంది. టెక్నాలజీ అనేది వ్యవసాయం, వైద్యం వంటి వాటిలో కూడా ప్రవేశించి వాణిజ్యంగా రూపు ధరించింది. మరి వాణిజ్య పాచిక అయిన టెక్నాలజీ నేడు ఎవరి చేతిలో పాచిక! దీన్ని వివరించే టపుడు వారి చేతిలో ఉండే ఆయుధం ఎంత స్థాయిలో ఉందని తెలుసుకోవాల్సిన అవసరం రచయితలకు లేదా? దాన్ని కేవలం సైన్స్ రచయితలకే వదిలివేయడం ఎందుకు? తాము మాత్రం దానిని ఎందుకు స్వీకరించాలని వారూ భావించినట్టున్నారు. అందుకే ప్రస్తుతం పత్రికల్లో శాస్త్ర విజ్ఞానం అస్పృశ్యమైంది, అదృశ్యమైంది!

కుటుంబరావు దృష్టి వాస్తవికంగా ఉంటుంది. ‘మనం స్వతంత్రులమైనామని చంకలు గుద్దుకొని లాభం లేదు. బెదరు గొడ్లల్లే బతకకుండా అనివార్య మైన వాటిని తోసుకు తిరగడమో, అనివార్యం కాని వాటి నిర్మూలన కోసం పోరాడడమో నేర్చుకుని నిజమైన మనుషులల్లే బతకడం నేర్చుకో’వాలని – భయంతో బతకరాదు అనే వ్యాసంలో వ్యాఖ్యానిస్తారు. దేన్ని నిర్మూలించాలో, దేన్ని తోసుకు తిరగాలో మనకు స్పష్టత ఉండాలి. అంతేకాని పిరికిపందల్లా ఉండనక్కర లేదు. స్వార్థం జ్ఞానానికి ప్రబల శత్రువు అని చెప్పడమే కాక, శాస్త్ర జ్ఞానాభివృద్ధిని సాంఘిక స్వార్థం నిరోధించినట్టుగా మరేదీ నిరోధించలేదని కూడా స్పష్టం చేస్తారు. మరి ప్రస్తుతం రచయితలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ సాహిత్యాన్ని సృజించాల్సిన అవసరం చాలా ఉంది. ఎందుకంటే ఇప్పుడు ఈ సమస్య ఎంతో క్లిష్టమైంది కనుక.

కుటుంబరావు దృష్టి సైన్సు సామర్థ్యాన్ని అంచనా కట్టడంలో ఎంత వాస్తవికంగా ఉందో, దాని స్థానమూ, పరిమితులు గుర్తించడంలో మరింత వాస్తవికంగా ఉంది. ఈ పరిశీలనలు చూడండి–

- ప్రాణి సంబంధమైన పదార్థాల విషయంలో ‘జడ’ పదార్థాలతో పోలిస్తే ‘ప్రాణి’ పదార్థాల ఉత్పత్తి చాలా క్లిష్టంగా కన్పించింది. (సృష్టి–ప్రతిసృష్టి. 2 జూన్, 1956).
- మనిషి కేవలం శాస్త్రవిజ్ఞానంతోనే కాలక్షేపం చేయలేదు. (జ్ఞాన పరిణామం, 6 మే, 1955)
- శాస్త్ర జ్ఞానం మతానికీ, ఆధ్యాత్మిక చింతనకు శత్రువు కాదు. స్వార్థం జ్ఞానానికి ప్రబల శత్రువు. (శాస్త్ర జ్ఞానావశ్యకత, 17 ఫిబ్రవరి, 1963).
- ఆధునిక నాగరికతకు ఆయువుపట్టులుగా ఉన్నవి మూడింటిని చెప్పుకోవచ్చు. కళలూ, మతమూ, శాస్త్రజ్ఞానమూ (శాస్త్ర ప్రయోజనం 15 అక్టోబర్, 1960).
- ‘మీరు జ్ఞాన శాస్త్రం సంపాదించండి’ అని ఉద్బోధించినంత మాత్రాన ప్రజల మనస్సు లగ్నం కాదు... అసలు కీలకం శాస్త్రాన్ని ప్రజల జీవితంలో ప్రతిష్ఠాపన చెయ్యటంలో ఉంది. అది సోషలిస్టు వ్యవస్థలో సాధ్యపడినట్లు వర్గ వ్యవస్థలో సాధ్యపడదు’ (సోషలిస్టు వ్యవస్థ–1

అక్టోబర్, 1961).

కుటుంబరావు సైన్స్ రచనల ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఏ మాత్రం అవకాశమున్నా సైన్స్ రచనలు చేశారని గమనించవచ్చు. 1955-56 ప్రాంతంలో ఆయన సైన్స్ రచన శిఖరస్థాయిలో ఉంది. విశాలాంధ్ర, యువజన పత్రికలు వేదికలుగా మారాయి. చిన్న పత్రిక, పెద్ద పత్రిక అనకుండా రాశారు. అలాగే పిల్లలకూ, యువతకూ, అందరికీ అని కూడా ప్రయత్నం చేశారు. వ్యాసాలను నిడివిలో, శైలిలో తేడాలు గుర్తించ వచ్చు. తెలుగుతల్లి పత్రిక (మే-జూన్, 1945)లో ప్రచురింపబడిన 'పరమాణువులు' అనే రచన చిన్న పరమాణువు, పెద్ద పరమాణువు మధ్య సంభాషణగా చాలాభాగం సాగుతుంది. అవసరమైన చోట పదాలు రూపొందించుకుంటూ సైన్స్ రచన సాగిస్తారు. ఇది ఆయన సాహిత్య శైలికి భిన్నం కాదు. వైజ్ఞానిక భావాలు సినిమా సంభాషణల ధోరణిలో, ప్రేమకథల ధోరణిలో ఉండవని చెబుతారు కూడా! అయితే సరళంగా, హృద్యంగా మాతృభాషలో సైన్స్ రచన ఉండాలంటారు కుటుంబరావు.

కొత్త విషయాలు వచ్చి చేరగానే అంతవరకు ఉన్న సమాచారం సమగ్రంకాదనో లేదా సరికాదనో తేటతెల్లమవ్వవచ్చు. అదే సైన్స్ విషయంలో మరింత వాస్తవం. ఎందుకంటే సైన్స్‌రంగంలో వచ్చిపడే పరిశోధనల వేగం చాలా ఎక్కువ.

అందుకే 'జన సామాన్యానికి వైజ్ఞానిక విషయాలు అందించేటప్పుడు రచన విస్తృతంగా నడవాలిగానీ, లోతులకు పోయి ప్రయోజనం లేదు. పారిభాషిక పదాలూ, సాంకేతిక విలువలు ఎంత తక్కువగా ఉంటే పాఠకుడికి అంత సౌకర్యంగా ఉంటుంది' అని 'ప్రాణులూ – ప్రపంచం' అనే తన పుస్తకం ముందుమాటలో అంటారు. తన గురించి వివరిస్తూ 'పాఠకుల కొరకు రచించే వైజ్ఞానిక గ్రంథాలను చాలాకాలంగా చదువుతూ ఉండిన' వాడిగా, 'తాను తెలుసుకున్న విషయాలను తోటివారికి అందించడమే' ఆశయంగా సాగేవాడినని చెప్పుకుంటారు.

కొత్త విషయాలు వచ్చి చేరగానే అంతవరకు ఉన్న సమాచారం సమగ్రంకాదనో లేదా సరికాదనో తేటతెల్లమవ్వవచ్చు. అదే సైన్స్ విషయంలో మరింత వాస్తవం. ఎందుకంటే సైన్స్‌రంగంలో వచ్చిపడే పరిశోధనల వేగం చాలా ఎక్కువ. అందువల్లనే సైన్స్ విషయాలు చాలా త్వరగా పాతబడతాయి లేదా పాత విషయాలను పూర్తిగా మార్చవలసి ఉంటుంది. కుటుంబరావుగారు సైన్స్ రచన ప్రారంభించే సమయంలో ప్రపంచవ్యాప్తంగా భౌతికశాస్త్ర సంబంధమైన, రసాయన శాస్త్ర సంబంధమైన విషయాలు చాలా విరివిగా జరగడమే కాక, విపరీతమైన ఆసక్తి కలిగించే స్థాయిలో ఉన్నాయి. అందువల్లనే కొన్ని పాదార్థిక అంశాలను వివరించే కుటుంబరావు వ్యాసాలు ప్రస్తుతం పాతబడినట్టు అనిపిస్తుంది. అది ఏ సైన్స్ రచయితకైనా తప్పని పరిస్థితి.

కుటుంబరావుగారి సైన్స్ రచనల గురించి పెద్దగా పరిశీలన జరిగినట్టు కనబడదు. అయితే 1982లో వెలువడిన 'భావవిప్లవకారుడు కొడవటిగంటి' అనే సంకలనంలో జె.మనోహరరావుగారు సామాజిక నేపథ్యంతో పరిచయం చేసిన విజ్ఞాన శాస్త్రం అనే వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో ఆయన రాసిన ఈ విషయాలు పరిశీలిద్దాం.

"…. శాస్త్రజ్ఞాన పరిశోధనా ఫలితాల క్రోడీకరణలూ, వాటిపై వేసే అంచనాలూ మన మూల్యాత్మకమైన తీర్పులను (వాల్యూ జడ్జిమెంట్స్) కాకుండా వాస్తవ పరిస్థితిని, సామాజిక ఉత్పత్తి సంబంధాలను, వర్గ సంబంధాలను ప్రతిబింబించేవిగా ఉండాలి. అలా జరగనప్పుడు అది గతి తర్కానికి అతీతంగానూ, ఆది భౌతికానికి సమీపంగానూ కన్పిస్తుంది. అట్టి పొరపాటు కుటుంబరావు కూడా చేశాడు. అమెరికా, రష్యాలు 1960 ప్రాంతంలో జరుపుతుండిన అంతరిక్ష ప్రయోగాలను బేరీజు వేస్తూ – అమెరికా, రష్యాను అందుకోవడానికి అనేక సంవత్సరాలు పట్టవచ్చునని, రష్యా కన్నా ముందుగా అమెరికన్లు చంద్రమండలం మీద దిగే అవకాశాలు లేవని, అమెరికా వారు ఒప్పుకుంటున్నారు. – అని అంటాడు ఒక చోట. కానీ అట్లా జరగలేదు. ఒకవేళ అట్లా జరిగినా అదంత ముఖ్యమైన విషయం కాకపోవును. ఎందుకంటే శాస్త్ర విజ్ఞానంలో ఒక దేశానికి గల అధిక్యత రుజువయ్యేది ఈ విధంగా కాదు. గతి తార్కిక దృష్టితో చూసినప్పుడు కేవలం పరిశోధనల్లో ఎవరు ముందున్నారు అన్న దానికన్నా అవి ఏ వ్యవస్థలో ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి అన్న దానికి ప్రాముఖ్యతని ఇస్తాం. ఏ సమాజంలో అయినా శాస్త్రవిజ్ఞాన దశను, దిశను నిర్ణయించేది ఆ సమాజంలోని సామాజిక ఉత్పత్తి సంబంధాలే. అందుకే శాస్త్ర విజ్ఞానానికి వర్గ స్వభావం ఉన్నదా అన్న ప్రశ్నకు ఇప్పుడు సమాధానాన్ని తరచిచూడవలసి ఉన్నది.

శాస్త్ర విజ్ఞానమంటే ప్రకృతి రహస్యాలను కనుగొని స్వార్థరహితమైన రీతిలో సమాజపరం చేయటమే కనుక ఇది తటస్థమైనదని పలువురి నమ్మకం. అందులో కొంతమంది మార్క్సిస్టులు కూడా లేకపోలేదు. శాస్త్ర విజ్ఞానానికి వర్గ స్వభావం ఉంటుందన్న విషయం కుటుంబరావుకు తెలియదనుకోవడం కష్టం…"

ఇంతకుముందే అనుకున్నట్టు ఇంతవరకు కుటుంబరావుగారి సైన్స్ వ్యాసాల గురించి సరైన పరిశోధన లేదు కనుక ఇప్పుడైనా ఆ దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది.

ఏది ఏమైనా కుటుంబరావుగారు రాసిన సైన్స్ వ్యాసాల్లో సమాజం, కళలు, మతం, దైవం, విశ్వాసం, ప్రగతి, తాత్విక భూమిక వంటి కోణాలను స్పృశిస్తూ, వివరించిన వాటిని విడిగా తీసి ప్రచురించాల్సిన అగత్యం ప్రస్తుతం చాలా ఉంది. ఇటువంటి వ్యాసాలు విరసం ప్రచురించిన సైన్స్ వ్యాసాల్లోనే కాక సంస్కృతి, చరిత్రవంటి ఇతర సంపుటాల్లో కూడా మనకు కనబడతాయి. ప్రస్తుత సమాజంలో టెక్నాలజీని వాణిజ్యానికి, వస్తులోలతకు, కాలుష్యానికి వినియోగిస్తున్నాం. అయితే ఈ కోణాలేవీ తెలియకుండా మనం సైన్స్ టెక్నాలజీని పరిగణిస్తున్నాం. కుటుంబరావు తర్వాత ఏ సైన్స్ రచయిత కూడా ఈ దిశలో కృషి చేయలేదు కనుక– ఆయన సైన్స్ దృక్పథం నేడు చాలా అవసరం.

ఈ నేపథ్యంలో హేతువు, ప్రశ్న, ఫలితం, సమాజం అని ఆలోచించే కుటుంబరావు, గోపీచంద్, శ్రీశ్రీల వంటి సాహితీవేత్తల సాహిత్యంలోని సైన్స్ పార్శ్వం మరింతగా– నేటి అవసరాలకు తగ్గట్టుగా ప్రాచుర్యంలోకి రావాలి.

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com





గణపేశ్వర ఆలయం

# గణపురం గుళ్ళ నిర్మాత పసాయిత గణపతిరెడ్డి

మధ్యయుగాలలో ఆంధ్రదేశ చరిత్రలో కాకతీయరాజ్యం 10వ శతాబ్దంలో మొదలై 14వ శతాబ్దంలో ముగిసి పోయింది. మొత్తం తెలుగువారిని ఒక్కత్రాటికి తెచ్చి పాలించిన సాతవాహనుల తర్వాత కాకతీయులు రెండవవారు. కాకతీయులు తమను 'పరమాంధ్ర వసుంధర' పాలకులుగా శాసనాలలో పేర్కొన్నారు. (కూసుమంచి కొత్తశాసనం) వెన్నడు (వెన్నరాజు)తో మొదలైన కాకతీయరాజవంశం 2వ ప్రతాపరుద్రునితో ముగిసిపోయింది. (బయ్యారం శాసనం) బస్తర్లో పాలకులుగా వున్నవారిని మలికాకతీయులని చెప్పడానికి ఒకే శాసనం ఆధారంగా వుంది. మలికాకతీయుల చరిత్ర పరిశోధించాల్సిన అవసరం వుంది.



గణపతి రెడ్డి

కాకతీయులకు ఆ పేరు వచ్చినతీరు మీద చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. చారిత్రికాధారాలు కాకతీయులు తొలుత జైనమతానుయాయులుగా వున్నారని తెలుపుతున్నాయి. తర్వాత కాలాముఖాచార్యుల వద్ద దీక్షలు తీసుకున్న 2వ బేతన (క్రీ.శ.1076–1108) నుంచి అందరు కాకతీయులు శైవాన్ని ఆశ్రయించారు. కాని, వారి మంత్రులు, సామంతులు, సేనానులు, వారి పరివార జనాలు జైనాన్ని సేవించడం మానలేదు. జైనం, శైవం సమాంతరంగా నడిచాయి. కొన్నిచోట్ల శైవమతం తీసుకున్నవారు తమ స్వాధీన ప్రాంతాలలోని జైనబసదులను శైవాలయాలుగా పరివర్తన చేసారు.(ఉదా: బెక్కల్లు) జైనం మీద కొందరు పాలకులకున్న విశ్వాస, గౌరవాలను వారు నిర్మించిన దేవాలయాల బాహ్యకుడ్యాలపై జైనతీర్థంకరుల శిల్పాలను చెక్కించడం ద్వారా ప్రకటించుకున్నారు. (రామప్ప)

కాకతీయులు ఆలయనిర్మాణంలో కళ్యాణీ చాళుక్యుల నిర్మాణ పద్ధతులను అవలంబించారు. నక్షత్రాకారపు ఉపపీఠంపై గుడులు నిర్మించారు. ఏకకూట, ద్వికూట, త్రికూట, చతుష్కూట, పంచ కూటాలయాలు కట్టించారు. గుడులలో కళ్యాణమంటపం, అర్థమంటపం, మహామండపం, నందిమంటపం, రంగమంటపం, రెండంతస్తుల ద్వారమంటపాలు ప్రత్యేకం. దేవాలయపు గోడలను రెండువరుసలతో కట్టించడం అద్భుతనిర్మాణ విశేషం.

మొదటి ప్రతాపరుద్రుని కాలంలో తన పేరిట హన్మకొండలో నిర్మించబడ్డది రుద్రేశ్వర దేవాలయం. కూసుమంచిలో గణపతిదేవుని పేరుమీద గణపేశ్వరాలయం కట్టించబడ్డది. కాకతీయుల సామంతులు, మంత్రులు, సేనానులు తమపేరిట, తమ తల్లిదండ్రుల పేరిట నిర్మించిన దేవాలయాలెన్నెన్నో. పిల్లలమర్రి, నాగులపాడు అన్నారం, కొండపర్తి, గొడిసాల, ఇనుగుర్తి, నిడిగొండవంటి చోట్ల అద్భుతమైన కాకతీయశైలి దేవాలయాలు ప్రత్యేకం. పిల్లలమర్రి నుంచి గణపురం గుళ్ళ దాకా వారి, వారి అభిరుచుల మేరకు, ధర్మకార్యంగా నిర్మించినవే ఈ దేవాలయాలు.

కాకతీయులశైలి దేవాలయాలలో తొలుతగా చెప్పుకోతగినది హన్మకొండ వేయిస్తంభాలగుడి. దక్షిణాభిముఖంగా వున్న ఈ దేవాలయం త్రికూటం. అనన్యసామాన్యమైన ప్రతిభావిశేషాలతో శిల్పులు అతి రమణీయంగా చెక్కిన శిల్పాలు, మందిరాలు, దేవాలయ కుడ్యాలతో వాపీ, స్తూప పర్యంతం దేవాలయవాస్తుకు మచ్చుతునక.

వేయిస్తంభాలగుడి తర్వాత మరొక ప్రసిద్ధమైన కాకతీయ నిర్మాణం రామప్పగుడి. ఈ గుడి పెద్దప్రాకారం నడుమ భూమి నిర్మాణ పద్ధతిలో కట్టిన గుడి. ఈ రామప్పగుడిని కాకతీయరాజ్య ప్రతిష్ఠాపనాచార్యుడైన రేచర్ల రుద్రదేవుడు గణపతిదేవుని (క్రీ.శ.1199–1262)






*గణపేశ్వర ఆలయం - కోటగుళ్లు, గణపురం దేవాలయం ప్లాన్*

హయాంలో కట్టించి, శాసనం వేయించాడు. శాసనకాలం 1213. ఈ గుడి అంతకు ముందునుంచి ఎన్నేండ్లుగా కట్టబడుతున్నదో. రుద్రసేనాని కట్టించిన రుద్రేశ్వరాలయానికి (శాసనంలో పేర్కొన్నట్లు) రామప్పగుడి అనే పేరు తర్వాతకాలంలో వచ్చినట్లుంది. కారణం, ఆధారం అలభ్యాలు.

రామప్పగుడి మహామంటపం, మూడు ప్రవేశద్వారాలు, ప్రదక్షిణాపథంతో నిర్మాణమైంది. గుడి ఎదురుగా ప్రత్యేక నంది మంటపం, మరొకచోట శాసనమంటపం రామప్పగుడికే చెందినవి. దేవాలయ బాహ్యకుడ్యాలమీద శిల్పాలను పరిశీలించినపుడు శివుని పరివారం, గణపతి, భైరవుడు, గజధారలు, అశ్వధారలు, చతుర్దళ రత్నపుష్పాలు, కాలాముఖాచార్యులు, మదనికలు, నాగినులు, అలసకన్యలు, ఇంకా, ఇంకా అనేకమైన అందమైన అర్ధశిల్పాలతో పాటు జైనతీర్థంకరుని శిల్పాలు కనిపిస్తాయి. ఒకచోట గడ్డం, తలపాగా, కత్తి, పంచభుజాకృతి డాలు పట్టుకున్నయోధుని శిల్పం కనిపిస్తుంది. అతడు విదేశీయుడు, ఫ్రెంచ్ సైనికుడని, మార్కొపోలో అని కొందరు చరిత్రకారులు వ్యాఖ్యానించారు. మరొకచోట పెద్దపట్టాకత్తిని పట్టుకుని నిలబడిన వీరుని శిల్పముంది. ఈ శిల్పం దేవాలయ నిర్మాత రేచెర్లరుద్రుని గుర్తుచేసే శిల్పమనిపిస్తున్నది.

హన్మకొండకు 74కి.మీ.ల దూరంలో జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని గణపురం అనే ఒకనాటి కాకతీయుల నగరంలోని గుడులు కోటవున్న కోటగుళ్ళుగా పిలువబడుతున్నాయి. కట్కూరు దేవాలయం కూడా కోటగుళ్ళ శైలిలోనే నిర్మించబడ్డది. అక్కడకూడా మొత్తం 22 గుడులుండేవి. కోటగుళ్ళల్లో కూడా 22 దేవాలయాలు అగుపిస్తాయి. జైన సంప్రదాయంలో 24 తీర్థంకరులకు 24గుళ్ళుండడం చూస్తాము. అందులో ప్రధానంగా భావించే రుషభ, మహావీరులకు, మరొక తీర్థంకరుని కలిపి త్రికూటాలయం కట్టి, మిగతా తీర్థంకరులకు వేరుగా గుడులు నిర్మించేవారు. బెక్కల్లులో అందుకు ఉదాహరణగా గుడులు కనిపిస్తాయి. వరంగల్ కోటలో కూడా 24మంది తీర్థంకరుల చౌవీసి దేవాలయం ఆనవాళ్ళున్నాయి. దేవాలయ నిర్మాణవాస్తులో ఏనాటికానాడు చోటుచేసుకున్న కొంగ్రొత్త మార్పులతో కొత్త, కొత్త దేవాలయాలు నిర్మించబడ్డాయి.

గణపురం కోటగుళ్ళు నిర్మాణంలో ప్రత్యేకమైనవి. కాకతీయ ఆర్కిటెక్చర్‌కి మ్యూజియం వంటిది గణపురం గుళ్ళసముదాయం. ఈ గుళ్ళను గణపతిదేవుడే కట్టించినట్లు గణపురం చెరువు కూడా అతడే తవ్వించాడని ప్రతాపచరిత్రలో రాయబడ్డది. గణపురంలో దొరికిన 3 శాసనాలలో దేవాలయ ముఖమంటపంమీద చెక్కిన శాసనంలో 'శ్రీగిరినివాసి పండితారాధ్య సేవకుడైన విభూతిగౌరుడు' పేర్కొనబడ్డాడు. 2వ శాసనంలో ఈ గుళ్ళపేర్లు గణపేశ్వర, సూరేశ్వరుల దేవాయాలుగా చెప్పబడ్డవి. చెరువుగట్టుమీద ఆంజనేయుని విగ్రహం వద్ద వున్న 3వ శాసనంలో 'దుర్మతి ఆశ్వయుజ శుద్ధ 10 గురువారం రామయ కొడుకు కృష్ణయ' అని రాయబడి వున్నది. ఇవేవీ గుడినిర్మాణకాలాన్ని తెలిపేవి కావు. ఈ గుళ్ళను పాలంపేట రామప్పగుడులతో పోల్చిన చరిత్రకారులు కోటగుళ్ళు రామప్పగుడి కంటే ముందరివని అన్నారు. గణపురం గుళ్ళ ప్రణాళికా రచన, ఆర్కిటెక్చర్ లక్షణాలు రామప్పగుడిని పోలివుంటాయి. గణపురం దేవాలయ ప్రణాళిక శిలువాకారంలో వుంది. గర్భగృహం, అంతరాళం, సభామంటపం ఒకే సరళరేఖమీద వున్నాయి. గుడికి 3 ప్రవేశ ద్వారా లున్నాయి. సభామంటపానికి పడమర గర్భగృహ, అంతరాళా లున్నాయి. గర్భగృహం 14×14 అడుగులు, అంతరాళం 13.4 × 13.4 అడుగులు, ప్రధానాలయానికి దక్షిణంగా 48×48 అడుగుల స్తంభ మంటపం వుంది. దేవాలయం లోపలి వైశాల్యం 260×260 అడుగులు. ఈ దేవాలయానికి 12 అడుగుల ఎత్తైన ఉపపీఠం, అధిష్ఠానాలున్నాయి. పెద్దరాతికడీల నడుమ మట్టి, గులకరాళ్ళు నింపిన రెండుపొరల కట్టడాలు ఈ గుడిగోడలు. ఈ గుడికి రాతిప్రాకారం వున్న ఆనవాళ్ళు తెలుస్తున్నాయి. ప్రధానాలయానికి 25 అడుగుల దూరంలో రెండవ దేవాలయం వుంది. దాని ప్రణాళిక సమానమే. కొలతల్లో చిన్నది. దీని స్తంభమంటపం 15 అడుగుల ఎత్తున్న 60 ఇసికరాతి స్తంభాలతో నాట్య(రంగ) మంటపంగా నిర్మాణం చేయబడ్డది. ప్రధానాలయానికి బయట ఒకే సరళరేఖమీద 8 ఉపాలయాలున్నాయి. మరికొన్ని రెండు పెద్దగుడుల మధ్య వున్నాయి. వీటన్నింటికి విడి, విడిగా గర్భగృహ, అంతరాళాలున్నాయి.

హొయసలుల బాహుళ్య శిల్ప, నిర్మాణ విశేషాలు కాకతీయులు



రాయ గజకేసరి, సాలభంజిక, బ్రాకెట్ ఫిగర్స్ సాలభంజిక, గణపతి రెడ్డి – కొత్తగుళ్లు, గణపురం శాసనం

అనుసరించారు. ఉపపీఠం, అధిష్ఠానం, పభగ, వారండికబంధ, కపోత, వేది, కక్ష్యాసన, విమానాదులు కాకతీయులకాలంనాటి శిల్పులు తమదైన కొత్తశైలిలో నిర్మించారు. ఉపపీఠం మీద ప్రదక్షిణాపథం ప్రత్యేకంగా వుంది. పభగ, కుడ్యాలంకరణ అద్భుతంగా వుంది. తొలి చాళుక్యుల కాలంలో మొదలైన కపోత నిర్మాణశైలి గణపురం గుడులలో అత్యద్భుతంగా తీర్చిదిద్దబడ్డది. రెండురకాలైన కపోతాలు లోపలివైపున రంగులు వేసినట్లు కనిపిస్తుంటాయి.

కోటగుళ్ళలో పరివారదేవాలయాల విమానాలు ద్రవిడశైలిలో అగుపిస్తాయి. త్రితల, పంచతలాలతో కలశాలతో, నాగర విమానాల అమలసారికలతో అందంగా కనిపిస్తాయి. ఇటువంటి ఉపరినిర్మాణాలను భూమిజ రకం అని అపరాజితపృచ్ఛ, సమరాంగణ సూత్రధారలు పేర్కొంటున్నాయి. భూమిజ శిఖరం అంతస్తుల అమరికలో వుంటుంది. పెద్దపూసల మెడగొలుసును నిలువుగా విసిరినట్లు అగుపిస్తుంది.

గణపురం దేవాలయంలోని అంతరాళానికి పంచతారల పద్ధతిలో రెండువైపుల 5గురేసి ద్వారపాలకులు వుంటారు. పదుగురిలో ఇద్దరు మగవారు. త్రిభంగిమలో నిల్చుని నాలుగుచేతులలో త్రిశూలం, ఢమరుకం, గదలతో కనిపిస్తారు. స్త్రీల చేతుల్లో పూర్ణకుంభాలు, వింజామరలున్నాయి. ఉత్తరాశి 'మంగళఫలకం' మీద గజలక్ష్మిని చెక్కారు. ఆ పైన లఘు నాగరవిమానాలున్నాయి. ప్రధానదేవాలయం అంతరాళ ద్వారం పైన నటరాజు దేవీదేవతలతో కనిపిస్తుంటాడు.

రామప్ప, గణపురం గుళ్ళల్లో బ్రాకెట్ శిల్పాలుగా మలిచిన స్త్రీమూర్తులు సాలభంజికలు. యక్షిణులు. వీరిని అలసకన్యలని, మదనికలని, నాగినులని పిలుస్తుంటారు ప్రజలు. వీటిలో కొన్ని పాము ఒంపులదేహాలతో, నాట్యభంగిమలతో నిల్చుని కనిపిస్తాయి. వాటికి కళాత్మక సంబంధం తప్ప మరొకటి వుండదు. బేలూరు చెన్నకేశవాలయంలో 42 బ్రాకెట్ శిల్పాలున్నాయి. గణపురం గుడిలో సాలభంజికల శిల్పాలు కొన్ని మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే ఈ స్త్రీలు తెలుగుదేశపు స్త్రీలవలె కనిపించరు. వీరు శిల్పులు వచ్చిన ప్రాంతాలలోని స్త్రీలు కావచ్చుననిపిస్తుంది.

గణపురం దేవాలయపు బ్రాకెట్ శిల్పాలలో గజకేసరి వ్యాళులు కనిపించడం విశేషం. రామప్పలో ఇటువంటివి కనిపించవు. కాని, వరంగల్ కోటలోని శిల్పాలలోని గజకేసరి శిల్పాలు వేరుగా వుంటాయి. గణపురం గుళ్ళ బ్రాకెట్ శిల్పాలలో ఒక గజకేసరి కిరీట ధారియైన రాజశిరస్సుతో కనిపించడంవల్ల అది కాకతీయుల బిరుదం రాయగజకేసరి శిల్పమనిపిస్తుంది. నిజానికి ఈ వ్యాళులు సింహ, శార్దూల, గండకి, నర, కిన్నర మొదలైనవి 26 రకాలుగా వుంటాయి. ప్రతిదేవాలయంలో ఇటువంటి వ్యాళులుండడం తప్పనిసరి. దేవాలయ గోడలమీద ప్రత్యేకశిల్ప ధారలుంటాయి. వాటిలో విమానధార, పుష్పధార, అశ్వధార, గజధార, హంసధారలిక్కడ అగుపిస్తుంటాయి. గోడలమీద సుసునియపట్ట, హతసునియ, చౌకపుల పుష్పాలు చెక్కబడ్డాయి. దేవాలయపు బాహ్యకుడ్యాలమీద చామరధారిణులు, నృత్యాంగనలు, వాద్యకారులు, భైరవుడు, గణపతి, కాలాముఖా చార్యుడు, జైనతీర్థంకరుడు చెక్కబడ్డారు.

ప్రధానాలయం బయట కోష్ఠాలలో రెండు విగ్రహాలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. వాటిలో ఒకే రూపంతో, ఒకే రకమైన ఆహార్యంతో జారుముడి సిగతో, మెడలో హారాలతో, పట్టుధోవతికట్టి, కుడిభుజం మీద మోపి పట్టుకున్న పెద్దకత్తితో, పంచభుజాకృతి డాలుతో నిలబడిన యోధులు కనిపిస్తారు. ఇటువంటి శిల్పాన్ని పోలినది రామప్ప గుడి గోడల మీద కనిపిస్తున్నది. ఆయుధాలు సమానమే కాని, ఆహార్యంలో భేదమున్నది. ఈ వీరుడు కాకతీయ సేనాని రుద్రుని 3వ కొడుకైన పసాయిత గణపతిరెడ్డి కావచ్చుననిపిస్తున్నది.

దేవాలయం బయట కోటగుళ్ళవద్ద తవ్వకాలలో బయటపడిన విగ్రహాలను దిమ్మెలు కట్టి నిలబెట్టిన చోట ఒక శాసనం కూడా అగుపిస్తున్నది. దానిమీద సిమెంటుపడి శాసనాక్షరాలు మరుగున పడిపోయాయి. చదువగలిగినంత మేరకు శాసనపాఠాన్ని రాసుకున్నాను. ఈ శాసనం డిజిటల్ కాపీలతో నాకు యువ చరిత్రకారుడు అరవింద్ ఆర్య సహకరించాడు. శాసనంలో 'స్వస్తిశ్రీ గణపతిదేవ మహారాజు పృథివిరాజ్యము చేయంగాను పసాయిత గణపతిరెడి వారు... పసాయిత గణ(పతి)పురానను జయ' వరకు చదువగలిగాను. గణపతిదేవుని కాలంలో జయ(వైశాఖ శుద్ధ త్రయోదశి గురువారం) సంవత్సరాన్ని వెతికితే అది క్రీ.శ.1234



కాలముఖ తీర్థంకర, రామప్ప రుద్రసేనాని, రామప్ప వీరుడు

(ఏప్రిల్ 13 గురువారం)గా తెలిసింది. వారసత్వశాఖలో డిప్యూటీ డైరెక్టరుగా పనిచేసి ఇటీవల రిటైరైన ఎస్.రంగాచార్యగారిచ్చిన శాసన ప్రతిబింబాల వల్ల కోటగుళ్ళ గణపురంశాసనం పూర్తిపాఠం పొందగలిగాను. పురావస్తుశాఖవారు శాసనాన్ని పరిష్కరించిపెట్టారు కాని, శాసనం ప్రచురించబడలేదు. శాసనం గురించి ఎక్కడా రాయబడలేదు. మొదటిసారి ఈ శాసనం సాయంతో కోటగుళ్ళ నిర్మాతను, గణపురం నగర ఎవరిపేరన వెలసిందన్నది తెలుసుకోగలిగాను. నేలకొండపల్లిలో లభించిన పసాయిత గణపతిరెడ్డి మరొక కొత్తశాసనాన్ని చరిత్రకారులు కట్టా శ్రీనివాస్, రాగి మురళి, రాధాకృష్ణ, చంటిల సాయంతో ఈ రచయితే పరిష్కరించాడు. అది (నేల)కొండపల్లి చెరువుకట్ట మీది పోలకమ్మ మూలస్థానాని(గుడి)కి మహామండలేశ్వర కాకతీయ గణపతిదేవ మహారాజు నిజభృత్యుడైన రేచెల్ల(ర్ల) పసాయిత గణపతిరెడ్డి క్రీ.శ. 1240 మార్చి 26న ఇచ్చిన దానశాసనం.

దానికన్నా ముందరిదైన ఈ కోటగుళ్ళశాసనం ఒక గ్రానైట్ రాతిస్తంభానికి రెండుపక్కల చెక్కబడ్డది. శాసనస్తంభ శిఖరం మీద నందిశిల్పం వుంది. శాసనం మొదలయేచోట సూర్య, చంద్ర చిహ్నాల నడుమ గణపతిశిల్పం వుంది.

**శాసనపాఠం:**

**మొదటివైపు**

1. "స్వస్తిశ్రీ గణపతిదేవ
2. మహారాజు పృథివి
3. రాజ్యము చేయంగా
4. ను పసాయిత గణ
5. పతిరడి వారు...
6. పసాయిత గణ(పతి)
7. పురానను జయ సం
8. వత్సర వైశాఖ శుద్ధ త్రయో
9. దశిన బృహస్పతి వార
10. మునాండు ప్రతిష్టచేసి
11. న గణపతీశ్వర
12. .....
13. .....



శాసనం

**2వ వైపు**

14. ...రుగాలము పం
15. టను వపట్నగడ్డల..
16. ...పొలాన వెనుక
17. ....ధారవోసి
18. .....నారు......
19. ...తన గంటెల
20. ...య...రెడి...
21. ...
22. ...
23. ...
24. ...
25. ....



శాసనం

రామప్పగుడిని తండ్రి రేచెర్ల రుద్రసేనాని తన పేరన రుద్రేశ్వరాలయంగా క్రీ.శ.1213లో నిర్మిస్తే, గణపురం కోటగుళ్ళను కొడుకు పసాయిత గణపతిరెడ్డి కూడా తన తండ్రిలెక్కనే తన పేరన గణపతీశ్వరాలయాన్ని క్రీ.శ.1234లో నిర్మించాడు. రామప్పగుడివున్న పాలంపేట రుద్రునిపేరిట రుద్రవరం కాలేదు, కాని కోటగుళ్ళున్న గణపురం పసాయిత గణపురంగానే వెలసింది.

**ఆధారాలు:**


1. *Y.Gopal Reddy - The Ghanapur Group of emples- Edit: VV KrishnaShastry*
2. *డా. ఈమని శివనాగిరెడ్డి, చరిత్రకారుడు, స్థపతి- కాకతీయ దేవాలయాల నిర్మాణంపై నోట్స్ (రచయితకు లేఖ)*
3. *ఎస్.రంగాచార్యులు, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, వారసత్వశాఖ- వారిచ్చిన గణపురం శాసన ప్రతిబింబాలు*
4. *కర్టెసీ ఆఫ్ అరవింద్ ఆర్య, తెలంగాణా యువ చరిత్రకారుడు- రామప్ప గుడికుడ్యాల మీది కొన్ని ఫోటోలు.*
5. *గణపురం కోటగుళ్ళ సహయాత్రికులు మిత్రులు, చరిత్రకారులు కట్టా శ్రీనివాస్, కట్టా జ్ఞానేశ్వర్, కొండ్రెడ్డి భాస్కర్, రెడ్డి రత్నాకర్ రెడ్డి, తాళ్ళపల్లి సదానందం, నందకిశోర్, వంశీధర్ రెడ్డి*


*అందరికి ధన్యవాదాలతో...*

– శ్రీరామోజు హరగోపాల్, m : 99494 98698
e: akshara25@gmail.com

# భూపరిమాణ శాస్త్రం - సర్వేల విధానం!

## (Geodesy - Method of Surveys)

*(గత సంచిక తరువాయి)*

### జార్జి ఎవరెస్టు యుగం :

విశ్రాంతి నుంచి 1822 అక్టోబర్‌లో తిరిగి వచ్చిన ఎవరెస్టు అకోలా కేంద్రంగా పడమరన గల పూణే నుంచి బొంబాయికి సర్వే చేపట్టాడు. ఈ బొంబాయి సర్వేను ఎవరెస్టు అవమానంగా భావించాడు. నిజానికి ఉత్తరాది మహాచాపం ఎవరెస్టు చేయాలని అనుకుంటే, దాన్ని డి.పెన్నింగ్‌కు అప్పజెప్పారు. ఇంతలోనే లాంబ్టన్ మరణించడంతో మహాచాపం బాధ్యతతో పాటు, మిగతా సర్వేలకు అధిపతి అయ్యాడు. ఇలా 1823 మార్చిలో ది గ్రేట్ ట్రిగ్నామెట్రికల్ సర్వేకు **సూపరింటెండ్**గా నియమించబడ్డాడు. లాంబ్టన్ మరణించిన తర్వాత కనీసం సిబ్బందిని పరామర్శించ కుండా, వారిని తిడుతూ హైదరాబాద్ కార్యాలయం లోని సర్వే గణన రికార్డుల, పరికరాల భద్రత విషయాన్ని చూసుకున్నాడు. దీంతో రాబోయేది కష్టకాలమని భావించిన డా॥ వొయిసె, డి.పెన్నింగ్ తదితరులు ఎవరెస్టును ఓ పులిలా భావించేవారు. సర్వేను విడిచి వెళ్ళుతామని మొరాయించారు. వారు భయపడినట్లుగానే యల్లాపురం జ్వరంతో డా॥ వొయిసె కలకత్తాకు వెళ్ళుతుండగా మార్గ మధ్యలోనే చనిపోయాడు. లాంబ్టన్ ఉప అసిస్టెంట్ విలియమ్ రొస్సెన్‌రోడ్ రాజీనామా చేసాడు. చేసేది లేక డి.పెన్నింగ్‌ను కనీసం ఒక సంవత్సరం పాటు సర్వేకు సహకరించాలని ఎవరెస్టు కోరాల్సి వచ్చింది. ఇంతలోనే ఎవరెస్టు యల్లాపురం మలేరియాకు గురయ్యాడు. డాక్టర్లు మద్రాసు వెళ్ళి విశ్రాంతి తీసుకొమ్మన్నా వినకుండా 1823 అక్టోబర్‌లో నాగపూర్‌కు, ఎలిచిపూర్ మౌల్యరేఖ దగ్గరకు వెళ్లాడు. అప్పటికి తొమ్మిది నెలలుగా (లాంబ్టన్ మరణం తర్వాత) డి.పెన్నింగ్‌తో సహా మిగతా సిబ్బంది ఎలాంటి పనిలేకుండా వున్నారు. ఎవరెస్టు మద్రాసు వెళ్ళితే ఈ సిబ్బంది ఎవరిదారిన వారు సర్వేను విడిచి వెళ్ళిపోతే కొత్తవారిని నియమించుకోవడం, వారికి శిక్షణ నివ్వడం కష్టం. అలాగే, ప్రభుత్వం సర్వేపై పునరాలోచన చేయవచ్చు అనేది ఎవరెస్టు ఆలోచన.



### సిబ్బంది మరణాలు :

*సర్వే మొత్తం జ్వరాలతో, రోగాలతో, నొప్పులతోనే సాగేవి. వరంగల్ ములుగు ప్రాంతంలో సర్వే జరుగుతున్నప్పుడు 150 మంది జ్వరపీడుతు లయ్యారు. ఇందులో 15 మంది మృత్యువాత పడ్డారు. అలాగే నైజాం ప్రాంత సర్వేలో దాదాపు 5 గురు సర్వేయర్లు చనిపోయారు.*

*లాంబ్టన్, రాబర్ట్ కొలెబ్రూక్, డా॥ వొయిసెలు ఈ సర్వేకు బలయ్యారు. ఆగ్రాకు దక్షిణాన సర్వే జరుగుతుండగా అయిదుగురి సర్వే సిబ్బందిని పులులు లాక్కెళ్లి చంపేసాయి. వాస్తవ గణాంకాలు పూర్తిగా లేవు. అందుకే ఎంతమంది బలి అయ్యారో తెలియదు.*

### పక్షవాతం వచ్చినా సర్వేను కొనసాగించిన ఎవరెస్టు :

ఎవరెస్టు కాళ్ళు చేతులు చచ్చుబడి పోయాయి. ఇద్దరు సహాయకులు జనిత్ (Zenith) సెక్టారులో కూర్చోబెట్టాలి. తిరిగి దించాలి. అలాగే థియోడలైట్ నిలువు చక్రము స్క్రూ తిప్పటానికై, ఎవరెస్టు ఎడమ చేతుని ఒకరు ఎత్తి పట్టుకోవాలి. ఇలా ఆరు నెలల పాటు పల్లకిలో ఆయన్ని మోయాల్సి వచ్చింది. అయినా ప్రతి మౌల్య రేఖ రెండు చివరల నుంచి అక్షాంశ రేఖాంశాలకు **మూడు వందలకు** పైగా పరిశీలనలు చేసాడు.

### ఉత్తర దిశగా చాపం పొడగింపు :

ఓ వైపు ఆరోగ్య సమస్యలున్నా, సూపరింటెండ్‌టుగా ఎవరెస్టు మనోబలాన్ని పొందాడు. చివరిసారి లాంబ్టన్ గుర్తించిన ఎలిచ్‌పూర్ మౌల్యరేఖను (మధ్యభారత్) ఉత్తరాన ఝాన్సికి ఈవలగల సిరోంజి పట్టణం దాకా పొడగించడమేకాక, వీటి మధ్యన గల 20 ట్రిగ్నామెట్రికల్ సర్వేస్థానాలకు స్వయంగా వెళ్ళి కోణాన్ని తీసుకున్నాడు. నర్మదానది ఉపఖండాన్ని ఉత్తర, దక్షిణంగా రెండుగా చీల్చినట్లు, 320 కి.మీ. ఈ మహాచాపం కూడా ఉపఖండాన్ని రెండుగా చీల్చినట్లుగా వుంటుంది. ఈ సర్వేకి రెండు సం॥లు పట్టింది. ఈ భూ భాగం సర్వేకి ఎంత ముఖ్యమో, బ్రిటీషు పరిపాలనకు అంతే సౌలభ్యం.

ఢిల్లీ దిశగా మహాచాపాన్ని హెూషంగాబాద్ పట్టణం దగ్గర నర్మదా నదిని దాటించారు.

తర్వాత భోపాల్‌ను, సిరోంజిని దాటిన మహాచాపం 78 డిగ్రీల రేఖాంశంపై ముందుకు సాగుతున్నది. ఇక్కన్నుంచి పారే **బెత్వానది** ఒక్కటే ఈశాన్యంగా ప్రవహించి, త్రివేణి సంఘానికి ముందు **యమున**లో కలుస్తున్నట్లు సర్వే బృందం గుర్తించింది. అంటే, హిమాలయ జనిత గంగా నదిలో దక్షిణ భాగం నుంచి కలిపే నది ఇదొక్కటే! సిరోంజి నుంచి 300 కి.మీ. దూరాన గల ఆగ్రాకు, అక్కన్నుంచి ఢిల్లీ హైరోడ్‌కు చాపాన్ని పొడగించాలనేది ఎవరెస్టు సంకల్పం. నర్మదా నది మొసళ్ళకు ఆలవాలమైతే, మధ్య భారత్‌లో పులుల భయం. అయినా, తమ ప్రయాణపు ఏనుగల్ని, గుర్రాల్ని, నర్మదానదిలోకి వదిలితే, అవి సురక్షితంగా నదిని దాటాయి. పులుల నుంచి భయంకన్నా, సిబ్బంది ఎవరెస్టునే పులిగా భావించారట!

తిరిగి 1824 సెప్టెంబర్‌లో ఎవరెస్టుకు జ్వరం తిరగబెట్టింది. పల్లకిలో కూడా ప్రయాణం ఇబ్బందికరంగా వుంది. మళ్ళీ సెలవుపై పోవాలనింపించినా, సిరోంజ్ మౌల్యరేఖ కొలత చేయకుండా, భారత్ సరిహద్దుల వరకు మహాచాపం చేర్చినట్లు ప్రకటించకుండా వెళ్లిపోవడానికి ఎవరెస్టుకు మనస్సు అంగీకరించలేదు. పట్టుదలతో 1824-25 మధ్య కాలంలో సిరోంజ్ మౌల్యరేఖ రెండు చివర్ల మధ్యన చక్రాల బండిలో అనేకమార్లు తిరుగుతూ, ప్రతి కొలతను పర్యవేక్షిస్తూ, కచ్చితత్వంకు ప్రాధాన్యతనిస్తూ గణన చేసాడు. 1825 ఫిబ్రవరి 10న సిరోంజ్ దగ్గర క్యాంపును తుఫాన్ తాకి, గుడారాల్ని, పరికరాల్ని చిందరవందర చేసింది. బారోమీటర్ (పాదరస) పాడైంది. థియోడలైట్ ఒక స్క్రూ విరిగింది. సంవత్సరం చివరినాటికి మౌల్యరేఖ పూర్తి చేసారు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో ఇంగ్లాండ్ వెళ్ళి అయిదు సంవత్సరాల దాకా తిరిగి రాలేదు. పోతే, సర్వేకు సంబంధించిన రికార్డుల్ని వెంట తీసుకెళ్ళి నివేదికల్ని రాసుకున్నాడు. అలాగే సర్వేకు సంబంధించిన మెరుగైన కొత్త విషయాల్ని తెలుసుకున్నాడు. కొత్త పరికరాన్ని మార్పులతో, తిరిగి తయారు చేయించి ఈస్టిండియా కంపెనీ అనుమతితో కొన్నాడు. పగటిపూట సూర్యకాంతితో ప్రతిబింబించే దర్పణాల్ని, రాత్రిపూటకు అనుకూలమైన దీపాల్ని లండన్‌లో చూసాడు. అప్పుడు ఐర్లాండ్‌లో కూడా సర్వే జరుగుతున్నది. దాని పద్ధతుల్ని ఎవరెస్టు పరిశీలించాడు. గొలుసులకు బదులుగా సంకోచ, వ్యాకోచాలకు గురికాని, కొలత కడ్డీలను చూసాడు. 1830లో ఇండియాకు వచ్చేముందు వాటిని పరీక్షించుకున్నాడు. 1831లో కలకత్తా చేరిన తర్వాత 10 కి.మీ. కలకత్తా మౌల్యరేఖను కడ్డీలతో తిరిగి కొలిచి, సంతృప్తి పడ్డాడు. ఎవరెస్టు సెలవుపై వెళ్ళిన కాలంలో మహాచాపం సిరోంజి దగ్గరనే ఆగిపోయింది. బదులుగా, లాంబ్టన్‌తో పనిచేసిన **జోసెఫ్ ఆలివర్‌ను, విలియమ్ రొస్సెన్‌రోడ్‌**లను సిరోంజి నుంచి కలకత్తా వైపుగా (తూర్పు) త్రిభుజీకరణ చేయమన్నాడు. మహాచాపం బాధ్యతను మాత్రం ఇవ్వలేదు. కలకత్తా శ్రేణి 1100 కి.మీ. దూరమే కాక, భయంకరమైన అడవిగుండా సాగాలి. రొస్సెన్‌రోడ్ పిల్లలిద్దరు చనిపోయారు. ఎవరెస్టు ఇంగ్లాండ్ నుంచి తిరిగి వచ్చేనాటికి కలకత్తా త్రిభుజీకరణ గంగానది డెల్టా (కలకత్తాకు 110 కి.మీ. దూరం) వరకే పూర్తైంది.

అయితే ఈ సర్వేకి 0.9 మీటర్ల సర్వేకు వాడే థియోడలైటు బదులుగా తక్కువ స్థాయిగల 0.45 మీటర్ల థియోడలైట్‌ను ఆలివర్ ఉపయోగించాల్సి వచ్చింది. దీంతో 40 కి.మీ. వరకే ఈ తక్కువ స్థాయి థియోడలైట్ పనిచేసేది. దీంతో ఏర్పర్చిన త్రిభుజాలు ఇరుకుగా వచ్చాయి. మొత్తం (1100 కి.మీ.) దూరంలో ఒక్క మౌల్య రేఖ కూడా కొలవని సర్వే ఇదొక్కటే! అంత కచ్చితత్వంలేని ఈ శ్రేణినే ఎవరెస్టు ఆధారంగా చేసుకొని, అనేక అక్షాంశ శ్రేణులతో హిమాలయాల వరకు సర్వేను తీసుకెళ్ళడం ఆయన పనితనానికి నిదర్శనం.

నిజానికి ఈ సర్వే మార్గం అనుకూలమైంది కూడా కాదు. పెద్ద పెద్ద చెట్లతో, పులులతో వున్న అడవి మార్గం. నిచ్చెనకు నిచ్చెనలకు కట్టి 18-24 మీ. ఎత్తుకు ఎక్కి చూసినా దృష్టి సారించని స్థితి. ఎండుటాకుల చప్పుడైనా, పులులని భయపడి సిబ్బంది పారిపోయే వారు. టెలిగ్రాఫ్ లేకముందు, బురుజుల ద్వారా సంకేతాల్ని పంపే వ్యవస్థ నాడు దేశంలో వుండేది. అలాంటివే కలకత్తా శ్రేణిలో వుండడంతో ఆలివర్, రొస్సెన్ రోడ్‌లు వీటిని ఉపయోగించుకున్నారు. అయినా వీటికి కూడా కొంత మార్పులు చేయాల్సి వచ్చింది. అలాగే ఆగ్రా, ఢిల్లీ మీదుగా మహాచాపాన్ని హిమాలయాలకు పొడగించాలంటే మైదాన ప్రాంతాల్లో కూడా బురుజుల్ని నిర్మించాలి. (కలపతో నిర్మించే పరంజీ బురుజుల్ని కూడా కొన్ని ప్రాంతాల్లో నిర్మించారు.) కాని వీటికి చాలా కలప కావాలి. దాదాపు 27 మీటర్లు ఎత్తు వుండే ఈ బురుజులు గాలి వీచితే కూలిపోయేవి. అందుకే కట్టడపు బురుజులపై ఎవరెస్టు దృష్టి సారించాడు. వీటి నిర్మాణానికి ఇంజనీర్లు, కూలీలు, రాళ్ళు, సున్నం కావాలి. వీటికై 77,000 పౌండ్లు, ఇంతకన్నా ఎక్కువ జీతాలకు, కూలీలకు కావాలి. అధికారులు ఒప్పుకోక పోవచ్చు అని కలకత్తా నగరంలో రెండు సంకేతాల బురుజుల మధ్యన అధికారుల సమక్షంలో సర్వేను ప్రదర్శించాలనుకున్నాడు. మౌల్యరేఖకు ఉపయోగ పడాలంటే, దాదాపు 300 చెట్లు నరకాలి. పదుల సంఖ్యలో మట్టి మిద్దెల్ని తీసేయాలి. అడ్డం వచ్చే చెరువుల్ని పూడ్చాలి. దీనికి సమ్మతించని అధికారులు స్థలాన్ని మార్పు చేయమన్నారు. ప్రత్యామ్నయంగా కలకత్తానుంచి ఉత్తరానికి వెళ్లే హుగ్లినది ఒడ్డునగల బారక్‌పూర్ రోడ్డును ఎంచుకొని 10 కి.మీ. నిడివిలో రెండు 23 మీ. ఎత్తులో బురుజులు నిర్మించి, రద్దిని నియంత్రించి ఎడమవైపు

**ఇల్లు గూల్చుట - చెట్లు నరుకుట :**

*సర్వే ఓ సరదా వ్యవహారం కాదు. దృశా రేఖ, కోణాలు చక్కగా కనపడాలి. మౌల్యరేఖలు కచ్చితత్వంలో వుండాలంటే, వందలాది చెట్లను నరకాలి. అడ్డుగా వచ్చే ఇండ్లను కూల్చాలి. గుడులు, గోపురాలు, సర్వేలకు అడ్డంకిరాదు. ఇలా ఢిల్లీ తూర్పు ప్రాంత సర్వే సందర్భంగా 52 మిద్దెల్ని, 37 దాబాల్ని తొలగించారు. మిగతా ప్రాంతాలవి లెక్క లేదు. తంజావూర్‌లో గుడిగోపరాన్ని, అక్బర్ సమాధిపైగల గుమ్మటాన్ని తొలగించి సర్వేలకు వాడుకున్నారు.*

రోడ్డు మూసివేసారు.

1831 నవంబర్ 23న ఈ మౌల్యరేఖ కొలత ప్రారంభమైంది. పూర్తి కావడానికి రెండు నెలలు పట్టింది. 19.2 మీ. కొలత కడ్డీలతో మొత్తం 539 సార్లు విడివిడిగా కొలత చేసారు. అంటే రోజుకు సరాసరి 12 సార్లు. దీన్ని చూడడానికి, చివరి రోజున అధికారులతోపాటు ఏసియాటిక్ సొసైటి అధ్యక్షుడైన **జేమ్స్ ప్రిన్సెప్** (James Prinsep) ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. అధికారుల ముందు మొదటి భాగాన్ని మళ్ళీ కొలత చేసి, రెండు నెలల్లో ఏమైనా వ్యత్యాసం వుందా అని సరిచూసుకున్నాడు. రెండింటి మధ్యన సెంటీమీటరులో 0.066 భాగం అని తేలింది. ఇంగ్లాండ్‌లో కడ్డీలను పరీక్షించిన దానికంటే, మరింత కచ్చితత్వం రావడంతో ఎవరెస్టు, సిబ్బంది మహాదానంద పడ్డారు. రెండు నెలల తేడాను దృష్టిలో వుంచుకుంటే, కలకత్తా – ఢిల్లీల మధ్య దూరంలో 30 సెంటీమీటర్లు, భూమి చుట్టు కొలతలో 38 మీటర్ల తేడా రావచ్చని జేమ్స్ ప్రిన్సెప్ భావించి, సర్వే విధానాన్ని అభినందించాడు.



### సర్వేయర్ జనరల్‌గా జార్జి ఎవరెస్టు :

కలకత్తా మౌల్యరేఖ కొలత తర్వాత రెండు సంవత్సరాలలో (1831-33) ది ట్రిగ్నామెట్రికల్ సర్వేయర్ జనరల్‌గా పదోన్నతి పొందడంతో (స్థలాకృతి, రెవెన్యూ సర్వేలకు కలిపి) సర్వే విధానాల్లో అనేక కొత్తమార్పుల్ని చేసి అధికారుల అనుమతి పొందాడు. ముందు మహాచాపాన్ని హిమాలయాలదాకా తరువాత బెంగాల్‌లో త్రిభుజీకరణ చక్రాన్ని వీలైతే ఏకకాలంలో చేపట్టాలని, అయిదు సంవత్సరాలలో పూర్తి చేయాలని పథక రచన చేసాడు. ఇది జరగాలంటే ఒకటి, రెండు సర్వే బృందాలకంటే ఆరు బృందాలు ఒకేసారి పనిచేస్తే, అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని 1832 చివరినాటికి కొత్తవారిని తీసుకొని శిక్షణ నిచ్చాడు. బురుజుల నిర్మాణానికి, సిబ్బంది జీతాలకు అదనపు రొక్కానికై అధికారుల్ని ఒప్పించాడు. ఓవైపు ఆలివర్, రొస్సెన్‌రోడ్‌లు కొండల మధ్యన సర్వే చేసుకుంటూ పోతూ, గణాంకాల్ని కలకత్తాకు పంపించారు. మద్రాసు నుంచి డిపెన్నింగ్‌ని గణాంకాల్ని చేయడానికి పిలిపించాడు.

ఈ మార్పులలో దిట్రిగ్నామెట్రికల్ సర్వే ఓ మహా సంస్థగా రూపొందింది. దీనికి ఎదురులేని అధిపతిగా ఎవరెస్టు ఎదిగాడు. చరిత్రకారులు 1833-43 దశాబ్దాన్ని ఎవరెస్టు దశాబ్దంగా అభివర్ణించారు. 1833-34 శీతాకాలంలో సర్వే పడమరకు మళ్ళింది. హిమాలయ కొండలకు చేరాలని, గంగా నదికి ఎదురు ప్రయాణం మొదలు పెట్టించాడు. భారీ పరికరాలు మునగకుండా ప్రత్యేకమైన బోట్లను నిర్మించారు. అనువైన చోట బోట్లు దిగి రోడ్డు మార్గం పట్టారు. ఇలా అయిదు నెలల తర్వాత 2150 మీటర్ల ఎత్తులో డెహ్రాడూన్‌కు ఉత్తరాన గల ముస్సోరిని చేరుకున్నారు. ఇక్కడ ఎవరెస్టు తన శాశ్వత కార్యాలయానికై ఓ పాత ఎస్టేట్‌ను ఖరీదు చేసాడు. కార్యాలయం, గణన గదులు, రికార్డులు పెట్టడానికి ప్రత్యేక సౌకర్యాలను, పరికరాల భద్రతకు, ఇతర వాటిని తయారు చేయడానికి గోదాముల్ని, కర్మాగారాన్ని సిద్ధం చేయించాడు. సిబ్బంది వుండడానికి నిర్మాణాలు చేసారు.

ఎస్టేట్ నుంచి ఈశాన్య దిశలోని హిమనీనద శిఖరాలు, హిమాలయాల సుందర దృశ్యాలు గత 20 సంవత్సరాల అలసటను తీర్చాయి. మనస్సు కుదుట పడడమే కాక, అందరికీ ఆహ్లాదకర వాతావరణం స్వస్థతను చేకూర్చింది.

ఇప్పుడు ఎవరెస్టుతో పాటు అందరి చూపులు మనోహరమైన పర్వతాలపై నిలిచాయి.

### చివరి మజిలి హాతిపాం! నేడో శిథిలావస్థ శిఖరం!!

మానవుడి కృషికి ఓ ఆనవాలుగా, భారత్ ఉపఖండ రేఖాంశ మహా చాపానికి తుది వేదికగా, ఓ చారిత్ర ఘట్టంగా హిమాలయ పర్వతశ్రేణులను ప్రపంచంలోనే మొనగాడి శిఖరాలని చాటిచెప్పిన ఎవరెస్టు మలివిడిదియే ముస్సోరిలోని హాతిపాం! అనగా ఏనుగు పాదమని అర్థం! ఇది ఏనుగులకు ఆలవాలమైన శివాలిక్ కొండల్లో వుంది. 600 ఎకరాల విస్తీర్ణం గల ఈ ఎస్టేట్‌ను 1832లో ఓ బ్రిటిష్ కల్నల్ అమ్మగా ఎవరెస్టు కొన్నాడు. తన మహాచాప చివరి కొలతలను, గణనాలకు, హిమశిఖరాల పరిశీలనలకు ఇది అనువుగా వుంటుందని, అనుకూలంగా దాన్ని అభివృద్ధిచేసాడు. ప్రభుత్వం వ్యతిరేకించినా 1833లో కలకత్తాలోని సర్వే కార్యాలయంలోని ముఖ్య పరిపాలనా విభాగాన్ని, సర్వే సిబ్బందిని హాతిసాంకు మార్పించాడు. మిగత గణన విభాగం, మ్యాప్‌ల తయారి డిపెన్నింగ్ ఆధ్వర్యంలో కలకత్తాలోనే వుంచారు. ఎవరెస్టు మాటను కాదలనేని ప్రభుత్వం ముస్సోరి కన్నా డెహ్రాడూన్ బాగుంటుందని కార్యాలయాన్ని మార్చమన్నారు. ఎవరెస్టు ఒప్పుకొని మార్చాడు. అలాగే ఇప్పటికి **సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం** డెహ్రాడూన్‌లోనే వుండడం గమనార్హం!

### నూతన విధానాలతో ఉత్తరదిశ సర్వే!

లాంబ్టర్ మరణం, ఎవరెస్టు అనారోగ్య మార్పులతో సర్వే మధ్య భారత్‌లోని సిరోంజి దగ్గరే ఆగిపోయింది. దాదాపు ఎనిమిది సంవత్సరాల తర్వాత 1833 నవంబర్‌లో మధురకు ఎవరెస్టు

చేరుకున్నాడు. మహాచాపం ఉత్తర దిశకు పొడగించే దారిలో గ్వాలియర్, ఆగ్రా, ఢిల్లీలున్నాయి. ఈ ప్రాంతాలు సర్వేకు అనుకూలంగా లేకపోవడంతో **దృశారేఖ జాడతీయడం** (ray tracing) అనే కొత్త పద్ధతిలో చక్రసాధనాన్ని, దిక్సూచిని ఉపయోగించి దృశారేఖ స్థానాన్ని ఎవరెస్టు గుర్తించాడు. 1833-34లలో ఫతేపూర్ సిక్రినుంచి సర్వే చేస్తుండగా అక్బర్ సమాధిపై జండా కర్రను పెట్టాడు. ఇక్కన్నుంచి ఆయన కొత్త పద్ధతుల్ని ఉపయోగించాడు.

1834 ఏప్రిల్‌లో ప్రాథమిక త్రిభుజీకరణ ఢిల్లీకి చేరింది. ఇక్కడి నుంచి శివాలిక్ కొండలకు చేరింది. ఈ కొండ నుంచి చాపాన్ని డెహ్రాడూన్‌కు, ముస్సోరికి దించడానికై అడ్డంకిగా వున్న ఓ కొండను ఆరు మీటర్ల ఎత్తు తవ్వి తగ్గించాడు.

**మహాచాపాన్ని రష్యాకు పొడగించడం :**

భూమి నిర్దిష్ట ఆకారం తెలుసుకోవాలంటే, మహాచాపాన్ని టిబెట్ నుంచి ఉత్తర రష్యా భూభాగంలోని **నొవా జెంబ్లా** (Nova Zembla) కు పొడగించాలని ఎవరెస్టు తలిచాడు. కాని, బ్రిటీషు వారితో వున్న వైరుధ్యంతో అక్కడి ప్రభుత్వాలు (రష్యా, చైనా) సహకరించే అవకాశం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. ఇదే జరిగితే, విమానయాన, నౌకాయాన మ్యాపుల తయారి సులభమని, స్వాభావికమైన భూ పరిమాణం తెలుస్తే భూమిని భవిష్యత్ అవసరాలకు సరిగ్గా వినియోగించుకోవచ్చుననేది ఎవరెస్టు భావన!

**హిమాలయాల్ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన సర్వేయర్లు :**

ఇతిహాసాల్లో హిమాలయాల ప్రస్తావన వున్నా వాటి ఔన్నత్యం తెలియదు. అలాగే చాలా కావ్యాల్లో కనపడుతుంది. (వరూధిని / ప్రవరాఖ్యుడు). **మార్కోపోలో, డెసిడెరి ఫ్రాన్సిస్ యంగ్‌హస్బండ్** లాంటి వారు ఈశ్రేణులగుండా ప్రయాణించి, ఇవి మహా దుర్భేధ్యాలని ప్రకటించారు. జీవనదులైన యమున, గంగా, బ్రహ్మపుత్ర, సింధూలాంటి నదులకు భారత ఉపఖండం వైపు పుట్టినిల్లు. అలాగే ఉత్తరం వైపు మరికొన్ని నదులు ఆయా దేశాల్లో ప్రవహిస్తాయి. మానవ మనుగడకు, అనేక జాతులకు ఇవి ఆలవాలాలు.

బెంగాల్‌పై 1757లో దాడి తర్వాత కలకత్తా కేంద్రంగా బ్రిటీషువారి పాలన మొదలైంది. వీరి ఆక్రమిత భూభాగాల్ని సర్వే చేయాలని భావించిన నాటి గవర్నర్ **రాబర్ట్ క్లైవ్** (Clive) 1760లో మేజర్ **జేమ్స్‌రెన్నెల్** (Rennel)ను మొదటి సర్వేయర్ జనరల్‌గా నియమించాడు. 1800లో మద్రాస్ గవర్నర్ జనరల్ మూడు సర్వే బృందాల్ని ఏర్పాటు చేయగా, మూడోదాని విలియమ్ లాంబ్టన్ నాయకత్వం వహించాడు. ఈయనే ఈ మహాచాపం యొక్క రూపకర్త, సృష్టికర్త.

రెన్నెల్ తన సర్వేలోని భాగంగా భూటాన్ చేరి మంచుచే కప్పబడ్డ శిఖరాల్ని చూడగా, అందులో ఎత్తైన **చొమోలారి** (Chomo lhari) ఒకటి. అప్పటి దాకా **అరావత్, మౌంట్ బ్లాంక్, టైనిరైస్, చింబొరాజో, ఆన్‌డిస్** పర్వతాలే ప్రపంచంలో ఎత్తైన శిఖరాలుగా గుర్తించబడ్డాయి. కాని చొమోలారి వీటన్నింటికన్నా ఎత్తైనదని రెన్నెల్ మొదటిసారి ప్రస్తావించాడు. కలకత్తా హైకోర్ట్ జడ్జీ, ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాలును స్థాపించిన సర్ **విలియం జోన్స్** (Jones), భాగల్‌పూర్ నుంచి ఇదే శిఖరాన్ని 1784 అక్టోబర్ అయిదున చూసాడు.

అదే సమయంలో నేపాల్ ప్రభుత్వం రెండు సర్వే బృందాల్ని ఆహ్వానించింది. ఒక బృందంలో వున్న కల్నల్ **చార్లెస్ క్రాఫర్డ్** (Crawford) దిశాకోణాలతో, మౌల్యరేఖ ఉపయోగించి కొలతలు చేసి హిమాలయ శ్రేణులపై 1805లో ఓ నివేదికను తయారు చేసాడు. తర్వాత నేపాల్, బ్రిటీషు మధ్యన స్నేహ సంబంధాలు దెబ్బతినడంతో చాలా సంవత్సరాలు సర్వేకు అంతరాయం ఏర్పడింది.

పర్వత శ్రేణుల పరిశీలనపై అభిరుచిగలిగిన **రాబర్ట్ కొలెబ్రూక్** (Robert Cole Brooke), **హెన్రీ కొలెబ్రూక్** (Henery Cole Brooke)లు ఈ సర్వేకు పూనుకున్నారు. ఇందులో రాబర్ట్ సైనికుడు కాగా, హెన్రీ బీహార్‌లోని పూర్ణిమాజిల్లా అసిస్టెంట్ కలెక్టర్. మొదట హెన్రీ 1790లో వరుస పరిశీలనల్ని మొదలుపెట్టి, భాగాల్‌పూర్ నుంచి జోన్స్ చూసినదానికంటే 144 కి.మీ. ముందు కెళ్ళి ఆ శిఖరం చొమోలారి 7924 మీటర్ల ఎత్తులో వున్నట్లు నిర్ధారించాడు. తర్వాత ఈ పనిని రాబర్ట్ కొలెబ్రూక్‌కు అప్పజెప్పాడు. అప్పటికే బ్రిటీషువారి ఆధీనంలోకి వచ్చిన ఆక్రమిత, దత్తత మండలాల్ని (ఉత్తరాఖండ్) సర్వే చేయాలని ప్రభుత్వం భావించింది. రాబర్ట్ 1807-08లో పని ప్రారంభించాడు. కాని ఈ సర్వేను లాంబ్టన్ చేసిన విధంగా గణిత సూత్రాలకు లోబడి జరగలేదు. అయినా గంగానది ఉపనదులైన **గాహాగ్రా, రప్తి** ఉపనదులకు ఎదురొడ్డి పర్వత పాదాలను చేరుకున్నాడు. గోరక్‌పూర్ నుంచి మరియు నేపాల్ నైరుతి సరిహద్దున గల **పిల్‌భీట్** నుంచి పర్వత శ్రేణుల్ని పరిశీలన చేసాడు. అనారోగ్యంతో రాబర్ట్ 1808 సెప్టెంబర్ 21న 45 సంII వయస్సులో చనిపోయాడు. మిగతా సర్వేని తన సహాయకుడైన లెఫ్టినెంట్ **విలియం వెబ్‌కు** (Webb) అప్పజెప్పాడు.

*(తరువాయి వచ్చే సంచికలో)*

– డా॥ లచ్చయ్య గాండ్ల,
m : 9440116162
e : drglachaiah@gmail.com

**ఇన్‌స్ట్రుమెంట్స్ :**

*అరటన్ను బరువుగల థియోడలైటు, జనిత్ సెక్టార్లు. చక్రసాధనాలు, దిక్సూచి, గొలుసులు, కొలత కడ్డీలు, స్టాండులు వీటిని భద్రపరిచే పెట్టెలు.*

**గుర్తింపు లేని సూత్రదారులు :**

*ఈ మహాచాపం రూపకర్తలైన విలియం లాంబ్టన్ అతి సాధారణ మరణం పొంది హింగన్ ఘాట్‌లో అనామకుడిగా సమాధి అయ్యాడు. జార్జ్ ఎవరెస్టుకు, శిఖరం పేరు తప్ప ఎక్కడా ప్రాధాన్యత లేదు. చాంబర్స్ డిక్షనరి ప్రకటించిన 15వేల మంది ప్రపంచ మహామహుల్లో ఈ ఇద్దరికి స్థానమే లేదు.*

*అందుకే ఇది చదవాల్సిన కథనం. తెలుసుకోవాల్సిన జ్ఞానం. వృత్తి నిబద్ధతకు విలువెత్తు తార్కాణం!!*





# జీవాల్ని పోషించే పద్ధతులు

**వాణిజ్య పరంగా జీవాల్ని పెంచే విధానాలు**

గొర్రెలు, మేకల ఫారాలు పెంపకం ప్రారంభించేముందు, వాటిని పెంచే విధానాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాధారణంగా జీవాల పెంపకంలో ఎ. బ్రీడింగ్ ఫారాలు, బి. పొట్టేలు పిల్లల పెంపక ఫారాలు, సి. పునరుత్పత్తికి ఉపయోగపడే పొట్టేళ్ళ పెంపక ఫారాలు. ప్రారంభించడానికి వీలుగా ఉంటుంది. వాటి వివరాలు..



**ఎ. బ్రీడింగ్ (పునరుత్పత్తి) ఫారాలు :**

పునరుత్పత్తి కోసం ఉపయోగపడే, సంవత్సరం వయస్సు పైబడిన గొర్రెలు లేదా మేకల్ని ఫారాల్లో ఫౌండేషన్ స్టాకులాగా కొని, పెంచడం జరుగుతుంది. వీటిలో ప్రతి 20-25 గొర్రెలు లేదా మేకలకు, ఒక పొట్టేలు చొప్పున ఉంచాలి. తద్వారా జీవాలు ఎదకొచ్చినపుడు, మందలో ఉండే పొట్టేళ్ళు దాటడం, తద్వారా జీవాలు పొర్లి, పిల్లల్ని కనడం జరుగుతుంది. తద్వారా మంద వేగంగా అభివృద్ధి చెందుతుంది. సంవత్సరాంతం వరకు, ప్రారంభంలో ఉన్న జీవాల సంఖ్య, సుమారుగా రెట్టింపు అవుతుంది. ప్రతిఏటా పిల్లలు జన్మించడం, ఫారంలో జీవాల సంఖ్య వృద్ధి చెందడం జరుగుతుంది. జీవాల పెంపకందార్లు మగ జీవాల్ని ప్రతి ఏటా ఎక్కువ సంఖ్యలో, ఆడజీవాల్ని తక్కువ సంఖ్యలో మార్కెటింగ్ చేసుకుంటూ ఉండేవారు. ఆశించేవిధంగా ఆదాయం పొందడం వీలవుతుంది. కోళ్ళ పెంపకంలో, "లేయర్" కోళ్ళలోలాగా, ఈ పద్ధతిలో జీవాల పెంపకాన్ని నిరంతరంగా కొనసాగించవచ్చును. సంవత్సరం పొడవునా జీవాల్ని మార్కెటింగ్ చేసికోవడానికి వీలుంటుంది.

**బి. పొట్టేలు పిల్లల పెంపక ఫారాలు :**

మాంసోత్పత్తికి ఉపయోగపడే పొట్టేలు పిల్లలను సుమారు 3-4 మాసాల వయస్సులో కొనుగోలు చేస్తారు. ఈ పిల్లలను 6 మాసాలపాటు పోషించి, 9-10వ మాసం వయస్సులో మాంసం కొరకు అమ్మివేస్తుంటారు. ఈ విధంగా 8 మాసాలపాటు మాత్రమే పొట్టేలు పిల్లల పెంపకం ఉంటుంది. కొనుగోలు చేసే పొట్టేళ్ళు 10-15 కిలోల శరీరబరువున్నవి, 10వ మాసం వచ్చేసరికి 30-35 కిలోల బరువు తూగుతాయి. ఈ పద్ధతిలో ప్రతి జీవంపై ప్రస్తుత మార్కెట్ రేట్లనుబట్టి కనీసం వేయి రూపాయల ఆదాయం, 6 మాసాల్లో పొందే వీలుంటుంది. "బ్రాయిలర్" కోళ్ల పెంపకంలోలాగా




ఉండే, పొట్టేలు పిల్లల పెంపకంలో బ్యాచిలను సంవత్సరంలో కనీసం రెండు లేదా అంతకంటే ఎక్కువ పెంచే వీలుంటుంది. ప్రతి 6 మాసాల కొకసారి మాత్రమే పిల్లల్ని మార్కెటింగ్ ఒకేసారి చేసుకొనే వీలుంటుంది. అందువల్ల పండుగలు, జాతరలను దృష్టిలో ఉంచుకుని, మార్కెట్ కనుగుణంగా పిల్లల్ని పెంచడం ప్రారంభించాలి.

**సి. పొట్టేళ్ళు / పోతుల పెంపక ఫారాలు :**

మంద అభివృద్ధికి దోహదపడేందుకు పొట్టేళ్ళు పోతులను శ్రేష్ఠమైన జాతి లక్షణాలున్న వాటిని ఎంపిక చేసుకుని, పోషిస్తుండాలి. ఇవి బ్రీడింగ్ ఫారాల్లో క్రాసింగ్‌కు వినియోగపడతాయి. పునరుత్పత్తికి ఉపయోగపడే పొట్టేళ్ళు/ పోతుల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం, పొట్టేలు పిల్లల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం కంటే అధికంగా లభిస్తుంది.

బ్రీడింగ్ ఫారాలు, పొట్టేలు పిల్లల ఫారాలు ప్రారంభించే వారు, వారు పెంచే జీవాల సంఖ్య ప్రకారం పాకలు /షెడ్లు నిర్మించుకోవాలి. తిరిగేందుకు ఆరుబయట కొంత స్థలం వదలాలి. ఫారాల్లోపల, బయట మేత, నీటి తొట్లను ఏర్పాటు చేసి, అన్ని వేళలా మేత, నీరు అందుబాటులో ఉంచాలి. పశుగ్రాస్తాన్ని వేరు సాగు చేసి, పశుగ్రాసం, ఎండుమేతను చాఫ్‌కట్టర్‌తో ముక్కలు చేసి అందిస్తుండాలి. క్రమపద్ధతిలో టీకాలు వేయించడం, డివర్మింగ్ చేయించడం చేస్తుండాలి. కలుషిత ప్రాంతాలు, ఇతర అనారోగ్య మందలతో సంబంధం ఈ జీవాలకు లేనందున, ఫారాల్లో (పాక్షిక సాంద్రపద్ధతిలో) జీవాల్ని పెంచడం వల్ల, మరణాలు తక్కువగా ఉంటాయి. శరీర బరువు వృద్ధి రేటు ఎక్కువగా ఉంటుంది. మందలో పిల్లల సంఖ్య అభివృద్ధి కూడా ఎక్కువగా ఉంటుంది. తద్వారా గొర్రెలు, మేకల పెంపకం చేపట్టే ఔత్సాహికులు, పెంపకందార్లు మంచి ఆదాయం పొందగలుగుతారు.

**– ఆనబోయిన స్వామి,**
m : 9963 87 2222
e: swamyannaboina@gmail.com






# మార్పిడి

తెల్లారితే రంగుల పండగ. ఆ ఊరి పిల్లలంతా ఊరి మధ్యలో వేప చెట్టు కింద కూర్చుని ఉన్నారు. కొందరి మొహాలకి రంగులు పూసి ఉన్నాయి.

చెట్టా పట్టాలేసుకొని వస్తున్న రమణ, సాదిక్‌లు వారికి కనిపించారు. ఇద్దరూ కొత్త చొక్కాలు వేసుకొన్నారు. ఇద్దరి చొక్కాలు అచ్చు ఒకేలాగా ఉన్నాయి. వాటిని చూసిన వాళ్లెవరయినా సరే, ఒక చొక్కాలోంచి ఇంకో చొక్కా వచ్చిందని అనుకొంటారు. వాళ్ళ ఇళ్ళు కూడా ఎదురు బదురుగా ఉన్నాయి. రమణ తండ్రి, సాదిక్ తండ్రి ఇద్దరూ సన్నకారు రైతులే. వాళ్ళకు వచ్చే ఫలసాయం బొటాబొటిగా తినడానికి సరిపోతుంది. అనుకోని అవసరం ఏది వచ్చినా సరే అప్పు చెయ్యక తప్పదు వాళ్లకి. రమణకి తల్లీ, తండ్రి ఉన్నారు. సాదిక్‌కి తల్లి లేదు. తండ్రి మటుకు ఉన్నాడు.

కొత్త చొక్కాలు వేసుకొని పోతున్న వాళ్ళిద్దర్నీ చూశాక ఆ చెట్టు కింద కూర్చున్న పిల్లల్లో ఒక కొంటె కోణంగి ఇలా అన్నాడు. "అచ్చుగుద్దినట్టు ఇద్దరూ ఒకేలా ఉన్నారు. ఏదీ, కుస్తీ పట్టండి. బలంలో కూడా ఇద్దరూ ఒకేలాగ ఉంటారేమో చూద్దాం". అన్నాడు. మిగతా పిల్లలందరూ ఆ కొంటె కోణంగికి వంత పాడారు.

"ఏం కాదు. కుస్తీపట్టండి. ఊరికే సరదాకే, నిజంగా కాదు" అంటూ అరిచాడు.

సాదిక్ రమణవైపు చూశాడు. "నేను ఒప్పుకోను మా అమ్మ చంపేస్తుంది" అన్నాడు రమణ.

రమణ, తల్లికి ఉట్టినే భయపడటం లేదు. దానికి కారణం ఉంది. సాదిక్ కొత్త చొక్కా కుట్టించుకొన్నాడని తెలియగానే రమణ తల్లి దగ్గరకు పరిగెత్తి, తనకూ అలాంటి చొక్కా కావాలని మారాం చేశాడు. ఎన్ని విధాల బుజ్జగించినా వినక ఆవిడ ప్రాణం విసిగించేశాడు. వాడిపోరు పడలేక ఆవిడ సాదిక్ తండ్రి కొన్న గుడ్డలాంటిదే కొని, ఆ చొక్కా కుట్టిన దర్జీ దగ్గరే రమణకు చొక్కా కుట్టించింది. అది వేసుకొని రమణ బయటకు వెడుతుంటే –

"ఆ చొక్కా కోసం ఎంత మంకు పట్టుపట్టి, నన్నూ మీనాన్నను ఎలా విసిగించావో జ్ఞాపకం ఉంచుకో. చొక్కా చింపుకున్నా,

మాపుకున్నా నరిగిపోగులు పెడతాను జాగ్రత్త!" అంది.

అందుకే కుస్తీ పట్టడం ఇష్టంలేదు రమణకి. అదీగాక సాదిక్‌తో కుస్తీ పట్టడం అసలే ఇష్టం లేదు.

'రా, దమ్ముంటే నాతో కుస్తీకిరా' అంటూ పోకిరీ కుర్రాడయిన సాయి, రమణ చెయ్యి పట్టుకు లాగాడు. రమణ అతన్ని వదిలించుకోవాలని పెనుగులాడాడు. సాయి రమణను నేలమీదకు ఒక్క తోపుతోశాడు. రమణ దభీమని కింద పడ్డాడు. చుట్టూ ఉన్న పిల్లలందరూ గొల్లుమని నవ్వారు. సాదిక్‌కి కోపం ముంచుకొచ్చింది. వెంటనే సాయితో కలబడ్డాడు. ఇద్దరూ కొట్టుకున్నారు. సాదిక్ ముందు సాయి నిలబడలేక పోయాడు. సాదిక్ దెబ్బలకు తట్టుకోలేక పెద్ద పెట్టున ఏడుపు లంకించుకున్నాడు.



సాయి తల్లి వచ్చి తమందరి పని పడుతుందని ఆ పిల్లలకు తెలుసు. అందుకే అందరూ తలో దిక్కు పారిపోయారు. రమణ, సాదిక్‌లు కూడా పారిపోయారు. అలా కొంచెం సేపు పరిగెత్తాక ఒక చిన్న సందులోకి వచ్చారు. అక్కడ చూశాడు రమణ సాదిక్ చిరిగిన చొక్కాని. చొక్కా జేబు చిరిగిపోయి వేలాడుతోంది. ఆ చిరిగిన చొక్కాని చూడగానే వాళ్ళిద్దరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇంతలోనే సాదిక్ తండ్రి గొంతు వినిపించింది. "సాదిక్! చీకటిపడ్డా ఎక్కడ ఆడుతున్నావురా?" అంటూ ఆయన అరుస్తున్న అరుపులు వినిపించాయి.

ఆ అరుపులు వినగానే, వాళ్ళ ప్రాణం కొడిగట్టింది. ఆపుకుందామన్నా ఆగకుండా ఏడుపు ముంచుకొచ్చింది. జరగబోయే దేమిటో ఇద్దరికీ తెలుసు. సాదిక్ తండ్రి గనుక ఆ చిరిగిన చొక్కా చూస్తే సాదిక్‌ను గొడ్డును బాదినట్టు బాదుతాడు. మార్వాడీ దగ్గర డబ్బు వడ్డీకి అప్పు తెచ్చి సాదిక్‌కి ఆ చొక్కా కుట్టించాడు ఆయన.

"ఎవర్రా అక్కడ ఏడుస్తూంది." సాదిక్ తండ్రి మళ్లీ అరిచాడు.

రమణ బుర్రలో తళుక్కుమని ఒక ఉపాయం మెరిసింది. సాదిక్‌ను చెయ్యిపట్టుకొని చీకట్లోకి లాక్కెళ్ళాడు. తరవాత తన చొక్కా గుండీలు ఊడదీసుకోవడం మొదలు పెట్టాడు.

"ఊ! కానియ్, గబ గబా నీ చొక్కా విప్పెయ్. నా చొక్కా వేసుకో" అన్నాడు రమణ.

"మరి నువ్వో? నువ్వేం తొడుక్కుంటావు" అన్నాడు సాదిక్.

"నేను నీ చొక్కా వేసుకుంటాను. ఊ! తొందరగా కానియ్.. ఎవరయినా వస్తే చిక్కుల్లో పడతావు" అన్నాడు రమణ.

సాదిక్ తన చొక్కా ఊడదీసుకోవడం మొదలుపెట్టాడు.

"మనం చొక్కాలు మార్చుకుందామనేగా నువ్వన్నది. మరి మీ నాన్న సంగతి ఏమిటి? నీవంటి మీద చిరిగిన చొక్కా చూస్తే ఆయన నీతోలు వలిచేస్తాడు" అన్నాడు సాదిక్.

"మరేం ఫరవాలేదు. నాకు అమ్మ ఉంది. మా నాన్న నన్ను కొడుతుంటే మా అమ్మ ఊరుకోదు. అడ్డు పడుతుంది" అన్నాడు రమణ.

సాదిక్ కాసేపు తటపటాయించాడు. ఇంతలో ఎవరో దగ్గినట్టుంది. వెంటనే ఇద్దరూ చొక్కాలు మార్చుకుని, ఎవరి ఇంటి వైపు వారు పరుగులు తీశారు.

పీచు పీచు మంటున్న గుండెతో రమణ ఇంట్లోకి అడుగు పెట్టాడు. తల్లి రమణ చొక్కాను చూడనే చూసింది.

ఆమెకు కోపం ముంచుకొచ్చింది. వెంటనే తమాయించుకుంది. రంగుల పండగ రోజులు. పిల్లలు ఒకళ్ల నొకళ్ళు తరుముకుంటారు. కిందా మీదా పడతారు. చొక్కా చిరిగి ఉంటుంది. అని సరిపెట్టుకుంది – రమణని ఏమీ అనకుండా సూదీ దారం తెచ్చి చిరుగు కుట్టేసింది.

మరునాడు సాదిక్ తండ్రి గుమ్మంలో నించుని రమణ తల్లితో అన్నాడు –

"వదినా! రమణని నాకిచ్చెయ్. వాడిని నేను పెంచుకుంటాను"

"ఒక్క కొడుకుని పెంచడానికే పడుతున్నావు. ఇద్దరు పిల్లల్ని ఎలా పెంచగలుగుతావ్?" అంది ఆవిడ.

"రమణలాంటి కుర్రాళ్ళు పదిమందయినా సరే – హాయిగా పెంచుకోగలను" అన్నాడు సాదిక్ తండ్రి. తరవాత గొంతు సవరించుకున్నాడు. అతని గొంతు కొద్దిగా వణికింది.

"నిన్న రాత్రి మీవాడు, మా వాడు సందులో చీకట్లో నించుని ఉంటే, చీకట్లో ఏం చేస్తున్నారో చూద్దామని వెళ్ళాను. వాళ్ళ మాటలన్నీ విన్నాను. రమణ ఏమన్నాడో తెలుసా? నాకు అమ్మ ఉంది. నాన్న కొడితే అమ్మ అడ్డుపడుతుంది అన్నాడు" జరిగింది చెపుతూంటే సాదిక్ తండ్రి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "రమణ నా కళ్ళు తెరిపించాడు. సాదిక్‌ని తల్లిలేని లోటు లేకుండా పెంచాలని నాకు బుద్ధి చెప్పాడు" అన్నాడు.

"మీరు మార్చుకుంది చొక్కాలు కాదర్రా. మీ పెద్దవాళ్ళ మనసుల్ని" అంది రమణ తల్లి.

– బాల చెలిమి. మార్చి 1991

# MNR EDUCATIONAL TRUST

# 2-23 B / 350, Bhagyanagar (Phase III), Near HMT Hills, Opp : JNTU Kukatpally, Hyderabad – 500 072,
Ph : +91-40 - 23890835, 23899795, Fax : +91-40 -23897380

## MNR HIGHER EDUCATION CAMPUS

MNR Nagar, Narsapur Road, Sangareddy,Gr. Hyderabad - 502 294, A.P.
Cell : (0) 99597 36679, (0) 99662 33332, (08455) 230524, 230525.
E-mail : info@mnrindia.org website : mnrindia.org

*Enriching Lives Through Education & Health ...*



MEDICAL
DENTAL
AYURVEDA
PHARMACY
NURSING
ENGINEERING
PHYSIOTHERAPY
EDUCATION
ARTS & SCIENCE
SCHOOLS

- 42 Top Grade Institutions
- 35 Years Track Record
- 42000 Students
- 1800 Faculty Members

**MNR EDUCATIONAL TRUST** established in 1974 at Hyderabad is a leading education power house in South India. The Trust governs 42 Institutions with 42,000 students & 1800 teaching staff in its various institutions. MNR Educational Trust offers courses ranging from Primary education to Graduation / Post – Graduation & Research.




## *Facilities*

- 110 acres Lushgreen campus
- Central Library
- Separate Hostels for Boys & Girls
- Virtual Class rooms
- Outdoor & Indoor Sports
- Well connected by Air, Rail and Road
- Airport pick-up on request
- Separate & Secured (A/c, Non-A/c) hostels for Boys & Girls
- Wi-fi Internet Facility on campus
- Frequent Academic updation to Parent
- Modern Mess/Canteen facility serving delicious food
- Sports Complex with GYM, Indoor & Outdoor games
- Super Market & Canteen Facility
- 24 Hrs. Medical Facility in campus
- ATM Banking Facility
- Digital Classrooms

## *42 top Grade Institutions*

- MNR Medical College
- MNR Dental College
- MNR Ayurveda Medical College
- MNR College of Physiotherapy
- MNR Master of Science (Medical) College
- MNR Institute of Paramedicals
- MNR College of Nursing
- MNR School of Nursing
- MNR College of Pharmacy
- MNR College of Engineering & Tech.
- MNR PG Teacher Education Colleges (M.Ed)
- MNR Teacher Education Colleges (B.Ed)
- MNR Elementary Teacher Education Colleges (D.Ed)
- MNR Rural PG College of Education (M.Ed)
- MNR TPT Teacher Education Colleges
- MNR Degree Colleges
- MNR Junior Colleges
- MNR Residential Junior Colleges
- MNR Residential Schools
- MNR Group of Schools



M N Raju
Chairman





M. Ravi Varma
Director.

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 1st - August - 2021,
ISSN 2581-3188 Postal Dates: 28th & 29th Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2021-2023

## దక్కన్ ల్యాండ్ ఎనిమిది సంవత్సరాల ప్రస్థానం...
















తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2020 డిసెంబర్ సంచికతో 100 నెలలు పూర్తి చేసుకుంది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' కృషి చేసింది. ఇప్పటి వరకు వెలువడిన సంచికలను 12 నెలలకు ఒక సంపుటిగా (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో వచ్చే సంచికలను కూడా ఇదేవిధంగా తీసుకువస్తామని తెలియజేస్తున్నాం. ఆసక్తికలవారు ఒక్కో సంపుటిని రూ.400/-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం). 'ఐఎస్ఎస్ఎన్' ఆమోదం పొందిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక పట్ల చూపుతున్న ఆదరణకు ధన్యవాదాలు.













**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288

Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAKMAHINDRABANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar